ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ చవితి మ.1.51 వరకు అనంతరం పంచమి; నక్షత్రం: శతభిషం రా.2.57 వరకు అనంతర పూర్వాభాద్ర; అమృతకాలం: రా.1.05 నుండి 2.55 వరకు; వర్జ్యం: ఉ 8.22 నుండి 10.08 వరకు; దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు, మ.2.48 నుండి 3.36 వరకు ; రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com   Journalism first!

సంపుటి:57 • సంచిక:266 • గురువారం 10 జనవరి 2019 • హైదరాబాద్ • పేజీలు:12+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

124వ రాజ్యాంగ సవరణకు

కాదు కాదంటూనే ఔనన్నారు



సమన్యాయం కోసమే 10శాతం కోటా తెచ్చాం. మాపై అబద్ధాలు ప్రచారం చేస్తున్న వారికి ఈ బిల్లే సమాధానం. ఈ బిల్లు వల్ల ఎవరికీ అన్యాయం జరగదు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకే ఇది చేయూతగా నిలుస్తుంది. దీన్ని ఆమోదించినందుకు అభినందనలు

పెద్దల సభ ఓకే



సెలెక్ట్ కమిటీకి పంపాలన్న తీర్మానం వీగిపోయింది

రాష్ట్రపతి సంతకమే తరువాయి

ఓటింగ్

165 ✔

7 ✘

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: అగ్రకులాల పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు అనుకూలంగా 165 మంది, వ్యతిరేకంగా ఏడుగురు ఓటు వేశారు. కాంగ్రెస్ సహా మెజారిటీ విపక్ష పార్టీలు ఈ బిల్లుకు మద్దతు పలికాయి. డీఎంకే ఈ బిల్లును సెలెక్ట్ పంపాలని కోరుతూ వ్యతిరేకంగా ఓటు వేసింది. అయితే ఓటింగ్‌లో మూడింట రెండింతల మందికి పైగా సభ్యులు మద్దతు పలకడంతో ఈ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందినట్లు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రకటించారు. లోక్‌సభలో ఇప్పటికే బిల్లు

➪ 3వ పేజీలో...



పేదల కోసమే ఈబిల్లు: మంత్రి థావర్ చంద్ గెహ్లాట్

రాజ్యాంగ పరంగా చిక్కులు తప్పవు : కపిల్ సిబల్

ఈబీసీ బిల్లు బెడిసి కొట్టేనా?

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

సార్వత్రిక ఎన్నికలకు మూడుమాసాల ముందు ఎన్‌డిఎ ప్రభుత్వం అత్యుత్సాహంతో రూపొందించిన అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాలకు రిజర్వేషన్ బిల్లు ఎన్‌డిఎకు ఆశించిన రాజకీయ ప్రయోజనం నెరవేర్చకపోగా బెడిసికొట్టే ప్రమాదముందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి బిల్లుపై వివిధ రాజకీయ పక్షాల్లో వ్యతిరేకతుంది. అయితే ఎన్నికల నేపథ్యంలో అవేవీ ఈ బిల్లును నేరుగా వ్యతిరేకించలేకపోతున్నాయి. దీనికి చట్టసభల్లో అడ్డం చెప్పలేకపోతున్నాయి. అయితే ఈ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని పరిశీలకులు పేర్కొంటున్నారు. రిజర్వేషన్ల ఆశయానికిది తూట్లుపొడిచే అవకాశముందని కూడా తేల్చేస్తున్నారు. ఇది సుప్రీంకోర్టులో నిలబడే అవకాశంలేదని స్పష్టం చేస్తున్నారు. రాజ్యాంగాన్ని రచించిన రాజ్యాంగ పరిషత్ కొన్ని తరాలుగా అణిచివేతకు గురౌతున్న కులాల్ని ఇతరుల్తో సమానంగా సామాజిక హక్కు కల్పన కోసం ఈ రిజర్వేషన్లను ప్రతిపాదించింది. ఎస్‌సి, ఎస్‌టిలకు

➪ 3వ పేజీలో...

రిజర్వేషన్ల అధికారం రాష్ట్రాలకివ్వాలి

మా అసెంబ్లీ తీర్మానాన్ని ఓకే చేయాలి

ఈబీసీ బిల్లుపై చర్చలో తెరాస డిమాండ్



బీజేపీలో చేరిన తృణమూల్ ఎంపీ

కండువా కప్పిన అమిత్‌షా

9లో



మహాకూటమిలో మేం చేరం

కాంగ్రెస్, బీజేపీలకు దూరంగా ఉంటాం

నవీన్ పట్నాయక్ వెల్లడి

9లో

ఫాస్ట్ ట్రాక్‌లో పాలన



సీఎంవోలో చకచకా పెండింగ్ ఫైళ్ల పరిష్కారం

- మార్చికల్లా ఒక్కటీ పెండింగ్ ఉంచొద్దని సీఎం ఆదేశాలు
- కార్యదర్శుల పునర్నియామకం తర్వాత పుంజుకున్న వేగం
- ఉన్నతస్థాయి ఉద్యోగుల బదలీలపైనా కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పూర్తిస్థాయి మంత్రి మండలి లేకపోయినా ఉన్నతాధికార యంత్రాంగం పరిపాలనను పరుగులు పెట్టిస్తోంది. తెరాస అధినేత కేసీఆర్ రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎంవోలో ఇదివరకే ఉన్న కార్యదర్శులను కొనసాగిస్తూ పునర్ని యామక ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఫైళ్ల పరిష్కార బాధ్యతలను వారికి అప్పగించారు. అసెంబ్లీ రద్దు అనంతరం సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా దాదాపు నాలుగు నెలల కాలంగా ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన అనేక ఫైళ్ళు పెండింగ్‌లో ఉన్నాయి. అభివృద్ధి, సంక్షేమ రంగాలకు సంబంధించి ముఖ్యమైన ప్రతిపాదనలన్నీ ప్రస్తుతం శరవేగంగా పరిష్కారమవు తున్నాయి. పెండింగ్ ఫైళ్ళతో పాటు ఆయా ప్రభుత్వ శాఖల నుంచి సీఎంవోకు అందిన ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిర్ణయం తీసుకుంటు న్నారు. సీఎం స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన కొన్ని కీలక ఫైళ్లను పరిష్కరించే బాధ్యతలను ముఖ్య సలహాదారు డాక్టర్ రాజీవ్‌శర్మకు అప్పగించారు. మిగతా ఫైళ్లను శాఖల వారీగా పర్యవేక్షించే సీఎంవో అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి ఏ ఒక్కటీ పెండింగ్ ఉండొద్దని సీఎం కేసీఆర్ వారికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వివిధ అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, కీలక పద్దులకు నిధుల కేటాయింపు, ప్రధానంగా అన్ని స్థాయిల్లో ఉద్యోగుల బదిలీలు, శాఖాపరమైన విచారణల సమీక్షకు సంబంధించిన ఫైళ్లను క్రమంగా పరిష్కరిస్తూ వస్తున్నారు. తాను సంతకం చేయాల్సి ఉన్న ఫైళ్లన్నింటినీ వెంటనే

➪ 2వ పేజీలో...

స్పీకర్ ఎంపికలో తలమునకలు





పోచారం, పద్మాదేవేందర్ రెడ్డితో మాట్లాడిన సీఎం కేసీఆర్

ఆంధ్రప్రభ, హైదరాబాద్: పదవుల పందేరంపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఎడతెగని కసరత్తు కొనసాగిస్తున్నారు. భర్తీ చేయాల్సిన పదవుల సంఖ్య భారీగానే ఉన్నప్పటికీ ఆశావహుల సంఖ్య అనేక రెట్లు ఎక్కువగా ఉండడంతో సామాజిక సమీకరణలు, పార్టీకి సేవలు, భవిష్య త్తులో ఆయా నేతలు ఉపయో గపడే అంశాలను, రాజకీయంగాను కలి సొచ్చే అంశాలను

➪ 2వ పేజీలో...

30 పంచాయతీల్లో అధికారుల నిర్వాకం

నో ఎలక్షన్

- ఓటర్లు లేకపోయినా ఎస్టీలకు రిజర్వు
- అభ్యర్థులు లేక ఎన్నికకు ఆటంకం
- ప్రత్యేక అధికారుల పాలనే శరణ్యం?

10లో



3 నిమిషాలు ఆలస్యం

చాన్స్ మిస్

- గడువు ముగిసిందంటూ నామినేషన్ స్వీకరించని అధికారి
- సర్పంచ్ అభ్యర్థి ఆగ్రహం.. వాగ్వాదం
- రూల్స్ ప్రకారమే వ్యవహరించానన్న ఆర్వో
- వంగూరు పంచాయతీ ఎన్నికల సీన్

10లో



ఆర్థిక వేగంలో

భారత్ టాప్

2018-19లో భారత్ జీడీపీ 7.3 శాతం

ప్రపంచబ్యాంక్ అంచనా

వివరాలు 8లో...



మోడీ డిఫెన్స్‌లో పడ్డారు

9లో

యువత సిక్సర్లతో గుణపాఠం చెప్పాలి

జైపూర్‌లో రైతు ర్యాలీలో రాహుల్ గాంధీ

మిచెల్‌తో మీకు లింకేంటి?

మాపై అబద్ధాల ప్రచారానికి రిజర్వేషన్ల బిల్లే సమాధానం.. షోలాపూర్ బీజేపీ ర్యాలీలో ప్రధాని మోడీ

9లో





సీతారామాకు క్లియరెన్స్

సీఎంకు ఎమ్మెల్యే అజయ్ కృతజ్ఞతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావును ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ నుండి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే పువ్వాడ అజయ్కుమార్ బుధవారం సాయంత్రం కలిశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు,తాగునీటి సమస్యను తీర్చేందుకు రూ.13వేల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సీతారామా ఎత్తిపోతల పథకానికి సీఎం కృషి ఫలితంగా తుది అనుమతులు లభించిన నేపథ్యంలో పువ్వాడ అజయ్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కృషి జిల్లా చరిత్రలో అజరామరంగా నిలిచిపోతుందని అన్నారు. ఖమ్మం జిల్లా సీతారామా ప్రాజెక్టుతో సంపూర్ణంగా సస్యశ్యామలమవుతుందన్నారు.

అజయ్కు ప్రమోషన్ ఖాయమా?

ఖమ్మం జిల్లానుండి టీఆర్ఎస్ నుండి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కావడం, సామాజికసమీకరణలు కూడా అనుకూలంగా ఉండడంతో ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్కు ఈ దఫా ప్రమోషన్ ఖాయమన్న చర్చ జరుగుతోంది. గతంలో ఖమ్మం జిల్లా నుండి తుమ్మల నాగేశ్వరరావు క్యాబినెట్లో ఉండగా, ఆయన పాలేరు నుండి పోటీచేసి ఓటమి పాలవడంతో ఇపుడు కమ్మ సామాజికవర్గం నుండి బలమైన నేతగా అజయ్ రేసులో ఉన్నారు. టీఆర్ఎస్ పార్టీవర్గాల్లో కూడా అజయ్కు ప్రమోషన్పై చర్చ జరుగుతోంది. అయితే క్యాబినెట్లో తీసుకునే స్థాయిలో ఈ పదోన్నతి ఉంటుందా? లేక మరేదైనా ప్రాధాన్యత దక్కుతుందా? అన్నదానిపై ఆసక్తి నెలకొంది.

5525 మంది రైతు కుటుంబాలకు

రూ. 276 కోట్ల బీమా చెల్లింపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో 5821 మంది రైతులు చనిపోయినట్లు నమోదు కాగా, రైతు బీమా పథకం కింద ఇంతవరకు 5525 మందికి పరిహారం చెల్లించినట్లు వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి తెలిపారు. ప్రతి మృతుడి కుటుంబానికి 5 లక్షల రూపాయల చొప్పున వారి కుటుంబాలకు ఇంతవరకు రూ.276.25 కోట్లు డిపాజిట్ చేశామని తెలిపారు. మిగిలిన మృతుల కుటుంబాలకు పరిహారం వెంటనే చెల్లించాల్సిందిగా ఎల్ఐసీ అధికారులను కోరామని పార్థసారథి చెప్పారు.

అసంపూర్తి సమాచారంతో ఉన్నవాటిని ఎల్ఐసీ అధికారులు వెనక్కి పంపించారని, జిల్లాలవారీగా నోడల్ అధికారులు మృతులకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా సేకరించి పంపించాల్సిందిగా ఆయన సూచించారు. మృతులు, వారి కుటుంబాలకు సంబంధించిన డాటాను ఎలాంటి తప్పిదాలు లేకుండా వెంటనే అప్లోడ్ చేయాల్సిందిగా పార్థసారథి కోరారు. నామినీలకు సంబంధించిన బ్యాంకు ఖాతాల విషయమై బ్యాంకు అధికారులతో త్వరలో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ పథకానికి 2019-20 బడ్జెట్లో అవసరమైన నిధులు కేటాయించేందుకు రైతు బీమా కింద కొత్త పట్టాదారుల జాబితాను రూపొందించేందుకు డాటాను సీసీఎల్ఏ నుంచి పొందాల్సిందిగా నోడల్ అధికారులకు సూచించారు.

గౌడల అభివృద్ధి కేసీఆర్ ఘనతే



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గౌడల అభివృద్ధి కేసీఆర్ ఘనతేనని, ముఖ్యమంత్రి కేసీఆర్ గౌడలను, బిసిలను ఆదుకున్నట్లు గతంలో ఏ సీఎం కూడా ఆదుకోలేదని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ వి.శ్రీనివాసగౌడ్ అన్నారు. తెలంగాణభవన్లో బుధవారం గౌడ ఐక్యసాధనసమితి క్యాలెండర్ను ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖరగౌడ్, గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్తో కలిసి శ్రీనివాసగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గౌడకులవృత్తిని నిషేధించారని, కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే చెట్టుపన్ను రద్దుచేయడమే కాకుండా గీతకార్మికులకు పెన్షన్, చనిపోయిన వారికి రూ.6లక్షల ఎక్స్గ్రేషియా పథకం కూడా ప్రకటించారన్నారు.

ఫాస్ట్ ట్రాక్లో పాలన

మార్చికల్లా ఒక్క ఫైల్ కూడా పెండింగ్లో ఉంచొద్దని సీఎం ఆదేశాలు

(మొదటిపేజీ తరువాయి)

పంపాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులకు ఆదేశాలు అందాయి. ప్రజా ప్రయోజనార్థం ఇచ్చిన వాగ్దానాలను పరిశీలించి అవసరం మేరకు ఫైళ్లను సిద్ధం చేయాలన్న ఆదేశాలు కూడా ఇచ్చారు. వారం, పది రోజుల కాలంగా ఉన్నతాధికార యంత్రాంగంలో ఈ కసరత్తు జోరుగా సాగుతోంది. ప్రగతిభవన్కు చేరిన ఫైళ్లు ఇప్పటికే అన్ని శాఖల నుంచి వందల సంఖ్యలో ఫైళ్లు సీఎస్ పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి అధికార నివాసమైన ప్రగతి భవన్కు చేరాయి. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రకటించిన కొత్త పథకాలు, వాటి అమలుకు ఎలాంటి ఆటంకం ఎదురుకాకుండా ఉండేందుకు అవసరమైన ఫైళ్లను తక్షణమే పంపాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులకు సీఎంవో మార్గదర్శకాలు ఇచ్చింది. న్యాయపరమైన చిక్కులతో ముడిపెట్టుకుని ఉన్న ఫైళ్ల పరిశీలన, పర్యవేక్షణ, పరిష్కారంపై ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం మేరకు సీఎంవోలో ఐఏఎస్, ఐపీఎస్లతో పాటు ఉన్నతస్థాయి పోస్టుల్లో ఉన్న అధికారుల బదిలీల ప్రక్రియ కూడా కొనసాగుతోంది. సాధారణ పరిపాలన శాఖ ద్వారా సీఎం పరిశీలనకు పంపించిన ఫైళ్ళన్నింటినీ సీఎం ప్రగతి భవన్కు తెప్పించుకున్నారు. ఇటీవలే తన కార్యాలయ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన ఈ అంశాలపై చర్చించారు.



ఫైళ్ల విభజనకు ప్రత్యేక బృందం

తక్షణమే ప్రభుత్వం ఆమోదించాల్సిన ఫైళ్లను ప్రాధాన్యతా క్రమంలో శాఖలవారీగా విభజించాలని సూచించారు. వాటిని పరిశీలించి విషయాన్ని వివరించే బాధ్యతలను సీఎం కార్యాలయ కార్యదర్శులైన నర్సింగ్రావు, స్మితా సభర్వాల్లకు అప్పగించారు. ప్రభుత్వం తీసుకోవాల్సిన కొన్ని విధానపరమైన నిర్ణయాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అనుమతులు, మంజూరీలు, ప్రభుత్వరంగ సంస్థల్లో పదవుల నియామకాలకు సంబంధించిన ఫైళ్ళు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ముఖ్యమంత్రి పరిశీలించి ఆమోదించాల్సి ఉంటుంది. ఈ ఫైళ్ళలో కొన్నింటిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో పరిశీలించి పరిష్కరించే అధికారాలున్నప్పటికీ సీఎం మౌఖిక ఆదేశాలు తప్పనిసరి. వివిధ సందర్భాల్లో సీఎం ఇచ్చిన హామీల మేరకు ఆర్థిక పరమైన మంజూరీల ఫైళ్ళపై తప్పనిసరిగా ఆయనే సంతకం చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత పథకాలకు సంబంధించిన నిధుల వ్యయం ఫైళ్ళు, కేంద్రానికి పంపాల్సిన నివేదికలను కూడా ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రోత్సాహకాలు, అభివృద్ధి రాయితీలకు సంబంధించిన ఫైళ్లను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తారు. పారిశ్రామిక మౌలిక సదుపాల అభివృద్ధి సంస్థ, గ్రామీణాభివృద్ధి, ప్రణాళిక, అంతరంగిక వ్యవహారాలు, సాధారణ పరిపాలన నిర్ణయాలకు సంబంధించినవాటితోపాటు కొన్ని కీలకమైన పదవుల బదిలీలకు సంబంధించిన ఫైళ్ళు కొంత కాలంగా సీఎం కార్యాలయంలో పరిశీలన నిమిత్తం పెండింగ్లో ఉన్నట్లు సమాచారం. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, పరిపాలన వికేంద్రీకరణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన సీఎం కేసీఆర్ అందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలపై దృష్టి పెట్టారు. క్షేత్రస్థాయి కార్యాచరణ ప్రణాళికలు ఇప్పటివరకు కొంతమేరకు సత్ఫలితాలను ఇస్తున్నప్పటికీ, వాటిని మరింతగా మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇదివరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సిఫారసు చేస్తూ పంపిన ఫైళ్లను మాత్రం వేరుచేసి పెండింగ్లో పెడుతున్నారు. ఇటీవల పెండింగ్ ఫైళ్లలో కొన్నింటిని ముఖ్యమంత్రి అనుమతితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిష్కరించినట్లు సమాచారం.

సీఎంఆర్ఎఫ్ ఫైళ్లపై దృష్టి

ప్రస్తుతం తప్పనిసరిగా ముఖ్యమంత్రి ఆమోదం పొందాల్సిన ఫైళ్ళను సీఎం క్యాంపు కార్యాలయానికి చేర్చారు. వీటితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సిఫారసు చేసిన మరో ఆరున్నర వేలకు పైగా సీఎంఆర్ఎఫ్ ప్రతిపాదనలు సీఎం కార్యాలయ అధికారుల పరిశీలనలో ఉన్నాయి. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వాటిని ప్రత్యేకంగా పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నారు. ఎంత లేదన్నా మూడు, నాలుగు నెలల పాటు సీఎంఆర్ఎఫ్ ధరఖాస్తుల పరిశీలన కొనసాగనుంది.

స్పీకర్ ఎంపికలో తలమునకలు

(మొదటిపేజీ తరువాయి)

దృష్టిలో పెట్టుకుని ఆచితూచి కసరత్తు కొనసాగిస్తున్నారు. ఈనెల 17వ తేదీనుండి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండగా, 18వ తేదీన స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరగనుంది. షెడ్యూల్ ఖరారు చేసినందున మంత్రివర్గ కూర్పు ఆలస్యమైనా.. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరపాలి కాబట్టి ఆ రెండు పదవులపై కేసీఆర్ గత కొద్దిరోజులుగా కసరత్తు చేస్తున్నారు. వీలైనంత తొందరగా, వీలైతే సంక్రాంతిలోగానే ఆయా పదవులకు సరిగ్గా సరిపోయే వారిని ఎంపిక చేయాలని ఆయన భావిస్తున్నారు. స్పీకర్ పదవి అనేది అత్యం ప్రాముఖ్యమైనదని, ముఖ్యమంత్రి తర్వాత ప్రొటోకాల్ అందుకునే పదవి అదేనని సీఎం ఇదివరకే చెప్పారు. శాసనసభ హుందాతనాన్ని కాపాడే.. చూడగానే పెద్దరికం ఉట్టిపడేలా ఉండేవారు, అందుకుతగ్గట్టు ఆహార్యం కూడా ఉంటే బాగుంటుందని సీఎం అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే స్పీకర్ ఎన్నిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. స్పీకర్ పదవి కోసం అభ్యర్థిని ఎంపిక చేస్తే, దాని ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ సమీకరణలు, మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు కూడా చోటుచేసుకుంటాయి. ఎంపీ అభ్యర్థుల ఎంపికపై కూడా దీని ప్రభావం పడుతుంది. ఆదినుండి స్పీకర్ పదవికి నిజామాబాద్ జిల్లా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్, ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ పేర్లు వినిపిస్తున్నాయి. కేసీఆర్ కాళేశ్వరం పర్యటన తర్వాత ఈటల రాజేందర్ పేరు స్పీకర్ రేస్ నుండి పక్కకు వెళ్ళినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆ ఇద్దరితో సీఎం మాటామంతీ

తాజాగా పోచారం శ్రీనివాసరెడ్డి, పద్మాదేవేందర్ రెడ్డి పేర్లు బలంగా వినిపిస్తుండగా, ఇరువురితోనూ సీఎం కేసీఆర్ వ్యక్తిగతంగా మాట్లాడినట్లు సమాచారం. సీఎం కేసీఆర్ సూచనమేరకు పోచారం శ్రీనివాసరెడ్డి సుముఖత వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే సీఎం మదిలో ఏముందో అధికారికంగా ప్రకటిస్తే గానీ తెలీదు. గత సభలో బీసీకి ఈ పదవిని ఇచ్చినందున బలహీనవర్గాలకు ఈ పదవి ఇచ్చే చర్చ కూడా జరుగుతోంది. సీఎం తర్వాత అత్యంత ముఖ్యమైన రెండు చట్టసభల అధిపతుల పదవులను బీసీలకే ఇచ్చామని, ఇది మా కమిట్మెంట్ అంటూ సీఎం ఇటీవల మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో రెడ్యానాయక్ కూడా ఆ పదవికి సమర్థుడేనని, దీనిని కూడా సీఎం సీరియస్గా పరిశీలిస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. స్పీకర్ పదవికి పోచారం లేదా పద్మాదేవేందర్రెడ్డికి ఖరారైతే డిప్యూటీస్పీకర్ పదవి బీసీ,ఎస్సీ,ఎస్టీలలో ఒకరికి దక్కవచ్చు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు ఎంపికచేసే నేతలను కూడా ముందుగానే తేల్చేస్తారని, సంక్రాంతికి ముందే ఈ ప్రకటన ఉంటుందని టీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మరికొన్ని పదవుల భర్తీ కూడా సంక్రాంతికి ముందే జరుగుతుందన్న ప్రచారముంది.



సామాన్యుడి ప్రశ్నకు స్పందించిన

కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మేడ్చల్ జిల్లా కీసర పట్టణంలోని చెరువు కబ్జాకు గురవుతున్న అంశాన్ని వెంకట్ బోగి అనే స్థానికుడు ఆవేదనాపూర్వకంగా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్ళగా దీనిపై మేడ్చల్ జిల్లా కలెక్టర్, హెచ్ఎండీఎకు ఆదేశాలిచ్చారు. ఫిర్యాదుకు స్పందించి వెంటనే చర్యలు తీసుకోమని సూచించారు. డ్రైనేజీ నీళ్ళు, గుర్రపుడెక్క కారణంగా ఈ చెరువుమొత్తం పాడైపోయిందని మురుగునీటిని మళ్ళించాలని గతంలోనే స్థానికులు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. సామాన్యుడి విజ్ఞప్తులు, ఫిర్యాదులకు కేటీఆర్ స్పందించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

కేంద్రంలో చక్రం తిప్పుతాం

- హోదాకు కేసీఆర్ మద్దతు తెలిపారు
- మేము 25 ఎంపీ సీట్లు గెలుస్తాం
- తెరాస 17 సీట్లతో కలిపి కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తాం
- ఒంటరిగానే ఎన్నికల బరిలోకి
- ఆంధ్రప్రభ - ఇండియా ఎ హెడ్ చానల్తో జగన్



అమరావతి, ఆంధ్రప్రభ: లోక్సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో తాము చక్రం తిప్పుతామని వైకాపా అధినేత వైఎస్ జగన్ ధీమా వ్యక్తం చేశారు. జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాము తప్పకుండా అధికారంలోకి వస్తామని చెప్పారు. సుదీర్ఘ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఆంధ్రప్రభ, ఇండియా ఎహెడ్ చానెల్తో ఆయన పాదయాత్ర చేస్తూనే మాట్లాడారు. తెలంగాణలో విజయం సాధించినందుకు కేసీఆర్కు అభినందనలు తెలిపాం. ఆయన ఏపీకి హోదా విషయంలో మద్దతు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మేమిక్కడ 25 సీట్లు గెలుస్తాం, తెరాస గెలిచే 17 సీట్లతో కలిసి మొత్తం 42 ఎంపీ సీట్లతో కేంద్రంలో కచ్చితం గా కీలకపాత్ర పోషిస్తాం అని జగన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

జాతీయ పార్టీలైన భాజపా, కాంగ్రెస్లు ఆంధ్రప్రదేశ్కు తీరని అన్యాయం చేశాయని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని ఆయన అన్నారు. జాతీయ పార్టీల డొల్ల హామీలతో ఇప్పటికే రాష్ట్ర ప్రజలు తీవ్రంగా విసిగిపోయారన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం కోసం ఎన్నిరకాల హామీలైనా ఇస్తుంటారని, ఆయనకు ఏమాత్రం విశ్వసనీయత లేదన్నారు. హోదాపై చంద్రబాబు నాయుడు ఇప్పటికే పలు దఫాలుగా యుటర్న్లు తీసుకున్నారన్నారు. ఎన్నికల్లో ఒంటరి గానే బరిలోకి దిగుతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులు తీవ్రమైన కష్టాల్లో ఉన్నారని, తాను ప్రకటించిన నవరత్నాలు పథకాల ద్వారా వారిని ఆదుకుంటామని చెప్పారు. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి కల్పిస్తున్న రిజర్వేషన్లు న్యాయస్థానాల్లో ఎంతవరకూ నిలబడతాయో చూడాల్సి ఉంద న్నారు. రైతులకు రుణమాఫీ అని చెప్పి ఇంతవరకూ రుణమాఫీ చేయలేదని, కరువు కాటకాలు వచ్చిన ఆ ప్రాంతాలకు చంద్రబాబు వెళ్లడంగాని, అక్కడ రైతులను పట్టించుకోవడంగాని జరగలేదని, కరవు పరిస్థితులు రాష్ట్రంలో నెలకొంటే చంద్రబాబునాయుడు జాతీయ రాజకీయాలంటూ రోజుకొక రాష్ట్రం తిరుగుతున్నారని అందుకే రైతాంగం చంద్రబాబును నిన్ను నమ్మం బాబూ అంటున్నాదని జగన్ అన్నారు.



అదే విధంగా మహిళా సంఘాలకు రుణాలు మాఫీ చేస్తామని, గతంలో సున్నా వడ్డీకి వారికిరుణాలు ఇచ్చేవారని, చంద్రబాబునాయుడు డ్వాక్రా సంఘాల రుణాలుమాఫీ చేయకపోవడమే కాకుండా సున్నా రుణాలు కూడా ఇవ్వకపోవడంతో వారి రుణాలు తీర్చలేదని బ్యాంకులు వారి ఇళ్లకు వెళ్లి జప్తుచేశారని విశాఖ, విజయనగరం జిల్లాలో మహిళా సంఘాల సభ్యులు తెలిపారని, దీంతో మహిళా సంఘాలు కూడా చంద్రబాబును నమ్మడంలేదని తెలిపారు. అదే విధంగా ఉద్యోగాలిస్తామని, నిరుద్యోగభృతి ఇస్తామని నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చి, వారిని కూడా మోసంచేశారని, ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వకుండా, ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు విభాగాలలో వేలాదిమంది ఉద్యోగులను తొలగించారని జగన్ విమర్శించారు. రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 40 లక్షల మందియువతకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, ఒక్కరికి కూడా ఉద్యోగం రాలేదని, ఒక్క పరిశ్రమ కూడా ఐదేళ్లలో ఏర్పాటుచేయలేదని, దీంతో నిరుద్యోగులు కూడా చంద్రబాబును నమ్మటంలేదని అంటున్నారని జగన్ అన్నారు.

గుండె నిండా జనం... తీర్చుకుంటా రుణం!

- నవరత్నాలతో తలరాత మారుస్తా
- ఇచ్ఛాపురంలో పైలాన్ ఆవిష్కరణ
- పాదయాత్ర ముగింపు సభలో వైఎస్ జగన్

అవకాశమిస్తే 30 ఏళ్లు రాజన్న రాజ్యం



ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, ప్రభన్యూస్ బ్యూరో : ప్రజాసంకల్పయాత్రలో ప్రజల గుండె చప్పుడు విన్నాను. ఆ గుండె చప్పుడిని నా గుండె చప్పుడుగా మార్చుకున్నాను అని ఏపీ ప్రతిపక్షనేత, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. దేశ చరిత్రలోనే 3,648 కిలోమీటర్లు మేర సాగి, చారిత్రాత్మక పాదయాత్రగా ముగిసిన సందర్భంగా ఇచ్ఛాపురం పాత బస్టాండ్ సెంటర్లో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో అశేష జనవాహిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. దాదాపు 14 నెలలుగా 3,648 కిలోమీటర్లు నడిచింది తానైనప్పటికీ నడిపించింది మాత్రం ప్రజలేనని స్పష్టంచేశారు. హైదరాబాద్ నుండి దుబాయ్ 3 వేల కిలోమీటర్లని, కాశ్మీర్ నుండి కన్యాకుమారి 3,440 కిలోమీటర్లన్నారు. తన చేత ప్రజలు చేపించిన పాదయాత్ర మాత్రం 3,600 కిలోమీటర్లు దాటి ప్రపంచ రికార్డు సృష్టించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నోటికి, మెదడుకు కనెక్షన్ తెగిపోయిందన్నారు. అందుకే ఇష్టానుసారంగా మాట్లాడుతూ ప్రజలను, అధికారులను ఆయోమయానికి గురిచేస్తున్నారన్నారు. నాలుగున్నరేళ్లలో చంద్రబాబు హయాంలో దగాపడ్డ రైతన్న, మోసపోయిన డ్వాక్రా మహిళలు, ఉద్యోగం రాక నిరాశలో ఉన్న యువతను పాదయాత్రలో కలిశానని, వారి గోడును విన్నానని తెలిపారు. ఇలా ప్రతి ఒక్కరిని కదిలిస్తే చంద్రబాబు పాలనపై ఏంమటున్నారో తెలిసిందన్నారు. చంద్రబాబును నమ్మం అంటూ వారంతా ఘంటాపథంగా చెబుతున్నారని తెలిపారు. ఇవన్నీ తన పాదయాత్రలో అనుభవాలన్నారు.

ఎన్నికల్లో గెలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డగోలుగా 600 హామీలు ఇచ్చి పచ్చిగా మోసం చేసిన తీరు తనసెంతగానో చలించేవిధంగా చేసిందన్నారు. ఇదంతా చూసిప్పుడు పిల్లలను బిచ్చగాళ్లుగా తయారుచేసే వారి సంపాదనపై ఆధారపడే సోమరిపోతులు, స్వార్థపరులకు ఈ ముఖ్యమంత్రికీ తేడా కనిపించలేదన్నారు. ఈ సందర్భంగా కొన్ని అనుభవాలను పంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తాను అధికారంలోకి వస్తే పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తానని, లేని పక్షంలో రైతు నష్టపోకుండా రూ. 4 వేల కోట్లతో ధర స్థిరీకరణ నిధి ఏర్పాటుచేస్తానని చెప్పారు. రైతన్నకు ఏదైనా జరగరానిది జరిగితే వైయస్సార్ భీమా పథకం కింద రూ. 5 లక్షలు చెల్లించి ఆ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

బాబు మాటలు రైతులు నమ్మరు

రాష్ట్రంలో పంటలు దిగుబడి చూస్తే గుండె తరుక్కు పోతుందని చెప్పారు. దివంగత నేత వైయస్సార్ హయాంలో సాగు విస్తీర్ణం 42.70 లక్షల హెక్టార్లు ఉంటే చంద్రబాబు హయాంలో 40 లక్షల హెక్టార్లకు పడిపోయిందన్నారు. కానీ ఈ పెద్ద మనిషి నదుల అనుసంధానం అంటూ విచిత్రమైన ప్రకటనలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. దేశంలోనే వ్యవసాయంలో మన రాష్ట్రమే నెంబర్ వన్ అంటున్నాడన్నారు.

మహా ప్రకాశం

- రూ.5 వేల కోట్లతో రామాయపట్నం పోర్టు
- 2022 నాటికి పూర్తి చేస్తాం
- రైతులు సహకరిస్తే మరింత అభివృద్ధి : ఏపీ సీఎం చంద్రబాబు

ఒంగోలు, ప్రభ న్యూస్ బ్యూరో : ప్రకాశం జిల్లా ప్రజానీకం కల సాకారమైంది. మహాప్రకాశం దిశగా రాష్ట్ర ప్రభుత్వం తొలిఅడుగు వేసింది. ప్రకాశం జిల్లా అభివృద్ధిలో కీలకమలుపు తీసుకురానున్న రామాయపట్నం పోర్టుకు, ఆసియా పల్ప్ సంస్థ ఆధ్వ ర్యంలో భారీ కాగితపు పరిశ్రమకు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాలోని ఉలవపాడు మండలం రామాయపట్నం వద్ద శంకుస్థాపన చేశారు. మేజర్ పోర్టా, నాన్మేజర్పోర్టా అన్న సంశయాలు అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టును 2022 నాటికి పూర్తిచేస్తామన్నారు. కాగితపు పరిశ్రమలో దిగ్గజమైన ఆసియా పల్ప్ కంపెనీ ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమ నెలకొల్పడానికి ముందుకు రావడం శుభసూచకమన్నారు. పోర్టు, భారీ పరిశ్రమ కలిపి ఏర్పాటు చేయడం ద్వారా ప్రకాశం జిల్లా అభివృద్ధికి హితోధికంగా ఉపయోగపడు తుందని చంద్రబాబు పేర్కొ న్నారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి పైలాన్లను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి అంతకు ముందు భారీ కాగితపు పరిశ్రమకు సంబంధించి అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు.

ప్రకాశం జిల్లా రామాయపట్నం వద్ద నైసర్గికమైన అన్ని అనుకూలతలు ఉన్నాయని, ఇక్కడ పోర్టు నిర్మిస్తే లాభాలు ఆర్జిస్తున్న అనేక పోర్టుల కంటే మెరుగైన పోర్టుగా మారుతుందని చాలా కాలంగా జిల్లా ప్రజానీకం డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన దుగరాజపట్నం పోర్టుకు సానుకూలత లేదని, కేంద్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చిన తరుణంలో రామాయపట్నం పోర్టుపట్ల మరింత డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో రామా యపట్నం పోర్టును రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తుందని చంద్రబాబు ప్రకటించారు. అందుకు అనుగుణంగా అడ్డంకిగా ఉన్న కృష్ణపట్నం పోర్టు యాజమాన్య హక్కులు కుదింపు చేస్తూ నవయుగ కంపెనీని చంద్రబాబు అంగీకరింపచేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా రామాయపట్నం పోర్టును రాష్ట్రప్రభుత్వం రూ. 5 వేలకోట్లతో నిర్మాణం చేయడానికి సంకల్పించింది. ప్రాథమిక అంచనా ప్రకారం ప్రకాశం జిల్లా రామాయపట్నం నుంచి నెల్లూరు జిల్లా చెన్నూరు వరకు మూడు వేల ఎకరాల్లో భూసేకరణ పూర్తిచేసి రామాయపట్నం పోర్టు నిర్మిస్తున్నామని చంద్రబాబు ప్రకటించారు. తొలివిడతగా 5 బెర్తుల నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. మేజర్, నాన్మేజర్ పోర్టంటూ ప్రతిపక్షాలు గొడవచేసే ప్రయత్నం చేస్తున్నాయని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పోర్టు నిర్మాణాన్ని చేపట్టిందని 2022 నాటికి పూర్తిచేస్తామని ప్రకటించారు.



నాది పవిత్ర యాత్ర..

అది విరామయాత్ర

ప్రజలదగ్గరికి వెళ్లడం, సమస్యలు తెలుసుకోవడం నేనుకూడా సమర్థిస్తానని, తాను ఒక పవిత్రమైన ఆశయంతో పాదయాత్ర నిర్వహించానని, కానీ ప్రతిపక్షనేత జగన్ మాత్రం విరామాలతో పాదయాత్ర ముగించారని చంద్రబాబు ఛలోక్తులు విసిరారు. నాది పవిత్రయాత్ర - అది విరామయాత్ర అంటూ వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ పనితీరుపై మరోసారి విరుచుకుపడిన చంద్రబాబు రాష్ట్రంలో దొడ్డిదారిన పాలన చేయాలని చూస్తున్నారని, అందుకే కోడికత్తి కేసును ఎన్ఐఏకి అప్పగించారని చంద్రబాబు విమర్శించారు.

బిల్లు బెడిసి కొట్టేనా?

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ స్థాయిలో రిజర్వేషన్లున్నాయి. రాష్ట్రంలో వెనుకబడ్డ సామాజికవర్గాలకు రిజర్వేషన్ ఉంది. లోక్‌సభ, శాసనసభల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు సీట్ల కేటాయింపు జరిగింది. రాష్ట్రాల్లోని స్థానిక సంస్థల్లో మాత్రం బిసిలకు రిజర్వేషన్ సదుపాయం అమలౌతోంది. ఇప్పటికీ ఇన్ని రకాల సదుపాయాలున్నాయి. ఇదికాక కొత్తగా ఇబిసి రిజర్వేషన్ వల్ల సాధించే సామాజిక ప్రయోజనం ఏంటన్నది అర్థంకావడంలేదంటూ విశ్లేషకులు పేర్కొంటున్నారు. తరాల తరబడి సాగుతున్న సాంఘిక అసమానతల్నితొలగించే లక్ష్యంతోనే దేశంలో రిజర్వేషన్లున్నాయి. ఇవి వెనుకబాటుకు గురైన వర్గాలకు మాత్రమే పరిమితం చేశారు. వీటి వెనుక ఎలాంటి ఆర్థిక లేదా పేదరిక నిర్మూలనా లక్ష్యాల్లేవు. కానీ ఇప్పుడు అగ్రవర్ణాల్లోని పేదల కోసం రిజర్వేషన్ల కల్పన ప్రతిపాదన రాజ్యాంగ పరిషత్ నిర్దేశించిన రిజర్వేషన్ల మౌలిక సూత్రాలకే విరుద్ధంగా ఉంది. ఇప్పటికే దేశంలో పలురకాలుగా పేదరిక నిర్మూలనా పథకాలు అమలౌతున్నాయి. కొత్తగా అగ్రవర్ణాల్లోని పేదలకు ప్రభుత్వ విద్య, ఉద్యోగావకాశాల్లో పదిశాతం రిజర్వేషన్ల వల్ల అదనంగా సాధించగలిగేదేం ఉండదు. అగ్రవర్ణాల్లోని పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమైతే అందుకు రాజకీయ రిజర్వేషన్లు కూడా కల్పించాలి. లేదా పేదరిక నిర్మూలన కోసం ఇతర దేశాల్లో సమర్ధవంతంగా అమలౌతున్న కొన్ని పథకాల్ని అధ్యయనం చేసి ఇక్కడ ఆచరణలో పెట్టాలి. ఆస్ట్రేలియాలో ఉపాధిలేని కుటుంబాలకు ప్రభుత్వమే నెలనెలా 4వేల డాలర్లు చెల్లిస్తోంది. ఇందులో వెయ్యి డాలర్లు ఇంటిఅద్దెకు పోగా మిగిలిన 3వేలడాలర్లతో కుటుంబ జీవనం సాఫీగా సాగుతోంది. విద్య, వైద్యం వంటి సేవలు వీరికి ఉచితంగానే లభిస్తున్నాయి. ఉపాధి లభించిన తర్వాత ఈ సౌలభ్యాన్ని ప్రభుత్వం తొలగిస్తోంది. అలాగే మరికొన్ని దేశాలు ఎన్నోరకాలుగా పేదల్ని ఆదుకునే కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. కాగా ఆర్థికంగా వెనుకబడ్డ కుటుంబాలకంటూ పదిశాతం అదనపు రిజర్వేషన్ల వల్ల అనవసర పోటీ వివాదాలు తప్ప ఆ వర్గాలకు నేరుగా ప్రయోజనం చేకూరదు. అగ్రవర్ణాలైన బ్రాహ్మణ, వైశ్య, క్షత్రీయ, కమ్మ, కాపు, రెడ్డి వంటి సామాజికవర్గాలకు చెందిన పిల్లలు మంచి వాతావరణం, సంప్రదాయాల మధ్య పెరుగుతారు. వీరితో పోలిస్తే బలహీనవర్గాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడ్డ పిల్లలకు ఇన్ని సదుపాయాలు అందుబాటులో ఉండవు. కానీ ఈ కోటా క్రింద అమలయ్యే రిజర్వేషన్ల కోసం వీరంతా ఒకేరకమైన అర్హత పరీక్షను ఎదుర్కోవాల్సుంటుంది. ఇందులో తిరిగి వ్యత్యాసాలు ప్రభలే అవకాశముందని పేర్కొంటున్నారు. అలాగే రిజర్వేషన్ల అర్హత కోసం నిర్దేశించిన 8లక్షల్లోపు వార్షికాదాయం, ఐదెకరాల్లోపు మాగాణి భూమి వంటివి కూడా నిర్హేతుకంగా ఉన్నాయి. గ్రామాల్లోనిఅగ్రవర్ణాలకు చెందిన దాదాపు ప్రతి ఒక్కరు ఈ పరిధిలోకొచ్చేస్తారు. పట్టణాల్లో కూడా ఈ సామాజికవర్గాలకు చెందిన 80శాతం మందికిపైగా ఈ పరిధిలోనే లెక్కలు చూపిస్తారు. దీంతో నిజమైన అర్హులకు ఎలాంటి సౌలభ్యం చేకూరదు.

అయితే ఇప్పుడీ అంశం సామాజిక ప్రయోజనాలకంటే రాజకీయ ప్రయోజనాల ప్రాతిపదికన రూపుదిద్దుకోవడంతో విపక్షాలు, వాటి అనుబంధ ప్రజాపక్షాలు కూడా నేరుగా దీనిపై విమర్శలు సంధించే సాహసం చేయలేకపోతున్నాయి.



31నుంచి బడ్జెట్ సమావేశాలు

ఫిబ్రవరి 1న ఓటాన్ అకౌంట్ బడ్జెట్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగుస్తూనే తదుపరి జరగబోయే బడ్జెట్ సమావేశాల తేదీలను ఖరారు చేశాయి. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశమై ఈ మేరకు తేదీలను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. అయితే తుది నిర్ణయాన్ని ఇంకా అధికారికం గా ప్రకటించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ వర్గా ల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం జనవరి 31న బడ్జెట్ సమావేశాలను ప్రారంభించి ఫిబ్రవరి 13న ముగించనున్నా రని తెలుస్తోంది. జనవరి 31న పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగించనున్నారు. అదే రోజు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టి, మర్నా డు అంటే ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న బడ్జెట్ కావడంతో దీన్ని ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌గానే పరిగణించాల్సి ఉంటుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతారు. సాధారణంగా బడ్జెట్ సమావేశాలెప్పుడూ రెండు విడతలుగా జరుగుతాయి. తొలి విడతలో బడ్జెట్ ప్రవేశపెడితే, సుమారు నెల రోజుల విరామం అనంతరం రెండో విడత సమావేశాల్లో దానిపై చర్చ జరుగుతుంటుంది. అయితే ఈసారి మాత్రం ఒకే విడతలో సమావేశాలను ముగించాలనికేంద్రం నిర్ణయించినట్టు తెలుస్తోంది. మార్చిఏప్రిల్ నెలల్లోపలు విడతలుగా లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏక విడత సమావేశాలతో ముగించనున్నారని ప్రచారం జరుగుతోంది.

124వ రాజ్యాంగ సవరణకు పెద్దల సభ ఓకే

కాదు కాదంటూనే ఔనన్నారు

(మొదటిపేజీ తరువాయి)

పాస్ అయ్యింది. బుధవారం రాజ్యసభ దీనిపై 8 గంటల పాటు సుదీర్ఘంగా చర్చ జరిపి ఆమోదం తెలిపింది. పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించడంతో ఇక రాష్ట్రపతి సంతకంతో ఈ బిల్లు చట్టంగా రూపొందనుంది. ఈ బిల్లుతో ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్లు ఫలాలు అందనున్నాయి. చర్చలో సుమారు 36 మంది ఎంపీలు ప్రసంగించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ చర్చను ప్రారంభిస్తూ... రిజర్వేషన్లు లేని పేద వర్గాలకు న్యాయం చేకూర్చేందుకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల బిల్లు తెచ్చామని తెలిపారు. ఈ బిల్లుతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు ఎటువంటి నష్టం కలగదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు కూడా ఈ బిల్లుకు ఆమోదం తెలుపుతుందని భావిస్తున్నామని అన్నారు. ఆ... వెనుకబాటుతనాన్ని గుర్తించేందుకు సమయానుగుణంగా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మార్గదర్శకాలు జారీ చేస్తాయని తెలిపారు. సబ్ కా సాత్ - సబ్ కా వికాస్ విధానంలో భాగంగానే అగ్రవర్ణ పేదలకు న్యాయం చేసేందుకు రిజర్వేషన్ల బిల్లు తెచ్చామనికేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. యాభైశాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వొద్దని రాజ్యాంగంలో ఎక్కడా లేదని అన్నారు. ఆర్థిక వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని 2010లోనే కమిషన్ రిపోర్టు ఇచ్చినా కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. తాము బిల్లు తెస్తే, హడావిడిగా ఎందుకు తెచ్చారని తమను సవాల్ చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అగ్రవర్ణాల్లో కూడా అనేక మంది పేదలున్నారని అన్నారు. పేదలకు కూడా రిజర్వేషన్లు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలని అన్నారు. ఆర్థిక వెనుకబాటుతనం గుర్తించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేశామని చెప్పారు. మహిళా సాధికారత కోసం అనేక చర్యలు తమ ప్రభుత్వం తీసుకుందన్నారు. భారీ ఎత్తున మరుగుదొడ్లు నిర్మించి బహిరంగ మలవిసర్జన నిర్మూలించామని, మహిళల గౌరవాన్ని కాపాడామన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం సబ్‌కా సాత్ - సబ్‌కా వికాస్ నినాదంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. క్రికెట్లో సైతం చివరి ఓవర్లలోనే సిక్సర్లు కొడతారని, తమ ప్రభుత్వం కూడా అదే తరహాలో అభివృద్ధి, మార్పు కోసం మరిన్ని బిల్లులు తీసుకువస్తుందని అన్నారు.





రిజర్వేషన్లపై అధికారాన్ని రాష్ట్రాలకే అప్పగించాలి : తెరాస ఎంపీ బండ ప్రకాష్

తెలంగాణ రిజర్వేషన్ల పాల సీకి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని టీఆర్ ఎస్ ఎంపీ బండ ప్రకాష్‌డి మాండ్ చేశారు. ముస్లింలకు 12 శాతం, గిరిజను లకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. ఈ అంశాన్ని పా ర్లమెంటుకు తీసుకురావాలన్నారు. కేంద్రం మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావాలని కోరారు. తెలంగాణలో స్థానిక సంస్థలలో యాభై శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామన్నారు. ఈబీసీ విద్యార్థులకు 20లక్షల రూపాయల ఫెలోషిప్ ఇస్తున్నా మని చెప్పారు. అలాగే గురుకులాలలో ప్రత్యేక కోటా కూడా ఇచ్చామన్నారు. 33శాతం బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరామని తీర్మానం చేసి పంపినా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. 67 కోట్ల జనాభా ఉన్న బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్ కమిటీ పోస్టులలో కూడా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు తాము 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తే సుప్రీంకోర్టు దాన్ని కొట్టివేసిందన్నారు. యాభైశాతానికి మించి రిజర్వేషన్లు ఉన్నాయన్ని పేర్కొందన్నారు. దాని వల్ల బీసీ రిజర్వేషన్లను 24శాతానికి పరిమితం కావాల్సి వచ్చిందన్నారు. జనాభా ఆధారంగా ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై దేశ వ్యాప్తంగా ఒకే విధానం అమలు చేయాలని, లేనట్లయితే రాష్ట్రాలకే రిజర్వేషన్లపై అధికారం బదలాయించాలని కోరారు. 91శాతం తెలంగాణ జనాభా ఎస్సీ, ఎస్టీ, బీసీలున్నారని, కేవలం 9శాతం మంది మాత్రమే అగ్రకులాల జనాభా ఉందన్నారు. ఈ బిల్లుతో వారికి పదిశాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయన్నారు. 70 ఏళ్ల ప్రభుత్వ వైఫల్యం వల్లే ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా బిల్లు తీసుకురావాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఇచ్చే అవకాశం కల్పించాలని కోరారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు ఎందుకు కల్పించడం లేదని ఆర్జేడీ ఎంపీ ప్రొఫెసర్ మనోజ్‌కుమార్ ప్రశ్నించారు. కులాల వారీ జనాభా లెక్కలను ఎందుకు బయటపెట్టడం లేదని అడిగారు. ఈ బిల్లును హడావిడిగా తెచ్చారని టీఎంసీ, బీజేడీ ఎంపీలు డెరెక్, సుఖేందు రాయ్ అభిప్రాయపడ్డారు.



నరేంద్రమోడీ రియల్ మహాత్మ : బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

ఎన్నడూ లేనంత అభివృద్ధి నాలుగున్నరేళ్లలో జరిగిందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారవు అన్నారు. ఆరుకోట్ల మంది మహిళలలకు ఉచితంగా ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. అందరికీ న్యాయంచేసేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ రియల్ మహాత్మ అని అన్నారు. సామాజిక న్యాయసాధనలో భాగంగా ప్రధానమంత్రి తీసుకువచ్చిన బిల్లును అందరూ స్వాగతించాలని అన్నారు. 2012-13లో ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని, ఇప్పుడు వేగవంతమన ఆర్థికవృద్ధి కలిగిన దేశంగా ఖ్యాతికెక్కిందని అన్నారు. అనేక రంగాల్లో ఎన్నో ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు.

అసెంబ్లీఎన్నికల్లో ఓటమితోనే బిల్లు తెచ్చారు : కాంగ్రెస్ ఎంపీ ఆనంద్‌శర్మ

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం వల్లే బీజేపీ ఈబీసీ బిల్లు తీసుకువచ్చిందని కాంగ్రెస్ ఎంపీ ఆనంద్‌శర్మ అన్నారు. రాత్రికి రాత్రి బిల్లును తీసుకురావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంటును అగౌరవపరిచేలా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. పార్లమెంటు లోతైన పరిశీలన జరగకుండా నిబంధనలను బైపాస్ చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. నాలుగన్నరేళ్లలో 11 మిలియన్ల ఉద్యోగాలు ఊడిపోయాయని అన్నారు. రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్యోగాలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు.



రెండు రోజుల్లో బిల్లు తీసుకువచ్చి పాస్ చేయించుకోవడం పార్లమెంటు ప్రజాస్వామ్యాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్ బిల్లు తక్షణమే తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆ బిల్లుకు మద్దతు తెలిపేందుకు తాము రెడీగా ఉన్నామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని తాము మేనిఫెస్టోలో సైతం పెట్టామని గుర్తు చేశారు. హడావిడిగా బిల్లు తీసుకురావడం వల్ల రాజ్యాంగపరంగా అనేక ప్రశ్నలు తలెత్తుతాయని అన్నారు. రాజ్యాంగసవరణ బిల్లును బైపాస్ చేసి ఉద్దేశపూర్వకంగా తీసుకువచ్చాయన్నారు.

రాజ్యాంగపరంగా ప్రశ్నలు ఎదురుకాకతప్పదు :

కపిల్ సిబల్ ఈ బిల్లుకు రాజ్యాంగ పరంగా, అమలులో అనేక అవరోధాలు ఎదుర వుతాయని కాంగ్రెస్ ఎంపీ కపిల్ సిబల్ అన్నా రు. ఎటువంటి డేటా లేకుండా ఈ బిల్లు తీసుకు రావడమేమిటన్నారు. ఏ రిపోర్టు, ఏ డేటా లేకుండా రాజ్యాంగసవరణ బిల్లును తీసుకురా వడమేమిటన్నారు. ఎనిమిది లక్షల రూపాయ లలోపు ఆదాయం ఉన్న వారు పేదలుగా గుర్తించిన ప్రభుత్వం, అదే తరహాలో ఆదాయ పు పన్నుకు కూ డా వర్తింపజేయాలన్నారు. దాని వల్ల అనేక మందికి ఊరట కలుగుతుందన్నారు. మోడీ ప్రభుత్వంలో ఉద్యోగాలు భారీ ఎత్తున పోయాయని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పిస్తుందా? అని ప్రశ్నించారు. అనాలోచితంగా బిల్లు తీసుకురావడం వల్ల సుప్రీంకోర్టులో చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఆదాయపు పన్ను చెల్లించని వారి ఆదాయాన్ని ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. దీని వల్ల నకిలీ ఆదాయపు సర్టిఫికెట్లు పుట్టుకువస్తాయన్నారు. ఈబీసీలను గుర్తించేందుకు యంత్రాంగం ఏమిటన్నారు. నోట్ల రద్దులాగే ఇది కూడా అమలులో విఫలమవుతుందన్నారు.

వీగిపోయినవ తీర్మానం

సెలెక్ట్ కమిటీకి బిల్లు పంపాలన్న డీఎంకే ఎంపీ కనిమొళి తీర్మానంపై రాజ్యసభలో ఓటింగ్ జరిగింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 18, 155మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో ఈ తీర్మానం వీగిపోయినట్లు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రకటించారు.

ఇది తొందరపాటు బిల్లు : సీపీఐ ఎంపీ రాజా

రిజర్వేషన్ల బిల్లును తొందరపాటుగా తీసుకువచ్చారని సీపీఐ ఎంపీ డి.రాజా అన్నారు. ఆర్థిక వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగం వ్యతిరేకమన్నారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల వారికే రిజర్వేషన్లు ఉండాలని రాజ్యాంగంలో పేర్కొన్నారని చెప్పారు. ప్రభుత్వానికి ధైర్యముంటే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు తీసుకురావాలని డిమాండ్ చేశారు. బిల్లు తీసుకు వస్తే తాము మద్దతిస్తామని అన్నారు. హడావిడిగా బిల్లు తీసుకురావడంపై మండిపడ్డారు. కమ్యూనిస్టులు దేశంలో సమానత్వం కోసం పనిచేస్తున్నారని అన్నారు. ఈ బిల్లు సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని డీఎంకే ఎంపీ కనిమొళి తీర్మానం చేశారు. తాను ప్రవేశపెట్టిన తీర్మానంపై ఓటింగ్ జరపాలని పట్టుపట్టారు. ఈ డిమాండ్‌కు పలు విపక్షపార్టీలు మద్దతు పలికాయి. ఆర్థిక వెనుకబాటు తనం వ [illegible] ఆధారంగా రిజర్వేషన్లు తీసుకురావడాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నా రు. ఆర్థిక వెనుకబాటుతనాన్ని ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు.



మూడేళ్ల ముందే ఈ బిల్లుకు ఎందుకు తీసుకురాలేదు : టీడీపీ ఎంపీలు

మూడేళ్ల ముందే ఈ బిల్లు తీసుకువచ్చి ఉంటే మరింతమందికి ఉద్యోగాలు వచ్చేవని టీడీపీ ఎంపీ సిఎం.రమేష్ అన్నారు. విభజనతో రాజకీయంగా ప్రయోజనం వస్తుందని ఏపీని కాంగ్రెస్ పార్టీ విభజించిందని, అయితే అదే వారి పాలిట శాపంగా మారిందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకువస్తున్న ఈ బిల్లు వల్ల బీజేపీకి అదేగతి పడుతుందన్నారు. ఈ బిల్లును టేబుల్ ఐటంగా తీసుకువచ్చారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం వల్లే బీజేపీ ఈ బిల్లు తెచ్చిందన్నారు. ఈ బిల్లుకు తాము మద్దతిస్తున్నామని వెల్లడించారు. ఆఖరి రోజున హడావిడిగా తెచ్చారని టీడీపీ ఎంపీ సీతారామలక్ష్మి అన్నారు. కాపు రిజర్వేషన్ల బిల్లును కేంద్రానికి పంపినా ఆమోదం తెలపడం లేదన్నారు. కాపు రిజర్వేషన్ల బిల్లు, మహిళా బిల్లును కూడా తీసుకురావాలని కోరారు. ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం మిఠాయిలు పంచిపెట్టినట్టుగా బిల్లు తెచ్చారన్నారు. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. బిల్లు ప్రవేశపెట్టడానికి ముందు ప్రభుత్వం హోమ్ వర్క్ చేయలేదని టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అన్నారు. 1992లో సుప్రీంకోర్టు పదిశాతం ఈబీసీ కోటాను కొట్టివేసిందని గుర్తు చేశారు. యాభైశాతం కంటే రిజర్వేషన్లు ఉండొద్దని సుప్రీంకోర్టు స్పష్టంచేసిందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఏం సమాధానం చెపుతుందని ప్రశ్నించారు. ఎటువంటి నివేదిక లేకుండా హడావిడిగా బిల్లు తీసుకువచ్చారని అన్నారు. ఏపి నుంచి పంపిన కాపు రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించలేదని అన్నారు. అనాలోచితంగా రాష్ట్రాన్ని విభజించడం వల్ల ఏపి నష్టపోయిందని టిడిపి ఎంపీ టిజి.వెంకటేష్ అన్నారు.

అడవిలో జాగిలాలు.. వేటగాళ్లకు చెక్

- రంగంలోకి కొత్తగా డాగ్‌స్క్వాడ్
- 12 శునకాలకు ప్రత్యేక శిక్షణ
- తెలంగాణకు రెండు కేటాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వన్యప్రాణుల వేటగాళ్ళకు చెక్ పెట్టేందుకు అడవుల్లో జాగిలాలను రాష్ట్ర అటవీశాఖ ప్రవేశపెట్టింది. అడవుల విస్తీర్ణం పెంచ డంతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు అందుబా టులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో వినూత్న కార్యక్రమాలను తెలంగాణ అటవీశాఖ అమలుచేస్తోంది. జంతువుల కదలికలపై నిరంతర నిఘాను పటిష్టం చేసింది. వేటగాళ్ళను సులభంగా పట్టుకునేందుకు కొత్తగా డాగ్ స్క్వాడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్వాలియర్‌లో ట్రాఫిక్ ఇండియా అనే సంస్థ ఆధ్వర్యంలో పన్నెండు కుక్కలకు శిక్షణ ఇచ్చారు. తొమ్మిది నెలల శిక్షణ అనంతరం గత డిసెంబర్ చివరి వారంలో తెలంగాణ సహా ఐదారు రాష్ట్రాల అటవీశాఖలకు ఆ కుక్కలను అప్పగించారు. తెలంగాణకు రెండు కుక్కలను అందజేయగా, వాటిలో ఒకదానిని అమ్రాబాద్, రెండవ కుక్కను కవ్వాల్ రిజర్వుడు టైగర్ ఫారెస్టు అధికారులకు అప్ప గించారు. ఈ జాగిలాలు మనిషి కంటే 12 రెట్లు వేగంగా సమర్ధంగా వాసనను పసిగడతాయి. వేటగాళ్ళ చేతిలో మృత్యువాత పడిన జంతువులను పసిగట్టే రీతిలో జాగిలాలకు శిక్షణ ఇచ్చారు. ఈ జాగిలాలు శిక్షణ పొందుతున్న సమయంలో తెలంగాణ అటవీశాఖకు చెందిన నలుగు సిబ్బంది కూడా శిక్షణ పొందారు. వీరి ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్ పనిచేస్తుంది.



జాగిలాలు ప్రధానంగా వేటగాళ్ళు వేటాడి చంపిన జంతువుల చర్మం, ఎముకులు, మాంసం, వెంట్రుకలు, గోళ్ళును పసిగడతాయి. అలాగే వేటాడిన వ్యక్తులు వాడిన వస్తువులు అంటే ఆయుధాలు, పాదరక్షలు, అడుగులు, చేతిరుమాళ్ళు, సిగరెట్లు, బీడీలు వంటి వస్తువుల ఆధారంగా పసిగడతాయి. ఇప్పటికే అటవీ సమీప గ్రామాలు, అడవుల్లో సంచరించే ప్రజలకు డాగ్‌స్క్వాడ్ ప్రవేశంపై అవగాహన కల్పించారు. జాగిలాలు వేటగాళ్ళను ఎలా పట్టుకుంటాయనే అంశాలపై వివరిస్తున్నారు. దీనిపై మాక్‌డ్రిల్స్ కూడా అటవీశాఖ అధికారులు నిర్వహించారు. వన్యప్రాణు లను వేటాడితే కఠిన శిక్షలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

గణతంత్ర వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

ఉన్నతాధికారులతో ఎస్‌కే జోషి సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఆదేశించారు. ఈ వేడుకల ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ వేడుకల్లో 26న గవర్నర్ నరసింహన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, వేడుకలకు అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ద్వారా పరేడ్ గ్రౌండ్‌లో పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని చెప్పారు. గన్‌పార్క్, క్లాక్ టవర్, ఫతేమైదాన్ తదితర ప్రాంతాలను విద్యుద్దీకరించాలని జోషి సూచించారు. రహదారులు, భవనాల శాఖ ద్వారా అవసరమైన బారికేడ్లు, కుర్చీలు, సైనేజీల తోపాటు రాజ్‌భవన్, సెక్రెటరియట్, అసెంబ్లీ, హైకోర్టు, చార్మినార్ తోపాటు చారిత్రక భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆయన చెప్పారు. విద్యుత్ శాఖ ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా, మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా మంచినీటి సరఫరా, సమాచార శాఖ ద్వారా మీడియాకు ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్‌ఈడీ టీవీలు, వ్యాఖ్యాతల నియామకం, వేడుకల ప్రత్యేక ప్రసారానికి తగు ఏర్పాట్లు చేయాలని జోషి చెప్పారు. ఉద్యానవన శాఖ ద్వారా పరేడ్ గ్రౌండ్‌లో పుష్పాలతో అలంకరణ వినూత్నంగా ఉండాలన్నారు. వేడుకలకు హాజరయ్యే పాఠశాలల విద్యార్థుల కోసం ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అంబులెన్స్, అగ్నిమాపక ఏర్పాటు చేయాలని, అమరవీరుల స్మారక్ వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ పుష్పగుచ్ఛం సమర్పించేందుకు ఏర్పాట్లు చేయాలని జోషి ఆదేశించారు.



సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 10 జనవరి 2019

ఊరించే ఉద్యోగాలు ఎక్కడున్నాయి?

అగ్రవర్ణాల్లో వార్షికాదాయం 8 లక్షల రూపాయిల లోపు గల వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లును మోడీ ప్రభుత్వం పట్టుపట్టి పార్లమెంటు చేత ఆమోదింపజేసుకుంది. ఎకనామికల్లీ బ్యాక్ వర్డ్ (ఈబీసీ) వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు రాజ్యసభలో ప్రతిపక్షాలు తెచ్చిన సవరణలు వీగిపోయాయి.ఈ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందినప్పటికీ, వెంటనే అమలులోకి రావడం అనుమానమేనని బీజేపీ మిత్ర పక్షమైన శివసేన ప్రభుత్వం మీద నిప్పులు చెరుగుతోంది. ప్రభుత్వాన్ని పాతిపెట్టాలంటూ కఠినమైన పదజాలంతో విమర్శలు గుప్పిస్తోంది. ఎన్‌డిఏ కూటమిలోని ఇతర పార్టీలు కూడా ఈ బిల్లును అంత హడావుడిగా ఆమోదించాల్సిన అవసరం లేదనీ, సెలక్టు కమిటీకి పంపాలని కోరాయి.. లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ బిల్లును ఇంత అత్యవసరంగా ఆమోదింపజేసుకోవాలన్న ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని ప్రతిపక్షాలే కాక,మిత్ర పక్షాలు సైతం శంకించాయి. ఇవి అమలు జరిగే రిజర్వేషన్లు కావనీ, ఓట్ల కోసం ప్రధాని నరేంద్రమోడీ విసిరిన వల అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. సమాజంలో ఏ వర్గానికైనా రిజర్వేషన్లను వ్యతిరేకించేసాహసాన్ని ప్రస్తుతపరిస్థితుల్లో ఏపార్టీ చేయలేదు.అందుకే సెలక్ట్ కమిటికీ పంపాలని కోరాయి. రిజర్వేషన్ల తాయిలం చూపి అగ్రవర్ణాల్లో పేదల ఓట్లను బిజేపీ కొల్లగొట్టుకుని పోతుందేమోనన్న భీతితోనే ప్రతిపక్షాలు ముఖ్యంగా,కాంగ్రెస్ వంటి పార్టీలు వ్యతిరేకించాయి. బీజేపీ రాజకీయ లబ్ధి కోసమే ఈ బిల్లును తెచ్చిందంటూ రాజ్యసభలో కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ శర్మ బుధవారం చేసిన ప్రసంగం ఆలోచనలను రేకెత్తించింది. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు నానాటికీ హరించుకుని పోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాల్లో ఈబీసీలకు పది శాతం ఎక్కడి నుంచి తెచ్చి ఇస్తారని ఆయన వేసిన ప్రశ్న సహేతుకంగానే ఉంది. ఈబీసీలకి మాత్రమే కాదు.సమాజంలో ఇతర వర్గాలకు ప్రభుత్వం హామీ పడిన రిజర్వేషన్లు అమలు చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో అలవికాని వాగ్దానమే అవుతుందని శర్మ అన్నారు.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఉద్యోగాలు సృష్టించలేదు సరికదా, గత ఏడాదిలో కోటి ఉద్యోగాలు హుష్ కాకి అయ్యాయని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఈ) తన నివేదికలో పేర్కొంది.ఇవి కాకిలెక్కలు కావు. ప్రభుత్వం అందించిన గణాంకాలే. 2017లో కన్నా 2018లో ఉద్యోగాలు బాగా తగ్గిపోయాయని ఆ నివేదిక స్పష్టం చేసింది.2017డిసెంబర్ లో4.78 శాతం మాత్రమే ఉన్న నిరుద్యోగుల సంఖ్య ఏడాది వ్యవధిలో 8.38 శాతానికి పెరిగి పోవడం ఆందోళనకరమే.

ప్రభుత్వం అమలు జేస్తున్న మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రధాని మోడీ ఇచ్చినహామీ ఎండమావిగానే మిగిలింది. బీజేపీ పాలితరాష్ట్రా ల్లో ఉద్యోగాలు దారుణంగా తగ్గిపోతున్నాయని ఆనంద శర్మ గణాంకాలతో వివరించారు. సిఎంఐఈ అనే సంస్థ ఎప్పటికప్పుడు సర్వేని నిర్వహించి గణాంకాలను విడుదల చేస్తుంది.ఏడాదిలో కోటి ఉద్యోగాలు హుష్ కాకి అయ్యాయంటే మాటలు కాదు.అధికారంలోకి వస్తే రెండుకోట్లఉద్యోగాలు సృష్టిస్తామనీ,విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని రప్పించి దేశంలో ప్రతి కుటుంబానికీ లక్షలాది రూపాయిలను పంచుతామని గత ఎన్నికల ప్రచారం సందర్భంగా మోడీ వాగ్దానం చేశారు.నాలుగు సంవత్సరాల తొమ్మిది మాసాల నుంచి అధికారంలో కొనసాగుతున్నా ఆ వాగ్దానాన్ని నేటికీ అమలు జరపలేకపోయారు.అదే రీతిలో ఇప్పుడు ఈబీసీ రిజర్వేషన్లు కూడా అమలు జేయకుండా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు హడావుడిగా బిల్లు ఆమోదింప జేసుకున్నారన్న ప్రతిపక్షాల విమర్శలు సహేతుకంగానే ఉన్నాయి.పది సంవత్సరాల పాటు అధికారంలో కొనసాగిన యూపీఏ ప్రభుత్వం ఇదే మాదిరిగా వైదొలగే ముందు ఆహార భద్రతాపథకాన్ని పార్లమెంటు చేత ఆమోదింప చేసుకున్న తీరు ఇప్పుడు మోడీ ప్రభుత్వంచేస్తున్న హడావుడిని చూస్తే గుర్తొస్తోంది.అదీ ఆదర్శప్రాయమైన పథకమే. కానీ, తొమ్మిది సంవత్సరాలుపైగా అధికారంలో కొనసాగినతర్వాత చివరి క్షణంలో ఆహార భద్రతా పథకాన్ని ఆమోదింపజేసుకోవడానికి యూపీఏ ప్రభుత్వం ఆతృత చెందుతోందంటూ ఆనాడు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడైన ప్రస్తుత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆరోపించారు.ఇప్పుడు మోడీ ప్రభుత్వంచేస్తున్నదీ అదే.

కొత్త ఉద్యోగాలు సృష్టించడం అనేది ఆధునిక కాలంలో మన దేశంలోనే కాదు,అగ్రరాజ్యమైన అమెరికాలో సైతం అసాధ్యం .అందుకే,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా ఫస్ట్ (అమెరికాకు తొలి ప్రాధాన్యం) అనే నినాదాన్ని విడిచి పెట్టడం లేదు. బ్రిటన్ లోనూ అదే సమస్య. యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వైదొలగాలన్న గ్రేట్ బ్రిటన్ నిర్ణయానికి అసలు కారణం ఉద్యోగాల సమస్యే.

తమ దేశంలో ఉద్యోగాలన్నింటినీ యూరోపియన్ యూనియన్ దేశాలకు చెందిన వారు కొల్లగొట్టుకుని పోతున్నారన్న ప్రాంతీయ ద్వేషాన్ని ప్రజల్లో రెచ్చగొట్టడం వల్లే బ్రెగ్జిట్ కు ప్రజలు మద్దతు లభించింది. ఆర్థిక సంస్కరణల్లో ముందున్నామని గొప్పలు చెప్పుకుంటున్న చైనాలో కూడా ఉద్యోగాల సమస్య తీవ్రంగా ఉంది.ఆ సమస్య నుంచి అధిగమించేందుకే చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ఒకే బోర్డర్,ఒకే రోడ్డు(మహామార్గం) ప్రాజెక్టును అమలు జరిపేందుకు పట్టుదలతో యత్నాలు సాగిస్తున్నారు.అయితే ఈ ప్రాజెక్టును హామీ ఇచ్చినంత సులభంగా వేగంగా అమలు జేయడం సాధ్యం కాదు.ఎన్నికల ముందు కొత్త ప్రాజెక్టులు,కొత్త ఉద్యోగాలు, కొత్త పథకాలు మన దేశంలో మాదిరిగా అన్ని దేశాల్లోనూ ఉన్నవే.ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించిన ముద్రా ,డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి పథకాలు ఒక్క ఉద్యోగాన్ని కూడా సృష్టించలేకపోయాయి.మరోవైపు ప్రైవేటురంగంలో ఉద్యోగాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి.ఉద్యోగాల కల్పన కోసమే కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు వందలాది ఎకరాలు ధారాదత్తం చేస్తున్నాయి.ఆ భూములపై ఆ సంస్థలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాయి.ఉద్యోగాలు మాత్రం హుష్ కాకి అవుతున్నాయి.

హసీనా మార్క్ అణచివేత... అభివృద్ధి!

బంగ్లాదేశ్ లో ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అలాగే పలువురు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.1996నుంచి 2001 వరకూ మధ్య కాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే ప్రధాని హసీనా షేక నాల్గవ సారి అధికారంలోకి వచ్చినట్టు లెక్క. ఆమె నేతృత్వంలోని అవామీ లీగ్ అఖండ విజయాలు అనుమానాలనూ, ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఈ ఎన్నికలను ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బిఎన్‌పి) బహిష్కరించింది. హసీనా ప్రభుత్వాన్ని రద్దు చేసి తటస్థప్రభుత్వ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిపిస్తేనే, ఎన్నికల్లో పాల్గొంటామని ఆ పార్టీ ముందే స్పష్టం చేసింది. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ అధ్యక్షురాలు,మాజీ ప్రధాని ఖలీదా బేగం ప్రస్తుతం జైలులో ఉన్నారు.ఎన్నికల పోలింగ్ సందర్భంగా చోటు చేసుకున్న హింసలో ఆమె పార్టీకి చెందిన వారే ఎక్కువ మంది మరణించారు. 300 మంది సభ్యులు గల పార్లమెంటులో బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీకీ కేవలం ఏడు స్థానాలు మాత్రమే వచ్చాయి. ఎన్నికల బహిష్కరణకు ఆ పార్టీ నాయకత్వం పిలుపు ఇచ్చినా ఆ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయగా, వారిలో ఏడుగురు నెగ్గారు.ఎన్నికల ఫలితాలపై సమీక్షించాల్సిందిగా ఎన్నికల ట్రిబ్యునల్‌కు పిటిషన్ దాఖలు చేయాలని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ నిర్ణయించింది. పార్లమెంటుకు ఎన్నికైన ఏడుగురు ప్రతిపక్ష సభ్యులు ప్రమాణ స్వీకారం చేయడానికి నిరాకరించడంతో ఎన్నికల ప్రక్రియలో మరిన్ని చిక్కు ముడులు ఏర్పడ్డాయి.

ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షాలు ప్రచారం చేసుకోనివ్వకుండా నిరోధించడం వంటి అణచివేత చర్యలకు ప్రభుత్వం పాల్పడినప్పటికీ, దేశం వెలుపల ఈ ఎన్నికల ఫలితాలను అంతా ఆమోదిస్తున్నారు. ఈ ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపించాలని అనేక దేశాలు కోరినప్పటికీ, వచ్చే ఐదేళ్ళ వరకూ హసీనాయే ప్రధానిగా కొనసాగనున్న దృష్ట్యా తమ డిమాండ్ అరణ్య రోదన అవుతుందని ఆ దేశాలు భావిస్తున్నాయి.గడిచిన దశాబ్దం పైగా అధికారంలో ఉన్న అవామీలీగ్ తిరిగి ఎన్నిక కావడం పట్ల చైనా, రష్యాలు హర్షం వ్యక్తంచేశాయి. సాంఘిక, ఆర్థిక రంగాల్లో హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ బాగా పని చేయడం వల్లే ఆ పార్టీకి తిరిగి ప్రజలు పట్టం కట్టారని ఆ రెండు దేశాలతో సహాపలు దేశాలు భావిస్తున్నాయి.అయితే, అవామీ లీగ్ ప్రభుత్వం వాక్ స్వేచ్ఛనూ,ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందన్న విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యం నామమాత్రంగానే అమలు అవుతోందని పలువురు అంతర్జాతీయ విశ్లేషకులు సైతం వ్యాఖ్యానించారు.అయితే, క్రూరమైన చట్టాలను షేక్ హసీనా అమలు జేస్తున్నప్పటికీ,ఆమె హయాంలో ఆర్థిక,సాంఘిక రంగాల్లో సాధించిన ప్రగతిని పలువురు ప్రశంసిస్తున్నారు.



గడిచిన పదేళ్ళలో హసీనా ప్రభుత్వం ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని అణచి వేయడానికి తీసుకున్న చర్యలను అభినందిస్తున్నారు.2016లో హోలీ ఆర్టిజాన్ బేకరీపై జరిగిన దాడి తర్వాత మత దురభిమాన శక్తులపై తీసుకున్న కఠిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయని విశ్లేషకులు అభినందిస్తున్నారు. మత దురభిమాన శక్తులపై ప్రభుత్వం తీవ్ర స్థాయిలో విరుచుకుని పడటం వల్ల శాంతి భద్రతల పరిస్థితి మెరుగుపడింది.దాంతో విదేశీ పెట్టుబడిదారులు బంగ్లాదేశ్ వైపు చూడటం ప్రారంభించారు. ఆర్థిక కార్యక్రమాలు అవిచ్ఛిన్నంగా అమలుకు అనువైన వాతావరణం ఏర్పడిందనే నమ్మకం విదేశీ ఇన్వెస్టర్లకు కలిగింది.ఎన్నికల ముందు పలుకుబడి కలిగిన వాణిజ్య,పారిశ్రామిక వేత్తలు పలువురు ప్రధాని హసీనాను కలుసుకుని మద్దతు ప్రకటించడం ఇందుకు నిదర్శనం.

2008 తర్వాత హసీనా ప్రభుత్వం మహిళా సాధికారత కోసం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. సివిల్ సర్వీసుల్లోనూ, వ్యాపార, పారిశ్రామిక, విద్యా, వైద్యరంగాల్లో మహిళా భాగస్వామ్యం క్రమంగా పెరుగుతోంది.ఇళ్ళల్లో సేవలందించే (హౌస్ మెయిడ్స్) ఉద్యోగాలను వదిలి చాలా మంది మహిళలు రెడీమేడ్ దుస్తుల తయారీ కేంద్రాల్లో ఉపాధి పొందుతున్నారు. ఈ ఉద్యోగాల్లో వారికి పని చేసే ప్రదేశంలో భద్రత లభిస్తోంది.మంచి వేతనాలు లభిస్తున్నాయి.రెడీ మేడ్ దుస్తుల పరిశ్రమకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం కారణంగా ఇతర దేశాల నుంచి పోటీ ఉన్నా,ఈ పరిశ్రమకు మంచి ఆదరణ లభిస్తోంది. ఎంతో మంది మహిళలు ఉపాధి పొందడానికి అనువైన పరిశ్రమగా గుర్తింపు పొందింది. వ్యవసాయ మంత్రి మాతియా చౌదరి నేతృత్వంలో ఆ శాఖ తీసుకున్న చర్యల వల్ల కూడా వ్యవసాయరంగంపై ఆశలు పెరిగాయి.దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తుల మందగింపు అనేది నిన్నటి మాట.రైతులకు సబ్సిడీ విధానాన్ని పటిష్ఠంగా అమలు జేస్తున్నందువల్ల వారు అధికోత్పత్తిపై రైతులు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. హసీనా ప్రభుత్వం విద్యుదుత్పత్తి, సరఫరా పరిస్థితిని బాగా మెరుగు పర్చింది. దాంతో వ్యవసాయ రంగానికి విద్యుత్ పుష్కలంగా లభిస్తోంది.గ్రామాలకు కూడా కరెంట్ నిరంతరాయంగా లభిస్తోంది.మధ్య ప్రాచ్యంలో నూ, ఆగ్నేయాసియా దేశాల్లో నివసించే బంగ్లాదేశీయులు స్వదేశానికి భారీగా నిధులు పంపుతుండటం వల్ల కూడా బంగ్లాదేశ్ ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది. తమ బంధుమిత్రుల నుంచి అందుతున్న నిధుల వల్ల బంగ్లాదేశీయుల జీవన ప్రమాణం మెరుగు పడుతోంది. వారు తమ పిల్లలను బాగా చదివించు కోవడమే కాకుండా, చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభించి స్వయంపోషకత్వాన్ని పొందుతున్నారు. దేశ జనాభాలో సగం మంది పైగా చేతులలో మొబైల్ ఫోన్‌లు దర్శనమిస్తున్నాయి. మొబైల్ ఫోన్ ల వినియోగం పెరగడంతో పాటు డిజిటల్ లావాదేవీలు కూడా పెరుగుతున్నాయి. రహదారుల విస్తరణ, అభివృద్ధి వల్ల ఒక ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే వస్తువులు మరో ప్రాంతానికి గతంలో కన్నా తేలికగా,వేగంగా చేరుతున్నాయి. పన్నులను నిక్కచ్చిగా వసూలు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. అయితే, పన్నులు,రుణాల ఎగవేతలు పూర్తిగా అదుపులోకి రాకపోయినప్పటికీ, గతంలో కన్నా వసూళ్ళు పెరిగాయి.షేక్ హసీనా తీసుకున్న పటిష్ఠమైన చర్యల వల్ల ఆర్థిక పరిస్థితి గాడిలో పడింది. ప్రత్యర్థులపై ఆమె ఉక్కుపాదాన్ని మోపినప్పటికీ పాలనా రంగంలో ఆమె ప్రవేశపెట్టిన సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.అయితే, మీడియా స్వేచ్ఛ, గ్రామాల్లో చట్టబద్ధ పాలనలో హసీనా మార్క్ కనిపిస్తోంది.

-స్వామి

ఫలిస్తున్న విదేశాంగ విధానం!

2018 సంవత్సరం భారత విదేశాంగ విజయాల్లో కీలకమైందిగా భావించడానికి అనేక కారణాలున్నాయి. చైనాతో ఘర్షణాత్మక వైఖరి నుంచి సాధారణ సంబంధాలను నెలకొల్పడంలో విదేశాంగ విధానం కీలక పాత్ర పోషించింది. ఇరాన్ ముడి చమురుపై అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపు పొందడంలో కూడా సుష్మా స్వరాజ్ మంత్రిత్వశాఖ విజయం సాధించింది. రష్యాతో వ్యూహాత్మక సహకారం మరో ఎత్తుకు చేరింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ మరింత పెద్ద పాత్ర పోషించడానికి కూడా 2018లోనే బీజం పడింది. పాకిస్థాన్‌తోనూ, చైనా వెన్నుదన్ను ఉన్న మాల్దీవుల్లోని నాటి అబ్దుల్లా యమీన్ ప్రభుత్వంతోనూ ద్వైపాక్షిక సంబంధాల విషయంలో పురోగతి సాధించింది. మా స్కోపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో రష్యాతో రూ.40 వేల కోట్ల రక్షణాత్మక మిస్సైల్ వ్యవస్థ ఒప్పందం విషయంలో అమెరికా ఆగ్రహాన్ని సైతం ఖాతరు చేయకుండా భారత్ వ్యవహరించిన తీరు కూడా విదేశాంగ విధానాల విజయం ఖాతాలోకి వచ్చేదే!



మాల్దీవ్ ప్రెసిడెంట్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ...

డ్రాగన్ దేశంతో బలపడిన బంధం!

ఇక 2018 విదేశాంగ విధానాల విజయాల్లో అత్యంత కీలకమైంది.. చైనాతో ద్వైపాక్షిక సంబంధాల పరంగా సాధించిన పురోగతి. గత ఏప్రిల్‌లో చైనా నగరం వూహన్‌లో భారత ప్రధాన నరేంద్రమోడీ, చైనా అధ్యక్షుడు జింగ్ పింగ్ మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశం ఇరు దేశాల సంబంధాల చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. డోక్లాం ప్రతిష్టంభన తరువాత జరిగిన ఈ భేటీ మధ్యాసియాలో రెండు అగ్ర దేశాల మధ్య ఘర్షణాత్మక వాతావరణాన్ని తేలిక పరచడంలో కీలక భూమిక పోషించాయి. జీ-2 సమ్మిట్ నేపథ్యంలో నవంబర్ 30న బ్యూనోస్ ఏయిర్స్‌లో ప్రధాని మోడీ, జింగ్ పింగ్ మరోసారి చర్చలు జరిపారు.

అయినా కక్ష వీడని చైనా!

చైనాతో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో భారత్ పురోగతి సాధించినా, మధ్యాసియాలో శాంతియుత వాతావరణానికి, అభివృద్ధికి మన దేశ విదేశాంగ విధానం తోడ్పడినా.. డ్రాగన్ దేశం మాత్రం అణ్వాయుధ సరఫరా బృందంలో సభ్యత్వానికి మాత్రం అడ్డపడుతూనే వస్తోంది. ఇదే కాకుండా అజార్ మసూద్‌ను అంతర్జాతీయ తీవ్రవాదిగా ప్రకటించాలని ఐక్య రాజ్యసమితిలో భారత్ వాదనకు కూడా చైనా అడ్డుపడడం ఆపలేదు.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో కీలక పాత్ర

రష్యా అధ్యక్షుడు వ్లదమిర్ పుతిన్, ప్రధాని నరేంద్ర మోడీ ఆ దేశ పర్యాటక నగరమైన సోచిలో సమావేశం రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో సరి కొత్త చరిత్రను లిఖించింది. రష్యాతోనే కాకుండా జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాలతో కూడా భారత్ విదేశాంగ సంబంధాలు 2018లో మరింతగా మెరుగుపడ్డాయి. ఫిబ్రవరిలో పాలస్తీనాతో సహా 2018లో ప్రధాని నరేంద్రమోడీ 22 దేశాలను సందర్శించారు. ఇండో- పసిఫిక్ ప్రాంతంలో పెరుగు తున్న భారత్ పాత్రను ప్రధాని పర్యటించిన దేశాలన్నీ గుర్తించడం విశేషం.

ఇక పొరుగు దేశం పాకిస్థాన్ విషయంలో భారత్ దృఢంగా వ్యవహరించింది. సరిహద్దుల వెంబడి ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం మానుకోనంత వరకు ఎలాంటి చర్చలకు దిగేది లేదని తేల్చి చెప్పిన భారత్ అదే మాటకు కట్టుబడి ఉంది. అయితే ఇమ్రాన్ ఖాన్ పాకిస్థాన్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన నెల తరువాత గతసెప్టెంబర్‌లో న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం నేపథ్యంలో ఇరు దేశాల విదేశాంగ మంత్రుల చర్చలకు భారత్ అంగీకరించింది. అయితే ఈ అంగీకారం తెలిపిన 24 గంటల్లోనే భారత్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. కాశ్మీర్‌లో ముగ్గురు పోలీసులను ఉగ్రవాదులు అతి కిరాతకంగా హతమార్చిన నేపథ్యంలో విదేశాంగ మంత్రుల సమావేశాన్ని భారత్ రద్దు చేసుకుంది. మన దేశం ఎంతో కాలంగా కోరుతున్న కర్తార్ పూర్ కారిడార్ నిర్మాణానికి పాకిస్థాన్ తలూపడం విశేషం.

గడిచిన ఫిబ్రవరిలో మాల్దీవుల్లో ఆ దేశాధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ ఎమర్జెన్సీ విధించిన నేపథ్యంలో ఆ దేశంతో భారత్ ద్వైపాక్షిక సంబంధాలు విమర్శలకు దారి తీశాయి. అయితే అధ్యక్ష ఎన్నికల్లో అబ్దుల్లా యమీన్ ఓడిపోవడం ఇబ్రహీం మహ్మద్ గెలవడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు సాధారణ స్థాయికి వచ్చాయని చెప్పాలి. ఇబ్రహీం ప్రమాణ స్వీకారానికి ప్రధాని మోడీ హాజరు కావడంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగు పడ్డాయని విదేశాంగ వ్యవహారాల నిపుణులు భావిస్తున్నారు. నేపాల్, భూటాన్‌తో కూడా ద్వైపాక్షిక సంబంధాలు కొంత వరకు మెరుగుపడ్డాయి. పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో వరసగా మూడోసారి షేక్ హసీనా ప్రధానమంత్రిగా గెలవడం భారత్‌కు శుభవార్తగానే భావిస్తున్నారు.

అమెరికా మెడలు వంచి..

ఇరాన్ నుంచి ఏప్రిల్ మొదటి వారం వరకు ముడి చమురు దిగుమతి విషయంలో అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపు పొందిన జపాన్, దక్షిణ కొరియా వంటి ఎనిమిది దేశాల్లో మన దేశం కూడా ఉండడం 2018లో కీలక పరిమాణంగా చెప్పుకోవాలి. ఈ విషయంలో అమెరికా భారత్‌కి మినహాయింపు ఇవ్వడమంటే ఆ దేశం దృష్టిలో అంతర్జాతీయంగా మన దేశానికి పెరుగుతున్న ప్రాధాన్యతను గుర్తించడంగానే భావించాలి.

-ఎ.జి. దత్తా

ఉపాధ్యాయులకు ఎన్నికల 'పరీక్షలు'

అన్నీ పని దినాలలో వార్షిక ప్రణాళికను అనుసరిస్తూ, పాఠ్య ప్రణాళికసహాయంతో విద్యా భోదన చేసినప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటాము . డిసెంబర్ మాసంలోనే పదవ తరగతి పాఠ్య బోధనను పూర్తీ చేసి , మార్చి లోగల వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయడంలో భాగంగా ప్రభుత్వం నిర్వహించే పరీక్షలకు , పునభోదన గావిస్తూ, అర్థంగాని విషయాలను విద్యార్థులకు నివృత్తి చేస్తూ ముందు కెళ్లితేనే విద్యార్థి సమగ్ర ప్రగతికి బాటలు వేసినట్లవుతుంది . పరీక్షలు ముగిశాక , మూల్యాంకనం గావించి ఫలితాలు వెలువడటంలో ఉపాధ్యాయుల , పాఠశాల భవిష్యత్ ఇమిడి ఉంటుంది. కానీ ఈ సంవత్సరం రాష్ట్రంలో వరుస ఎన్నికలు ఉండటంతో, వాటి నిర్వహణ భాద్యత కేవలం ఉపాధ్యాయులపై ఉండటంతో పాఠశాలలో సమయలేమి కారణంగా, సరైన సమయంలో పాఠ్యముషాలు పూర్తిచేయలేక, వారిపై శ్రద్ధ తీసుకోలేక, వారిపాలిట శాపంగా మారుతున్నాయా అంటే అవుననక తప్పదు. నవంబర్ లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ పూర్తీ చేశారు . గ్రామపంచాయతీ ఎన్నికలకు మూడు దశలలో ఈ నెల 21,25,29 న ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల కమిషన్‌సర్వం సిద్ధం చేసుకుంది . ప్రాథమికవ్యవసాయ సహకార సంఘాల ఎన్నికలకు జనవరి 17 న నోటిఫికేషన్ ఇచ్చి ఫిబ్రవరి రెండవ వారంలో ఒకేరోజున 906 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి , అదేరోజున ఓట్ల లెక్కింపు చేపట్టి , గెలుపొందిన వ్యక్తులతో కమిటీలను ప్రకటించనున్నాయి. 9 డీసీసీబీలు, 9 జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలతో పాటు టెస్కాలకు ఎన్నికలు నిర్వహించి ఫిబ్రవరి 25 నాటికీ పూర్తిచేయాలనే ప్రణాళికతో వున్నారు. ఆ తర్వాత శాసన మండలి ఎన్నికలు ఆపై పార్లమెంటు ఎన్నికలు నిర్వర్తించడానికి ఎన్నికల కమిషన్ ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు ఇంచార్జ్ హెడ్ మాస్టర్, సీనియర్ అసిస్టెంట్, స్కూల్ అసిస్టెంట్ లతో నిర్వర్తిస్తారు. ఆర్వో, ఏఆర్వో లుగా గెజిటెడ్ అధికారులను నియమించాలి కానీ , వారి స్థానంలో స్కూల్ అసిస్టెంట్ లను నియమిస్తున్నారు. ఆర్వో , ఏఆర్వో లతో పాటు ఇతర పోలింగ్ సిబ్బందిగా, ఏదోరకమైన విధులను నిర్వర్తించడానికి ఉపాధ్యాయులను నియమిస్తున్నారు .ఉపాధ్యాయులకు ఈ ఎన్నికలు పరీక్షల్లాగే కనిపిస్తున్నాయి.

డా .పోలం సైదులు,9441930361


సమీక్షలేని రిజర్వేషన్లు!

మత, భాష, మైనారిటీ విద్యాసంస్థలు మినహాయించి ప్రభుత్వ రంగాలు, కేంద్ర, రాష్ట్ర పౌరసేవలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలతోపాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు చెందినవారికి సముచిత స్థానం కల్పిస్తూ భారతీయ చట్టంలో పొందుపరచిన సకారాత్మక అంశమే రిజర్వేషన్లు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల వారికి పార్లమెంటులో కూడా రిజర్వేషన్లను కల్పించారు. భారతీయ సమాజంలోని కులవ్యవస్థ కారణంగా షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు చెందినవారు తరతరాలుగా అణచి వేతకు గురైనట్టుగా గుర్తించిన భారత రాజ్యాంగ నిర్మాతలు ఆ వర్గాల ఉన్నతికి రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపరిచారు. ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థలు, ప్రభుత్వ రంగ ఉద్యోగాలలో 15 శాతం ఎస్సీలకు, 7.5 శాతం ఎస్టీలకు ఐదేళ్ల పాటు రిజర్వేషన్లు కల్పించారు. ఐదేళ్ల తర్వాత రిజర్వేషన్లను సమీక్షించాలని నిర్ణయించారు. కానీ ప్రస్తుతం రిజర్వేషన్ల వ్యవస్థ ఓటు బ్యాంకుగా మారింది. మారుతున్న ప్రభుత్వాలు రిజర్వేషన్లను పొడిగిస్తూ వస్తున్నాయే కానీ రిజర్వేషన్లను సమీక్షించడం లేదు. తగిన మార్పులు తీసుకురాకపోగా సమాజంలో ఇతర వర్గాలవారికి కూడా రిజర్వేషన్లను పాలకులు కల్పించారు. అయితే అన్ని రకాల రిజర్వేషన్లు 50 శాతానికి మించడానికి వీలులేదని సుప్రీంకోర్టు పరిమితి విధించింది. అనేక రాష్ట్రాలలో రిజర్వేషన్ల 50 శాతమే ఉండగా రాజస్థాన్‌లో 68 శాతం, తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలుపరుస్తున్నాయి. ఆయా రాష్ట్రాలలో చట్టాలు రూపొందించి అమలు చేస్తున్నాయి. భారతదేశంలో రిజర్వేషన్లు రాజకీయ అవసరమని, రిజర్వేషన్ల ఫలితాలు అనుకున్న మేరకు దక్కకపోయినా అనేకమంది వెనుకబడిన వారి ఉన్నతికి రిజర్వేషన్లు దోహదపడ్డాయని, సమానత్వం లేని యోగ్యత అర్థం లేనిదని, ఉన్నత వర్గాలవారు ధనవంతులుగా, వెనుకబడినవారు నిరుపేదలుగా మారే ప్రక్రియను రిజర్వేషన్లు అరికట్టాయని రిజర్వేషన్లను సమర్థిస్తున్నవారు చెబుతున్నారు.

రిజర్వేషన్ల కారణంగా భారతీయ సమాజంలో అంతర్గత విభజన ఏర్పడిందని మేధావులు, సమాజహితులు వాదిస్తున్నారు.. కులాంతర వివాహాలకు రిజర్వేషన్లను అడ్డుగోడగా పేర్కొంటున్నారు. ప్రతిభకు రిజర్వేషన్లు ప్రగతి నిరోధకాలని చెబుతున్నారు. కుల రిజర్వేషన్ల కారణంగా సమాజంలో కుల వ్యవస్థకు ఆజ్యం పోస్తున్నామని, కోటా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తే సమానత్వపు హక్కుకు భంగం వాటిల్లుతోందని చెబుతున్నారు. కుల రిజర్వేషన్ల కారణంగా పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతంగా ఉన్న మహిళా రిజర్వేషన్లు తగిన విధంగా అమలవ్వడంలేదని, రిజర్వేషన్లను పొడగించే ముందు సరైన సమీక్ష జరగాలని, రిజర్వేషన్ల కారణంగా మేధావులు విదేశాలకు వలస వెళ్తున్నారని రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నావారు వాదిస్తున్నారు. దేశంలో ప్రాథమిక విద్య, తీరుతెన్నులపై అధ్యయనానికి 1882లో హంటర్ కమిషన్‌ను ఆనాటి ప్రభుత్వం నియమించింది.. అన్నీ వర్గాల వారికి ఉచిత, నిర్బంధ విద్య అందించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని మహాత్మా జ్యోతిరావ్ పూలే డిమాండ్ చేశారు. సామాజికంగా విద్యపరంగా వెనుకబడిన వారి పరిస్థితిని అంచనా వేసేందుకు 1953లో కేల్కర్ కమిషన్‌ను నియమించారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు సంబంధించిన కమిషన్ సిఫార్సుకు ఆమోదం లభించగా ఇతర వెనుకబడినవారి సంబంధించి కమిషన్ సూచించిన ప్రతిపాదనలు తిరస్కరణకు గురయ్యాయి. 1979లో నియమించిన మండల్ కమిషన్ భారతదేశంలో ఇతర వెనుకబడిన వర్గాల వారు 52 శాతంగా ఉన్నారని 1980లో సమర్పించిన నివేదికలో పేర్కొంది. 22 శాతంగా ఉన్న రిజర్వేషన్ల కోటాను 49.5 శాతానికి పెంచాలని సిఫార్సు చేసింది. మండల్ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో కూడా అమలు పరచడంతో దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. భారతదేశంలో ముస్లింల విద్య, సామాజిక, ఆర్థిక పరిస్థితిని అధ్యయనం చేసేందుకు కేంద్రప్రభుత్వం 2003లో జస్టిస్ రాజిందర్ సచార్‌నేతృత్వంలో సచార్ కమిటీని నియమించింది. 2006లో కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. కమిటీ సిఫార్సుల మేరకు 'సంఘటిత వృద్ధి' కోసం మదర్సాల లో విద్య ప్రమాణాలను పెంచేందుకు మానవ వనరుల శాఖ పలు సదుపాయాలు కల్పించింది. ముస్లింల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టింది. మొత్తానికి రిజర్వేషన్ల అంశం సమాజంలో రిజర్వేషన్లు పొందుతున్న, పొందలేకపోతున్నవారి మధ్య అసమ్మతికి కారణమవుతోంది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారి అభ్యున్నతికి దేశంలో రిజర్వేషన్లు ఆవశ్యకత ఉన్నప్పటికీ రాజకీయ రంగు పులుముకోవడంతో రిజర్వేషన్ల వ్యవస్థ పెడదారి పడుతోంది. సమాజానికి హాని చేయని రిజర్వేషన్లు అమలవ్వాలని కోరుకుందాం.

-వి. సుదర్శన్

జనాభా దామాషాలో బీసీ రిజర్వేషన్లు అమలుచేయాలి



బీఎస్ రాములు,
తెలంగాణ
బీసీ కమిషన్ చైర్మన్

చట్ట సభలలోవలే ఉద్యోగ రంగం, న్యాయ వ్యవస్థలో ప్రాదేశిక నియోజక వర్గాల వారీగా అమలు జరిగినప్పుడే పూరిస్థాయి ప్రజాస్వామ్య వ్యవస్థని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు అన్నారు. ఈబీసీ రిజర్వేషన్లు అన్నీ కులాలు, మతాలకు వర్తిస్తాయని అన్నారు. కులం సర్టిఫికేట్ లేని వారికి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అనే తేడా లేకుండా అందరికీ నూతన అవకాశాలు పెరుగుతాయన్నారు. జనరల్ కేటగిరిలోని ఈబీసీ రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక వర్గాల వారందరికీ వర్తిస్తాయని, పేదరికానికి కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు.

సబ్సిడీ బియ్యం రేషన్ కార్డు ఉన్న వారంతా ఈబీసీ రిజర్వేషన్లకు అర్హులేనని, జనాభా ప్రాతిపదికపై బీసీ రిజర్వేషన్లు పెంచాల్సి ఉందని ఆయన డిమాండ్ చేశారు. బీసీ కోటకు ఏ మాత్రం నష్టం జరగకుండా ఈబీసీ రిజర్వేషన్‌లో క్రిమిలేయర్‌ను 25 శాతానికి పెంచితేనే గ్రామీణ, పట్టణ పేదలకు న్యాయం జరుగుతుందన్నారు.

టీ.పీసీసీకి కొత్తసారథి ఇప్పట్లో కాదు!

• లోక్‌సభ ఎన్నికలు అయ్యేవరకు ఉత్తమ్ కొనసాగింపు




హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర కాంగ్రెస్ రథ సారథి ఎవరనేది ఆ పార్టీలో చర్చ మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరా పరాజయం కావడంతో టీ పీసీసీ పదవికి మార్పు తథ్యమనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పదవి కోసం పలువురు నేతలు పావులు కదుపుతున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు వెలువడిన అనంతరం పంచాయతీ ఎన్ని కల నోటిఫికేషన్ రావడం.. ఆ తర్వాత లోక్‌సభ ఎన్ని కలు సమీపిస్తుండటంతో ఇప్పటికిప్పుడు రాష్ట్ర పార్టీ రథసారథి మార్పు ఉండకపోవచ్చనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ అధ్యక్షుడిని మార్చి కొత్తవా రికి బాధ్యతలు అప్పగిస్తే ఇబ్బందులు తెచ్చుకోవడం సరికాదనే అభిప్రాయంతో పార్టీ అధిష్టానం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అంటే పార్లమెంట్ ఎన్నికల వరకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డినే కొనసాగించి.. ఆ తర్వాత మార్పులు ఉంటాయని కూడా పలువురు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయంపై జరిగిన సమీక్షలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్ర కుంతియా, టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై కొందరు సీని యర్లు తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రచారం, టికెట్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని కూడా ఆరోపణలు చేశారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం ఇవన్ని గమనిస్తున్నదని పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత చెప్పారు. ఇప్పటికే ఎన్ని కలకు సంబంధించి.. టీ పీసీసీ నాయకత్వం అనుసరించిన విధానాలపైన కూడా కొంత మంది నేతలు హై కమాండ్‌కు ఫిర్యాదు చేసినట్లుగా ప్రచారం జరుగు తోంది. కాగా టీ పీసీసీ కమిటిన ప్రక్షాళన చేసి.. కూర్పు ను కుదించాలని కూడా ఏఐసీసీ నుంచి ఇప్పటికే ఆదేశాలు వచ్చిన విషయం తెలిసిందే. అంటే టీ పీసీసీ చీఫ్ తప్పా మిగతా కార్యవర్గాన్ని పునర్నియామకా నికి చర్యలు తీసుకోనున్నారు. టీ పీసీసీ కూర్పులో సీనియర్లకు ప్రాధాన్యత కల్పించడమే కాకుండా ప్రజల్లో పలుకుబడి ఉండి, నిత్యం జనంతోనే ఉండే వారికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనకు కాంగ్రెస్ పార్టీ వచ్చింది. ఈ కూర్పులో సీనియార్టీని కూడా పరి గణలోకి తీసుకోనున్నారు.

ఇదిలా ఉంటే టీ పీసీసీ చీఫ్ నియామకం ఏ వర్గా నికి ఇస్తుందనే చర్చ కూడా సాగుతోంది. సీఎల్పీ నేత ఎంపికను బట్టి టీ పీసీసీ బాధ్యతలు ఎవరికి ఇవ్వాలనే దానిపైన చర్చిస్తున్నట్లుగా సమాచారం. ఇప్పటివ రకు టీ పీసీసీ, సీఎల్పీ నేత పదవి ఒకే సామాజిక వర్గా నికి చెందిన నేతలకు అప్పగించిన విషయం తెలిసిం దే. దీంతో పార్టీలోని మిగతా సామాజిక వర్గాల నేతలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పుడలాకా కుండా సీఎల్పీ, పీసీసీ పదవుల విషయంలో సామా జిక న్యాయం పాటించాలని హై కమాండ్ నిర్ణయం తీసుకున్నట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతు న్నాయి. ఇక అసెంబ్లీలోని మిగతా పదవుల విషయంలోనూ సామాజిక న్యాయం పాటిస్తారని చెబుతున్నారు.

సీఎల్పీ ఎంపికపై కసరత్తు

• 15న హైకమాండ్ దూత రాక


భట్టి విక్రమార్క | దుద్దిళ్ల శ్రీధర్‌బాబు | సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శాసన సభ్యులతో ముఖాముఖీ సమావేశం జరిపిన తర్వాత అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతను ప్రకటించాలని ఆ పార్టీ అధినాయకత్వం నిర్ణయించింది. శాసనసభాపక్ష నేత ఎన్నికకు ఈ నెల 15న శాసనసభలోని కమిటీ హాలులో ప్రత్యేక భేటీ జరగనుంది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సీఎల్పీ నేత ఎన్నిక కోసం ప్రత్యేక పరిశీలకునిగా ఎంపిక చేశారు.


15వ తేదీన ఉదయం ఇక్కడకు వస్తున్న వేణుగోపాల్ ఉదయం నుంచి శాసన సభ్యులతో ముఖాముఖీ సమావేశం కానున్నారు. అందరితో అభిప్రాయాలు పంచుకున్నాక ఈ సమాచారాన్ని రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లి వెను వెంటనే శాసనసభాపక్ష నేతను ప్రకటించనున్నట్లు ు తెలుస్తోంది.

సీఎల్పీ నేతతో పాటు ఉప నేత, కార్యదర్శి, ప్రజా పద్దుల సంఘం(పీఏసీ), విప్ పదవులకు సంబంధించిన పేర్లను కూడా ఆ రోజునే ప్రకటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. సీఎల్పీ పదవికి పోటీ పడుతున్న ఎమ్మెల్యేలలో ఇప్పటికే పలువురు ఢిల్లీ వెళ్లి పార్టీ అధినాయకత్వంతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రచార కమిటీ ఛైర్మన్, సీనియర్ నేత మల్లు భట్టి విక్రమార్క మంగళవారం పార్టీ పెద్దలను మర్యాదపూర్వకంగా కలిసి తన మనసులోని మాటను చెప్పినట్లు సమాచారం.

సీఎల్పీ పదవిని భట్టి విక్రమార్కకు ఇస్తే.. ఉప నేతగా బీసీ లేదా రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చే అవకాశం ఉంది. విప్ పదవిని ఎస్టీలకు కేటాయించను న్నట్లు ప్రచారం జరుగుతోంది. పీఏసీ చైర్మన్ పదవికి పోటీ విపరీతంగా ఉంది. ఈ పదవిని మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వనమా వెంకటే శ్వరరావు, తూర్పు జయప్రకాశ్‌రెడ్డి(జగ్గారెడ్డి)లు ఆశిస్తున్నారు. ఈ నలుగురు పార్టీలో సీనియర్లు కావడం విశేషం.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 19 మంది అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోగా ఇందులో తొమ్మిది మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు కాగా, ఇద్దరు ఎస్సీలు, ఐదుగురు ఎస్టీలు, ఒకరు బ్రాహ్మణ, ఇద్దరు బీసీలు ఉన్నారు. వీరిలో ఇద్దరు మహిళలు కావడంతో ఒకరికి ఏదో ఒక పదవి ఇవ్వక తప్పదు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు కూడా ఎక్కువ సంఖ్యలో ఉం డటంతో వారికి ఏదో ఒక కీలకపదవిని కట్టబెట్టక తప్పదు. ఎమ్మెల్యేలతో ముఖా ముఖీ సమావేశం జరిపాక వారి అభిప్రాయాలను తీసుకుని సీఎల్పీతో పాటు ఇతర పదవుల అభ్యర్థిత్వాలను ఖరారు చేయాలని అధినాయకత్వం ప్రతిపాదించింది.

అగ్రకుల రిజర్వేషన్లు ఎన్నికల ఎత్తుగడ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అగ్రకులాలలోని వారిని మభ్యపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అగ్రకుల రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ఆమోదించిందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. బిల్లులో అనేక లోపాలున్నాయని, ఈ లోపాలన్నింటినీ కేంద్రం కప్పిపుచ్చి ఎన్నికల్లో లబ్ధికోసం హడావిడిగా బిల్లుకు ఆమోదం తెలిపిందని బుధవారం మీడియా సమావేశంలో ఆరోపించారు. సామాజిక వివక్ష వల్లే ఇన్ని రోజులు రిజర్వేషన్లను ఇచ్చారని, ఆర్థిక వెనుకబాటు సమస్యకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పరిష్కరించాలని సూచించారు. చాలా రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాఫెల్ డీల్ విషయంలో ప్రజలకు వస్తున్న అనుమానాలను పక్కదోవ పట్టించేందుకే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తీసుకు వచ్చారని మండిపడ్డారు. అలోక్ వర్మ విషయంలో సుప్రీం తీర్పు కేంద్రానికి చెంపపెట్టు లాంటిదన్నారు. అఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్‌ల నుంచి వచ్చే పలు మతాల వారికి పౌరసత్వం ఇస్తామనడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్మిక సంఘాలు ఇచ్చిన రెండు రోజుల సమ్మె ముగిసిందని, ఈ సమ్మె పూర్తి స్థాయిలో విజయవంతమైందని సురవరం పేర్కొన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాలలోని వారితో పాటు బ్యాంకింగ్ రంగంలోని కార్మికులంతా సమ్మెలో పాల్గొన్నారన్నారు.

రాజాసింగ్ వ్యాఖ్యలపై కేసీఆర్ స్పందించాలి: చాడ

ముస్లిం ఎంఎల్ఎ ప్రొటెం స్పీకర్‌గా ఉంటే తాను ప్రమాణం చేయబోనని బీజేపీ ఎంఎల్ఎ రాజాసింగ్ ప్రకటించడం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ముస్లింల పట్ల బీజేపీ ఎలా వ్యవహరిస్తుందనేందుకు రాజాసింగ్ వ్యాఖ్యలతో స్పష్టమవుతుందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.రామకృష్ణారావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మంచి వ్యక్తులుగా ఎదిగేందుకు, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. గోషామహల్ స్టేడియంలో హైదరాబాద్ సిటీ పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం పోలీసుల వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో పోలీస్ శాఖకు కేటాయించే రూ.1500 కోట్లను తెలంగాణ అధికారంలోకి వచ్చాక రూ.6వేల కోట్ల పెంచిందని అన్నారు. దేశంలో చిన్న రాష్ట్రంగా ఆవిర్భవించిన నాలుగున్నరేళ్ల కాలంలో అన్ని సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని గుర్తు చేశారు.

హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ మాట్లాడుతూ.. నగరంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు గడించారన్నారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ పోటీల్లో 700 మంది పోలీసులు పౌరులను భాగస్వాములను చేసి ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు శివప్రసాద్, డీఎస్ చౌహాన్, మురళీకృష్ణ, తరుణ్‌జోషి, కమలేశ్వర్, శ్రీనివాస్, రమేశ్‌రెడ్డి, బాబురావు పాల్గొన్నారు.


జనసేనలోకి ఆకుల!

• భాజపాకు, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా



రాజమహేంద్రవరం, ప్రభ న్యూస్ : జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు పార్టీ విధివిధానాలు తనకెంతో నచ్చాయని, ఈనెల 21న ఆ పార్టీలో చేరతానని రాజమహేంద్రవరం నగర బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ ఆకుల సత్యనారాయణ ప్రకటించారు. బీజేపీ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి విజయవాడలో పవన్‌కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరతానన్నారు. ఢిల్లీనుంచి బుధవారం రాజమహేంద్రవరం స్వగృహానికి చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్ షాను కలిసి తన నిర్ణయాన్ని ప్రకటించడానికి ఢిల్లీ వెళ్ళానని అక్కడ ఆయన అందుబాటులో లేరన్నారు. కానీ రాజీనామా చేసినట్లు వచ్చిన వార్తలొచ్చాయని ఆ వార్తలను ఆయన ఖండించారు. త్వరలోనే అమిత్‌షాను కలిసి రాజీనామాను అందిస్తానన్నారు. పవన్‌కళ్యాణ్‌తో తనకు మంచిసంబంధాలున్నాయని ఇప్పటికే ఆయనను కలిసి ఎలాంటి షరతులు లేకుండా పార్టీలో చేరతానని తెలిపానన్నారు. తనకు ఏ బాధ్యతలు అప్పగించినా సిద్ధమేనన్నారు.

కొత్త జిల్లాల్లో కోర్టులేవీ?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర పునర్విభజన చట్టంలోని నిబంధన మేరకు హైకోర్టు విభజించిన నేపథ్యంలో తెలంగాణలోని అన్ని జిల్లాలలో జిల్లా కోర్టులను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ సీఎం కేసీఆర్‌కు బుధవారం లేఖ రాశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం హైకోర్టును విభజించిందని, రెండు రాష్ట్రాలలో వేర్వేరు హైకోర్టులు ఏర్పాటయ్యాయన్నారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కొత్తగా 21 జిల్లాలను ఏర్పాటు చేశారని, మరో రెండు జిల్లాల ఏర్పాటుకు నోటిఫికేషన్‌ను జారీ చేసి అభ్యంతరాలను కోరిన నేపథ్యంలో ఇప్పటికే ఏర్పాటైన జిల్లాలలో జిల్లా కోర్టులతో పాటు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులు, వినియోగదారుల కోర్టులను వెంటనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.

ఓట్ల నమోదు పూర్తికాకుండానే ఎన్నికలా?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఓటర్ల నమోదు పూర్తి కాకుండాగానే గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని టీ పీసీసీ అధికార ప్రతినిధి జి. నిరంజన్ ప్రశ్నించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఓటర్ నమోదును జనవరి 25 వరకు పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు మాత్రం ఈ నెల 21, 25, 30 తేదీల్లో నిర్వహించనుందని తెలిపారు. ఇంత తక్కువ సమయంలో ఓటర్ల నమోదు సాధ్యం అవుతుందా? అని ప్రశ్నించారు. గతంలో 30 లక్షల ఓట్లను తీసేశామని, ఇప్పుటు వాటిని నమోదు చేశామని చెబుతున్నారని, అది ఎలా సాధ్యం అవుతోందని నిరంజన్ నిలదీశారు.

ఓటాన్ అకౌంట్ బడ్జెటెందుకు?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ధనిక రాష్ట్రం అంటున్న సీఎం కేసీఆర్.. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఎలా ప్రవేశపెడుతారని టీ పీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్ ప్రశ్నించారు. దేశంలోనే ఎక్కువ రెవెన్యూ తెలంగాణ నుంచి వస్తుందని చెబుతున్న సీఎం.. అప్పులు ఎలా క్లియర్ చేస్తారో చెప్పాలని, అందుకు శ్వేత పత్రం విడుదల చేయాలని నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ బడ్జెట్ గురించి ఆలోచన చేయకుండా రాజకీయాల్లో బీజీగా ఉన్నారని ఆయన విమర్శించారు. టీఆర్ఎస్ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే రూ. 2.50 లక్షల కోట్ల బడ్జెట్ కావాలని ఆయన తెలిపారు. రాష్ట్రానికి ఇప్పటి వరకు రూ. 2.20 లక్షల కోట్ల అప్పు ఉందని, వడ్డీలకు రూ. వేల కోట్లు కేటాయిస్తున్న పరిస్థితి ఉందని నిజాముద్దీన్ ఆరోపించారు.

'సుప్రీం తీర్పు కేంద్రానికి చెంపపెట్టు'

సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను తిరిగి నియమిం చాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రధాన మంత్రి నరేంద్ర మోడికి చెంప పెట్టులాం టిదని టీ పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి అన్నారు. సీబీఐ లాంటి అత్యున్నత సంస్థలో ప్రధాని జోక్యం చేసుకోవడం సరికాదనే విషయంసుప్రీం కోర్టు తీర్పుతో రుజువైందన్నారు. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలులో జరిగిన అవినీతి అక్రమాలను బయటికి తీస్తున్నందునే సీబీఐ డైరెక్టర్‌ను బలవంతంగా సెలవులపై పంపారని ఆరోపించారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం-7

(చట్టం-30/2013లోని సెక్షన్ 19(1) లోని సబ్ రూల్ (1) రూల్ 25 ప్రకారం) మరియు (యాక్ట్ నెం.21 ఆఫ్ 2017 తెలంగాణ ప్రభుత్వం గెజిట్ పబ్లికేషన్ నెం.22 తేది :17.05.2017 ప్రకారం) కలెక్టర్ /సంయుక్త కలెక్టర్, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)

రూఢీ ప్రకటన

ఫైల్ నెం. జి1/7414/2017 తేది: 27.12.2018
ఫైల్ నెం. ఎఫ్/320/2017 ఆర్ & ఆర్ తేది: 18-12-2018

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, లక్ష్మణపురం మజిర యస్.డబ్ల్యు.లింగోటం గ్రామం నాంపల్లి మండలం విస్తీర్ణం ఎ.4.00 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం నిమిత్తం అనగా కిష్టాయినిపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణము నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పాదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013లోని సెక్షన్ 19(1) అనుసరించి రూఢీ ప్రకటన జారీచేయనైనది.

కావున డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు క్రింద నల్లగొండ జిల్లాలోని లక్ష్మణపురం మజిర యస్.డబ్ల్యు. లింగోటం గ్రామం నాంపల్లి మండలం విస్తీర్ణం ఎ.4.00 గుంటల భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన భూమి కిష్టాయినిపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిమిత్తం అవసరమైనందున ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన జారీచేయడమైనది.

మండలం : నాంపల్లి గ్రామము : లక్ష్మణపురం, మజీర యస్.డబ్ల్యు.లింగోటం

క్రమ సంఖ్య	ప్రాజెక్టు పేరు	యజమాని పేరు	తండ్రి/భర్త పేరు	సర్వే నెం	భూమి విస్తీర్ణం వివరములు చ.మీ.,లలో: రకము	పునాది ప్రాంతం	ఇతర కట్టడములు/ చెట్లు వివరములు	రిమార్కులు
1	కె.ఆర్. బి.ఆర్ 1	గడ్డి సైదులు	రాములు	329	పక్క	32.68	స్నానపుగది, 1 వేపచెట్లు,4 ఈత చెట్లు, 1 మునగచెట్టు	
2	2	గడ్డి నర్సింహా	రాములు	329	పక్క	30.40	స్నానపుగది, 2 పసువులకొట్టం ,4ఈత చెట్లు, 1 కొబ్బరి, 1 సీతాఫలం చెట్టు	
3	3	గడ్డి రాములు	రామయ్య	329	రేకుల ఇల్లు	15.54	స్నానపుగది	
4	4	దేప కృష్ణరెడ్డి	రాజిరెడ్డి	329	పక్క	33.60	స్నానపుగది, బోర్,పైప్‌లైన్, 2 ఈతచెట్లు,1 నిమ్మ,1 సపోట ,4 కొబ్బరి, 1అకాసియా చెట్టు	
5	5	దేప సందీప్ రెడ్డి	కృష్ణరెడ్డి	329	పక్క	33.60	స్నానపుగది,4 కొబ్బరి, 2వేప, 1 సీతాఫలం చెట్టు, 1 నిమ్మ ,1 సపోట	
6	6	గడ్డి లింగయ్య	చౌహాన్	329	పక్క	28.88	స్నానపుగది, 2 ఈతచెట్లు,	
7	7	గడ్డి శంకర్	చౌహాన్	329	పక్క	28.88	స్నానపుగది, 2 ఈతచెట్లు	
8	8	గడ్డి చౌహాన్	లింగయ్య	329	పక్క రేకుల ఇల్లు	12.48 12.16	పశువుల కొట్టం బోర్, పైప్‌లైన్, 2 కొబ్బరి, 2 నిమ్మ, 3 ఈత చెట్లు	
9	9	నక్కగొని యాదయ్య	వెంకటయ్య	329	పక్క రేకుల ఇల్లు	34.32 16.28	స్నానపుగది, 1 దానిమ్మ, 1 జామ,1సపోట 1 వేప, 3 సీతాఫలం చెట్లు, 1 ఖర్జూర, 1 కొబ్బరి,1 నిమ్మ,1 నేరెడు	
10	10	నక్కగొని నర్సింహా	సందయ్య	329	రేకుల ఇల్లు	34.40		
11	11	నేతలా సైదులు	చంద్రయ్య	329	పక్క రేకుల ఇల్లు	33.11 15.54	1 వేప,1 సీతాఫలం,1 అకాసియా చెట్టు	
12	12	చెవుల శ్రీనివాస్ రెడ్డి	రాంరెడ్డి	329	రేకుల ఇల్లు	24.09	స్నానపుగది, బోర్‌పైప్‌లైన్, పశువుల కొట్టం,1జామ, 1 సపోట 1 వేప,5సీతాఫలం చెట్లు, 5 కొబ్బరి,1 నిమ్మ 1 మామిడి	
13	13	చెవుల లింగరెడ్డి	శ్రీనివాస్ రెడ్డి	329	పక్క	28.11	స్నానపుగది, పశువులకొట్టం 1 జామ,1 సపోట, 5 కొబ్బరి, 1 మామిడి	
14	14	చెవుల రఘుమారెడ్డి	శ్రీనివాస్ రెడ్డి	329	పక్క	28.11	స్నానపుగది, పశువులకొట్టం, 1జామ,1 సపోట,5 కొబ్బరి	
15	15	గడ్డి సోమయ్య	పెద్ద జంగయ్య	329	పక్క	20.80	స్నానపుగది, 2 వేప,1 కొబ్బరి	
16	15/1	గడ్డి వెంకటయ్య	పెద్ద జంగయ్య	329	పక్క	20.80	స్నానపుగది, 2 వేప, 1 కొబ్బరి, 1 దానిమ్మ	
17	15/2	గడ్డి లింగయ్య	సోమయ్య	329	పక్క	20.80	స్నానపుగది, 2 కొబ్బరి	
18	16	గడ్డి మల్లయ్య	పెద్ద జంగయ్య	329	పక్క	36.52	స్నానపుగది, 4వేప, 5కొబ్బరి, 1దానిమ్మ	
19	17	దేప నర్సీ రెడ్డి	రాజ రెడ్డి	329	పక్క	23.85	2 కొబ్బరి	
20	17/1	దేప వెంకట్ రెడ్డి	నర్సీ రెడ్డి	329	పక్క	15.17		
21	17/2	దేప స్వరూప	రవీందర్ రెడ్డి	329	పక్క	15.17		
22	17/3	దేప ప్రభాకర్ రెడ్డి	నర్సీరెడ్డి	329	పక్క	15.17	స్నానపుగది	
23	18	దేప లలితమ్మ	జంగారెడ్డి	329	పక్క	32.30	స్నానపుగది, 1 బొప్పాయి	
24	18/1	దేప మల్ల రెడ్డి	జంగారెడ్డి	329	రేకుల ఇల్లు	32.30	స్నానపుగది	
25	18/2	దేప వెంకట్ రెడ్డి	జంగారెడ్డి	329	పక్క	32.30		
26	19	గట్టుపల్లి నర్సీ రెడ్డి	సత్తి రెడ్డి	329	పక్క	16.34	స్నానపుగది, 1 బొప్పాయి, 1 జామ, 1 కొబ్బరి, 1వేప,2 సపోట	
27	9/1	గట్టెపల్లి సత్తి రెడ్డి	రాంరెడ్డి	329	పక్క	16.34	స్నానపుగది, 1 బొప్పాయి, జామ,2కొబ్బరి	
28	19/2	గట్టుపల్లి శిల్ప	రఘుమరెడ్డి	329	రేకుల ఇల్లు	22.62		
29	20	దేప బిక్షం రెడ్డి	వీరా రెడ్డి	329	పక్క	28.12	స్నానపుగది, 2 వేప, 4సీతాఫలం, 1 మునగ, 1 నిమ్మ	
30	20/1	దేపరాజిరెడ్డి	బిక్షం రెడ్డి	329	పక్క	28.12	స్నానపుగది	
31	21	చెలగొని పెద్దయ్య	నారయ్య	329	పక్క	30.02	1వేప,1 సీతాఫలం,1మునగ	
32	22	చెలగొని నర్సింహా	నారయ్య	329	పక్క	30.02	1 వేప, 1సీతాఫలం	
33	23	చెలగొని నారయ్య	చెన్నయ్య	329	రేకుల ఇల్లు	29.23	పశువుల కొట్టం	
34	24	గడ్డి కృష్ణయ్య	చిన్న జంగయ్య	329	పక్క	29.64	2 పశువుల కొట్టం,2 వేప, 4 సీతాఫలం	
35	25	గడ్డి ముత్తమ్మ	చిన్న జంగయ్య	329	రేకుల ఇల్లు	15.12		
36	26	గడ్డి యాదయ్య	పర్వతాలు	329	పక్క	31.50		
37	27	గడ్డి లింగయ్య	కొండయ్య	329	పక్క	60.84	స్నానపుగది, బోర్,పైప్‌లైన్, 1వేప	బోర్ ఇంటి నెం. 29 ఎదురుగా ఉన్నది
38	27/1	గడ్డి సత్తమ్మ	కొండయ్య	329	పక్క		పశువులకొట్టం	
39	28	గడ్డి కృష్ణయ్య	బీరయ్య	329	పక్క	62.51	స్నానపుగది, పశువులకొట్టం. 1 కొబ్బరి	
40	29	గడ్డి ముత్తయ్య	బీరయ్య	329	పక్క	62.51		
41	30	గడ్డి అంకమ్మ	బీరయ్య	329	రేకుల ఇల్లు	23.40		
42	31	గడ్డి బిక్షమయ్య	బీరయ్య	329	పక్క	24.70	స్నానపుగది	
43	31/1	గడ్డి లింగయ్య	బిక్షమయ్య	329	పక్క	24.70	స్నానపుగది, పశువుల కొట్టం	
44	32	గడ్డి మల్లయ్య	బీరయ్య	329	పక్క	23.10	పశువుల కొట్టం,2కొబ్బరి	
45	32/1	గడ్డి వెంకటయ్య	మల్లయ్య	329	రేకుల ఇల్లు	23.10		
46	32/2	గడ్డిరాజు	మల్లయ్య	329	పక్క	23.10		
47	33	గడ్డి నర్సింహా	బీరయ్య	329	పక్క	31.08	పశువుల కొట్టం, 1 వేప	
48	34	గడ్డి రాజు	నర్సింహా	329	పక్క	28.13	స్నానపుగది, పశువుల కొట్టం,2 వేప	పశువుల కొట్టం ఇంటి నెం.54 ముందు ఉన్నది
49	34/1	గడ్డి వెంకటయ్య	నర్సింహా	329	పక్క	28.13	స్నానపుగది, పశువులకొట్టం	
50	34/2	గడ్డి నర్సింహా	రాజయ్య	329	రేకుల ఇల్లు	28.50	పశువుల కొట్టం	
51	35	నక్కనవోని లక్ష్మయ్య	వెంకయ్య	329	పక్క	32.80	స్నానపుగది, పశువుల కొట్టం	
52	36	గడ్డి జంగయ్య	రామయ్య	329	రేకుల ఇల్లు	19.80		
53	37	గడ్డి సత్తయ్య	చిన్న జంగయ్య	329	పక్క	44.32	పశువుల కొట్టం	
54	38	గడ్డి నర్సింహా	చిన్న జంగయ్య	329	పక్క	45.32	పశువులకొట్టం, 1కొబ్బరి	
55	38/1	గడ్డిరామకృష్ణ	నర్సింహా	329	రేకుల ఇల్లు	14.94	వేప చెట్టు	
56	39	యెడల్లి లక్ష్మయ్య	రామయ్య	329	రేకుల ఇల్లు	11.47		
57	40	గడ్డి పెద్దమ్మ	సత్తయ్య	330	పక్క రేకుల ఇల్లు	15.60 14.40	స్నానపు గది, 1వేప, 1 కొబ్బరి, 1 దానిమ్మ, 1 ఈత, 1 జామ	
58	40/1	గడ్డి సైదులు	సత్తయ్య	330	పక్క	15.60	1 వేప, 1కొబ్బరి	
59	40/2	గడ్డి ఈశ్వర్	సత్తయ్య	330	పక్క	14.40	2 వేప	
60	41	వట్టికోటి ముత్యాలు	నర్సింహా	330	పక్క రేకుల ఇల్లు	15.60 14.40	స్నానపుగది, 1 కొబ్బరి, 1 జామ	
61	41/1	వట్టికోటి నరేశ్	ముత్యాలు	330	పక్క	30.00	1వేప	
62	42	గడ్డి యాదయ్య	జంగయ్య	330	పక్క రేకుల ఇల్లు రేకుల ఇల్లు	31.57 16.40 16.00	స్నానపుగది, 1 కొబ్బరి, 1 సపోట, 1సీతాఫలం	
63	43	గడ్డి అంజయ్య	జంగయ్య	330	రేకుల ఇల్లు	32.79	పశువుల కొట్టం, 1వేప, 1జామ, 1దానిమ్మ, 1సీతాఫలం, 1నిమ్మ చెట్లు	
64	44	చెవుల నర్సిరెడ్డి	రాంరెడ్డి	330	పక్క రేకుల ఇల్లు రేకుల ఇల్లు	30.87 11.13 25.00	స్నానపుగది	[illegible]
65	45	చెలగొని లాలయ్య	చెన్నయ్య	330	చెక్క మిద్దె	75.60	స్నానపుగది, 1 వేప, 1 సీతాఫలం	
66	45/1	చెలగొని నగేష్	లాలయ్య	330	పక్క			
67	46	దేప ప్రమీలమ్మ	రాంరెడ్డి	330	పక్క	25.21	దానిమ్మ, 1కొబ్బరి	
68	46/1	దేప ఈశ్వర్ రెడ్డి	రాంరెడ్డి	330	పక్క	25.21	1సీతాఫలం	
69	47	గుండ్ల సరోజనమ్మ	చంద్ర రెడ్డి	330	రేకుల ఇల్లు	6.50	స్నానపుగది	
70	48	ముధామ్ వెంకటయ్య	పెంటయ్య	330	రేకుల ఇల్లు రేకుల ఇల్లు	18.00 14.40	స్నానపుగది	
71	49	దేప కృష్ణ రెడ్డి	మల్లారెడ్డి	330	పక్క	15.60	స్నానపుగది, 1 సీతాఫలం	
72	49/1	దేప నర్సీ రెడ్డి	కృష్ణారెడ్డి	330	పక్క	15.60		
73	49/2	దేప శ్రీనివాస్ రెడ్డి	కృష్ణారెడ్డి	330	పక్క			
74	49/3	దేప శేకర్ రెడ్డి	కృష్ణారెడ్డి	330	పక్క			
75	50	దాసరి కృష్ణయ్య	రాములు	328	రేకుల ఇల్లు	36.96	1వేప	
76	51	గడ్డి కృష్ణయ్య	పర్వతాలు	328	చెక్క మిద్దె	50.41	స్నానపుగది	
77	51/1	గడ్డి పార్వతమ్మ	పర్వతాలు	328	చెక్క మిద్దె			
78	52	గడ్డి సత్తమ్మ	కొండయ్య	328	రేకుల ఇల్లు	34.32	స్నానపుగది, 1వేప	
79	53	గడ్డి సత్య నారాయణ	లింగయ్య	328	పక్క	28.68	స్నానపుగది	
80	53/1	గడ్డి లింగయ్య	సత్యనారాయణ	328	పక్క	28.68	పశువుల కొట్టం	
81	54	కాడరి యాదయ్య	క్రిష్టయ్య	328	పక్క	39.10		
82	55	దుగ్గి కేశవరెడ్డి	గోపాల్ రెడ్డి	328	పక్క	14.82	స్నానపుగది	
83	55/1	దుగ్గిరాజిరెడ్డి	కేశవరెడ్డి	328	పక్క	29.65	కొబ్బరిచెట్టు	
84	55/2	దుగ్గి సంజీవరెడ్డి	కేశవరెడ్డి	328	పక్క	14.82	1సీతాఫలం	
85	56	గడ్డి లింగయ్య	నర్సింహా	328	పక్క రేకుల ఇల్లు	40.17 8.06		
86	57	గడ్డి శ్రీను	నర్సింహా	330	చెక్క మిద్దె	37.63	స్నానపుగది, కొబ్బరి చెట్టు	
87	58	ఈటెల్లి పార్వతమ్మ	జంగయ్య	330	పక్క	38.80		
88	59	చెవుల సోమిరెడ్డి	రాంరెడ్డి	330	పక్క రేకుల ఇల్లు రేకుల ఇల్లు	30.00 14.80 19.98	స్నానపుగది, 1వేప	
89	59/1	చెవుల యాదగిరిరెడ్డి	సోమిరెడ్డి	330	చెక్క మిద్దె రేకుల ఇల్లు	26.03 10.64	స్నానపుగది	
90	60	ఏడుదొండ్ల నర్సిరెడ్డి	కృష్ణా రెడ్డి	330	రేకుల ఇల్లు రేకుల ఇల్లు	4.41 27.75	స్నానపుగది, 2కొబ్బరి చెట్లు	
91	61	ఏడుదొండ్ల నారాయణరెడ్డి	కృష్ణారెడ్డి	330	పక్క	26.98	బోర్, పశువులకొట్టం	
92	61/1	ఏడుదొండ్ల శ్రీనివాస్ రెడ్డి	నారాయణ రెడ్డి	330	రేకుల ఇల్లు రేకుల ఇల్లు	10.50 14.35		
93	62	ఏడుదొండ్ల వెంకట్ రెడ్డి	కృష్ణారెడ్డి	330	పక్క రేకుల ఇల్లు రేకుల ఇల్లు	28.12 10.80 15.84		
94	63	అమనగంటి భిక్షంరెడ్డి	నారాయణ రెడ్డి	330	పక్క	30.81	స్నానపు గది పశువుల కొట్టం	
95	64	అమనగంటి సుదర్శనమ్మ	నారాయణ రెడ్డి	330	రేకుల ఇల్లు	22.40	బోర్, పైప్‌లైన్	
96	65	గడ్డి అంజయ్య	మల్లయ్య	330	రేకుల ఇల్లు	28.12	స్నానపుగది, 2 పశువుల కొట్టం	
97	66	గడ్డి నర్సింహా	మల్లయ్య	330	గుడిస	10.32	2 కొబ్బరి, 3 ఈత చెట్లు	
98	67	గడ్డి వెంకటయ్య	మల్లయ్య	330	పక్క రేకుల ఇల్లు రేకుల ఇల్లు	36.96 16.40 18.04	స్నానపు గది	
99	68	గడ్డి ముత్తయ్య	మల్లయ్య	330	పక్క	28.88	స్నానపుగది, పశువులకొట్టం, 2వేప, 1 కొబ్బరి	
100	68/1	గడ్డి లింగయ్య	ముత్తయ్య	330	రేకుల ఇల్లు రేకుల ఇల్లు	12.96 14.04	పశువులకొట్టం, 2 తీపి నిమ్మ చెట్లు	
101	69	మారగొని నర్సింహా	పెద్ద జంగయ్య	330	పక్క	32.68	పశువులకొట్టం, 1 వేప	
102	70	నక్కనగొని సందయ్య	వెంకయ్య	330	పక్క	32.00	పశువులకొట్టం, 1వేప,1బొప్పాయి ,1 మునగ	
103	71	నక్కనగొని శంకర్	సందయ్య	330	పక్క	16.00	మునగ	
104	72	నక్కనగొని ఈశ్వర్	సందయ్య	330	గుడిస	51.12	స్నానపు గది	
105	73	గడ్డి శ్రీను	నర్సింహా	330	చెక్క మిద్దె	37.98	స్నానపుగది, 2 కొబ్బరిచెట్లు	
106	74	గడ్డి కృష్ణమ్మ	నర్సింహా	330	రేకుల ఇల్లు	12.96	1 జామ, 1 సీతాఫలం	
107	75	తమ్మడగొని సత్తయ్య	యల్లయ్య	330	చెక్క మిద్దె	35.02	స్నానపుగది	
108	75/1	తమ్మడగొని యాదయ్య	సత్తయ్య	330	మట్టి గోడల తో ఉన్న గుడిస	39.14	తాటాకులతో మరియు గోడలతో ఉన్న స్నానపుగది	
109	76	అమనగంటి చంద్రారెడ్డి	వెంకట్‌రెడ్డి	328	రేకుల ఇల్లు	19.38	1 జామ	
110	76/1	అమంగంటి ముత్యంరెడ్డి	చంద్రరెడ్డి	328	రేకుల ఇల్లు		స్నానపుగది, 1 వేప	
111	77	అమనగంటి సత్తిరెడ్డి	వెంకట్‌రెడ్డి	328	పక్క రేకుల ఇల్లు	31.45 10.80	స్నానపుగది, 1 సపోట	
112	77/1	అమనగంటి వెంగల్‌రెడ్డి	సత్తిరెడ్డి	328	పక్క	31.45	స్నానపుగది 1 వేప	
113	78	గడుధాల వెంకటయ్య	ముత్యాలు	328	పక్క	33.58	పశువుల కొట్టం	
114	79	కాడరి ముత్తమ్మ	క్రిష్టయ్య	328	మట్టి గోడల తో ఉన్న గుడిస	26.60		
115	79/1	కాడరి వెంకటయ్య	క్రిష్టయ్య	328				
116	80	బడిగా సుగుణమ్మ	కృష్ణయ్య	328	పక్క	54.76	స్నానపుగది, 1 వేప	
117	80/1	అనుమంతుల యాదయ్య	సత్య నారాయణ	328	రేకుల ఇల్లు	24.42		
118	81	వట్టికోటి చితరి	మల్లయ్య	330	పక్క	32.00		
119	81/1	వట్టికోటి తిరుమలేష్	చితరి	330	పక్క	16.00		
120	81/2	వట్టికోటి జంగయ్య	చితరి	330	పక్క	16.00		
121	82	మామిడి అంజయ్య	సత్తయ్య	330	పక్క	38.76		
122	83	మామిడి సత్తయ్య	యల్లయ్య	330	రేకుల ఇల్లు	12.92	స్నానపుగది, పశువుల కొట్టం	
123	84	వట్టికోటి పెద్ద వెంకటయ్య	మల్లయ్య	330	చెక్క మిద్దె	29.65	పశువుల కొట్టం	
124	85	వట్టికోటి చిన్న వెంకటేష్	మల్లయ్య	330	చెక్క మిద్దె	21.95		
125	86	గడ్డి చిన్న నర్సింహా	రామయ్య	330	రేకుల ఇల్లు	12.00		
126	87	నక్కనగొని పెద్ద సందయ్య	వెంకటయ్య	330	రేకుల ఇల్లు	12.00	కొబ్బరి	
127	88	నక్కనగొని లింగయ్య	పెద్ద సందయ్య	330	రెకుల ఇల్లు	30.00		
128	89	మారగోని యాదయ్య	జంగయ్య	330	పక్క రేకుల ఇల్లు రేకుల ఇల్లు	32.00 11.88 14.52	స్నానపుగది పశువుల కొట్టం	
129	89/1	మారగొని సత్యనారాయణ	యాదయ్య	330	రేకుల ఇల్లు	15.52		
130	90	మారగొని చిన్న జంగయ్య	దశరద	330	రేకుల ఇల్లు	15.12	3 ఈత చెట్లు	
131	91	గడ్డి శ్రీరాములు	రామయ్య	330	చెక్కమిద్దె	26.60	పశువుల కొట్టం	
132	91/1	గడ్డి యాదయ్య	శ్రీరాములు	330	రేకుల ఇల్లు	24.15		
133	92	మారగొని ముత్యాలు	చిన్న జంగయ్య	330	పక్క	33.38	స్నానపుగది, బోరు,పైప్‌లైన్ 1పశువులకొట్టం	బోర్ ఇంటి నెం.95 ముందు ఉన్నది వేప, పశువుల కొట్టం ఇంటి నెం.11 ముందు ఉన్నది
134	93	గడ్డి జంగయ్య	నర్సింహా	330	పక్క రేకుల ఇల్లు రేకుల ఇల్లు	33.30 12.60 14.04	స్నానపుగది, బోరు,పైప్‌లైన్ 2 కొబ్బరి చెట్లు	బోర్ ఇంటి నెం.94 ముందు ఉన్నది
135	94	మామిడి వెంకటయ్య	సత్తయ్య	330	పక్క	77.90	స్నానపుగది	
136	95	మారగొని చిన్న నర్సింహా	చిన్న జంగయ్య	330	పక్క	15.96	స్నానపుగది, పశువులకొట్టం, 2కొబ్బరి చెట్లు	
137	95/1	మారగొని లింగయ్య	నర్సింహా	330	పక్క రేకుల ఇల్లు	15.96 12.54	1 సపోట చెట్టు	
138	96	బనావత్ బాగ్య	వెంకటయ్య	330	పక్క	27.50	1జామ చెట్టు	
139	97	బనావత్ శ్రవణ్	బాగ్య	330	పక్క	27.50	1 అరటి చెట్టు	
140	97/1	బనావత్ లచ్చిరామ్	బాగ్య	330	పక్క			
141	98	బనావత్ రుప్లా	కేవ్లా అలియాస్ లచ్చిరామ్	330	పక్క	24.13	1 కొబ్బరి, 1 వేప	
142	99	బనావత్ రవీందర్	కేవ్లా	330	పక్క	24.13		
143	100	బనావత్ జగన్ నాయక్	పాండ్య	330	పక్క	40.04		
144	101	బనావత్ పాండ్య	రాజ్య	330	పక్క	24.13	పశువులకొట్టం 1 బొప్పాయి	
145	101/1	బనావత్ నరేందర్	పాండ్య	330	పక్క	24.13		
146	102	బనావత్ దేశ్య	రాజ్య	330	పక్క	24.13	మునగ	
147	102/1	బనావత్ రమేశ్	దేశ్య	330	పక్క	24.13		
148	102/2	బనావత్ గణేశ్	దేశ్య	330	పక్క	24.13		
149	103	బనావత్ జాను	వెంకటయ్య	330	పక్క	24.13	సీతాఫలం, 1 వేప	
150	104	బనావత్ రాములు	వెంకటయ్య	330	పక్క	24.13		
151	105	బనావత్ మోహన్	రాములు	330	పక్క	21.70		
152	105/1	బనావత్ వినోద్	రాములు	330	పక్క	24.50	1 చింత, 1 కుంకుడుకాయ	
153	106	రామవత్ బిక్య	పర్య	330	పక్క	24.13	1 కొబ్బరి	
154	107	రామవత్ కిషన్	మోతీరాం	330	పక్క	24.13	1 సీతాఫలం	
155	108	రామవత్ దనమ్మ	మోతీరాం	330	పక్క	14.96	మట్టిగోడల కొట్టం, 1చింత, 1 వేప, 1ఈత	
156	109	బనావత్ నాను	పటాన్	330	రేకుల ఇల్లు	17.64	1 కుంకుడు కాయ, 3ఈత	
157	110	బనావత్ నర్సింహా	నాను	330	పక్క రేకుల ఇల్లు రేకుల ఇల్లు	23.04 8.32 17.36	స్నానపుగది, పశువుల కొట్టం	
158	111	బనావత్ శ్రీను	నాను	330	పక్క రేకుల ఇల్లు రేకుల ఇల్లు	23.04 8.32 17.36	స్నానపుగది, 1 వేప, 2 దానిమ్మ, 2 సీతాఫలం	
159	112	బనావత్ చంది	లాలు	330	పక్క రేకుల ఇల్లు	12.68 12.68	స్నానపుగది, 1 కొబ్బరి, 1 దానిమ్మ, 1 వేప	
160	113	బనావత్ లాలు	పటాన్	330	పక్క	6.04		
161	113/1	బనావత్ నాగరాజు	లాలు	330	పక్క	6.04		
162	114	బనావత్ సైదులు	బాష	330	పక్క	6.04		
163	114/1	బనావత్ రమేశ్	బాష	330	పక్క	6.04		
164	115	బనావత్ ఈశ్వర్	రాజ్య	330	పక్క	24.13		
165	116	బనావత్ కమలమ్మ	లచ్చిరాం అలియాస్ కేవ్లా	330	పక్క	24.13		
166	117	బనావత్ సుధాకర్	ఈర్య	330	పక్క	24.13	2 వేప, 2 సీతాఫలం, 3 దానిమ్మ	
167	118	బనావత్ ఈర్య	బిచ్య	330	పక్క	24.13	పశువులకొట్టం ,1 వేప	
168	119	బనావత్‌రూప్లా	బిచ్య	330	పక్క	26.64	పశువులకొట్టం	
169	119/1	బనావత్ గణేష్	రూప్లా	330	పక్క	36.05	3 ఈతచెట్లు	
170	120	బనావత్ వాసురామ్	బిచ్య	330	పక్క	36.05	పశువులకొట్టం	
171	120/1	బనావత్‌మేఘా	రూప్లా	330	పక్క	36.05		
172	121	బనావత్ జగదీశ్వర్	వాసురామ్	330	పక్క	36.05		
173	122	బనావత్ సీతారాం	దేవుల	330	పక్క	45.63	స్నానపుగది, పశువుల కొట్టం 1 కొబ్బరి,1 వేప, 1 సీతాఫలం	
174	123	బనావత్ తావుర్య	దేవుల	330	పక్క	36.05	పశువులకొట్టం	
175	124	అమంగంటి నరసింహారెడ్డి	నారాయణ రెడ్డి	329	రేకుల ఇల్లు	12.68		

సెక్షన్ (కేంద్ర చట్టం) క్రింద భూసేకరణపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి రూఢీ ప్రకటన జారీ చేయడమైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించబడు విస్తీర్ణము శూన్యం.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా రాజస్వమండలాధికారి, దేవరకొండ నందు పని కార్యాలయపు పనివేళల నందు చూసుకోవచ్చును.

సం/- రాజస్వ మండలాధికారి, దేవరకొండ
సం/- సంయుక్త కలెక్టరు, నల్లగొండ.
సం/- జిల్లా కలెక్టరు, నల్లగొండ.

DIPR Ro No.853/LA/PP/2018-19

కోకాకోలా పేరుతో కోటికి టోకరా!

● లాటరీ పేరుతో భారీ మోసం ● నైజీరియన్ అరెస్టు.. నగదు, సెల్‌ఫోన్ల స్వాధీనం

వరంగల్, ప్రభన్యూస్ ప్రతినిధి : కొకాకోలా లాటరీ వచ్చిందంటూ యువకుల నుంచి రూ.కోటికిపైగా వసూలు చేసిన ఓ నైజీరియన్, మరో నాగాలాండ్ యువతిని వరంగల్ పోలీసులు అరెస్టు చేశారు. నైజీరియన్ దేశానికి చెందిన డిమ్యూయేన్ ఉచైన్ (37), నాగలాండ్ రాష్ట్రంలోని డిమాపూర్ జిల్లాకు చెందిన హీనియాలను వరంగల్ పోలీసులు ఢిల్లీలో అరెస్టు చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ డా.వి.రవీందర్ వెల్లడించిన కథనం ప్రకారం.. వరంగల్ రూరల్ జిల్లాలోని శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన సిరిపురం మహేందర్‌కు 2017 ఏప్రిల్‌లో అతని సెల్‌ఫోన్‌కు కోకాకోలా ఆన్‌లైన్ లాటరీ వచ్చిందని మెస్సెజ్ పంపించారు. ఆ లాటరీ విలువ ఇండియన్ కరెన్సీ ప్రకారం రూ.4.45 కోట్లు. రిజిస్ట్రేషన్ చార్జీల కింద 200 పౌండ్లు భారత కరెన్సీ ప్రకారం రూ.1.80 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, మీ లాటరీ డబ్బు త్వరలోనే వస్తుందని నమ్మించారు. దీంతో బాధితుడు వారు అడిగినట్లుగానే వారి బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేశారు. వచ్చిన డబ్బును తీసుకోవాలంటే ఇమిగ్రేషన్, కస్టమ్స్‌ట్యాక్స్, మనీ ల్యాండరింగ్ ట్యాక్స్, యాంటీ టెర్రరిస్టు సర్టిఫికెట్, ఆర్‌బీఐ క్లియరెన్స్ సర్టిఫికెట్ తదితర ధృవపత్రాలను అందజేయాలని, అందుకు కొంత డబ్బులను డిపాజిట్ చేయాలని నిందితుడు మాథ్యూస్ పేరుతో పలు దఫాలు ఫోన్, ఈమెయిల్ ద్వారా సూచించారు. దీంతో మహేందర్ నిందితులకు సంబంధించిన చెందిన 12 ఎస్‌బీఐ ఖాతాల్లో రూ.10లక్షలను డిపాజిట్ చేశారు.



బాధితుడు పెద్దమొత్తంలో డబ్బులు డిపాజిట్ చేసినా తనకు వచ్చిన లాటరీ మొత్తం డబ్బు రాకపోవడంతో శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జనగామ జిల్లాలోనూ కోకాకోలా మోసం

ఇదే తరహాలో జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన కరికే భరత్‌కుమార్ అనే యువకుడు నిందితులకు సంబంధించిన వివిధ వాణిజ్య బ్యాంకులకు చెందిన 24 బ్యాంకు ఖాతాలల్లో రూ.71 లక్షలను డిపాజిట్ చేశారు. తాను మోసానికి గురైనట్లు అనుమానం వచ్చి బచ్చన్నపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ రెండు సంఘటనలపై అప్రమత్తమైన వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం పోలీసులు కోకాకోలా లాటరీ మోసాలు ఢిల్లీ కేంద్రంగా జరిగినట్లుగా నిర్ధారణకు వచ్చారు.

నిందితులను గుర్తించి పట్టుకునేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ రవీందర్, పరకాల ఏసీపీ వైవిఎస్. సుదీంద్ర పర్యవేక్షణలో శాయంపేట ఇన్స్‌పెక్టర్ సాదుల్లాబాబా నేతృత్వంలో రెండు ప్రత్యేక నిఘా బృందాలను నియమించారు.

ఢిల్లీలో నిందితుల అరెస్టు

సైబర్ విభాగం సహకారంతో నిందితుడు వినియోగించిన సెల్‌ఫోన్ నంబర్లు, ఈ మెయిల్, బ్యాంకు ఖాతాల ఆధారం చేసుకుని గత కొన్ని రోజులుగా దర్యాప్తు జరిపి నిందితుల కోసం ఈ బృందాలు ఢిల్లీకి తరలివెళ్లాయి. నిందితులను గుర్తించేందుకు గాను ముందుగా వారు వినియోగించిన ఇంటర్నెట్ ప్రదేశాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ కోర్టు అనుమతితో దర్యాప్తు బృందాలు నిందితులను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తరలించారు.

తోడు దొంగలు

అరెస్టు చేసిన నిందితులను పోలీసులు విచారించగా, నైజీరియా దేశస్తులు సైబర్ చీటర్ డిమ్యూయన్ ఉచైన్ 2015 సంవత్సరంలో ఇండియాకు వచ్చాడు. అదే సమయంలో చిరువ్యాపారం నిర్వహించేందుకు ఢిల్లీకి వచ్చిన మరో నిందితురాలు హినియాకు డిమ్యూయన్‌తో పరిచయమైంది. వారి ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. దీంతో ఇద్దరు నిందితులు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనలతో కోకాకోలా లాటరీ మోసానికి సంబంధించిన ప్రణాళికను రూపొందించుకున్నారు. శాయంపేట, బచ్చన్నపేటతో పాటు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో మోసాలకు పాల్పడినట్లుగా అంగీకరించారు.

ఆర్పీఎఫ్ వలలో దోపిడీ దొంగలు

విజయవాడ, ఆంధ్రప్రభ: చెన్నైలో జరిగిన భారీ దోపిడీని విజయవాడ రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ అధికారులు ఛేదించారు. ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకొని రూ.5కోట్ల విలువైన బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు. చెన్నైలోని ఓ నగల షాపు యజమాని ఇంట్లో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులు విజయవాడ వైపు వస్తున్నట్లు సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఎస్.ఆర్.గాంధీకి చెన్నై జాయింట్ పోలీసు కమిషనర్ నుంచి సమాచారం వచ్చింది. రంగంలోకి దిగిన ఆర్పీఎఫ్ బృందాలు చెన్నై పోలీసులు వాట్సప్ ద్వారా పంపిన పాత ఫొటోల ఆధారంగా రెండు రైళ్లను గూడూరు స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఆఖరిగా మధురై నుంచి హజరత్ నిజాముద్దీన్ వెళ్లే సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో దొంగలు ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. రైలు తెనాలి స్టేషన్‌లో ఆగిన వెంటనే వేగంగా అన్ని బోగీల్లో తనిఖీలు చేపట్టారు.బోగీలో ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. వీరిని ప్రత్యేకంగా గమనిస్తూ ఓ టీము విజయవాడ వరకు వెంబడించింది. మరో టీము నిందితులను పట్టుకునేందుకు విజయవాడ రైల్వే స్టేషన్‌లో నిఘా పెట్టి విజయవంతంగా అమలు చేసింది. అదుపులోకి తీసుకున్న నిందితుల నుంచి రూ.5 కోట్ల విలువైన 13.5 కిలోల బంగారం, 67 కిలోల వెండి, రూ.40వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. భారత రైల్వే చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో రికవరీ చేయడం ఇదే ప్రధమమని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

28 నుంచి సర్క్యూట్ బెంచ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వినియోగదారుల ఫిర్యాదుల అప్పీళ్లు, రివిజన్ పిటిషన్లపై విచారణ జరిపేందుకు జాతీయ వినియోగదారుల వివాదాల, రిడ్రెసల్ కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ) హైదరాబాద్‌లో సర్క్యూట్ బెంచ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 8 వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రా లకు చెందిన కేసులపై విచారణ చేపట్టనున్నారు. ఆదర్శనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సమావేశ మందిరంలో వినియోగదారుల భద్రతా చట్టం 1986 ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను చేపట్టనున్నారు. రెండు రాష్ట్రా లకు చెందిన వారు కొత్తగా అప్పీల్స్‌ను, రివిజన్ పిటిషన్లను నేరుగా సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. వినియోగదారులు తమ ఫిర్యాదుల పరిష్కారాల కోసం ఢిల్లీ వరకు వెళ్లకుండా ఆయా రాష్ట్రాల్లోనే పరిష్కారమయ్యే విధంగా జాతీయ కమిషన్ రాష్ట్రా ల్లోనే సర్క్యూట్ బెంచ్‌లను ఏర్పాటు చేస్తోంది. జాతీయ కమిషన్ అధ్యక్షులు ఆర్‌కె అగర్వాల్ కేసుల విచారణను చేపట్టనున్నారు.

బీసీ జాబితాలో 'మేరు'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బీసీ జాబితాలో మేర, చిప్పోల్లు పదాలు పొందు పరచి ఉండటం వలన మేరు కులస్తులకు కుల ధృవీకరణ పత్రాల జారీలో ఇబ్బందులు వస్తున్నాయని మేరు సంఘం ప్రతినిధులు తెలంగాణ బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. మేరోల్లు, మేరు అని వ్యవహారిక భాషలో పిలవబడుతున్నందున చిప్పోల్లు, మేరకు పర్యాయపదంగా మేరు పదాన్ని బీసీ జాబితాలో చేర్చాలని తెలంగాణ మేరు సంఘం రాష్ట్ర నాయకులు కోవూరి భాస్కర్ రావు, పోడిశెట్టి నర్సింగరావు, రావిపాపన్న, కెవి మురళీధర్‌రావులు ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్‌తో కలిసి బుధవారం బీసీ కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, జూలూరి గౌరీశంకర్‌లకు విజ్ఞప్తి చేశారు.

సంక్రాంతికి 54 ప్రత్యేక రైళ్లు

● ఉప రాష్ట్రపతి వెంకయ్య చొరవ


హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి పండుగ రద్దీని నివారించేందుకు ప్రయాణికులకు రవాణా ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వీలైనన్ని ప్రత్యేక రైళ్ళను నడపాలన్న ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు సూచన మేరకు రైల్వే శాఖ ప్రత్యేక చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగానే 54 ప్రత్యేక జన సాధారణ రైళ్ళను నడపాలని నిర్ణయించింది. సికింద్రాబాద్ - విజయవాడ - హైదరాబాద్ మధ్య 18 రైళ్లు (11, 12, 13, 15, 16, 17, 18, 19, 20 తేదీలలో), సికింద్రాబాద్ - విజయవాడ - సికింద్రాబాద్‌ల మధ్య 16 రైళ్ళు (11, 12, 13, 15, 16, 17, 18, 19 తేదీలలో), సికింద్రాబాద్ - తిరుపతి - సికింద్రాబాద్‌ల మధ్య రెండు రైళ్ళు, తిరుపతి - కాకినాడ టౌన్‌ల మధ్య రెండు రైళ్ళు, విజయవాడ- విజయనగరం మధ్య 16 రైళ్ళు నడపనున్నారు. సికింద్రాబాద్ - తిరుపతి జనసాధారణ స్పెషల్ రైలు ఈనెల 11న బయలు దేరుతుంది. ఈ రైలు కాజీపేట, వరంగల్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. తిరుపతి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈనెల 12వ తేదీన బయలు దేరుతుంది. ఈ ప్రత్యేక రైలు రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు,



చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. విజయవాడ-విజయనగరం - విజయనగరం ప్రత్యేక జనసాధారణ రైలు ఈనెల 10,11,12,13 తేదీల్లో బయలు దేరుతుంది. ఈ ప్రత్యేక రైలు నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, పిఠాపురం, అన్నవరం, తుని, నర్సీపట్నం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస స్టేషన్లలో ఆగుతుంది. విజయవాడ - విజయనగరం ప్రత్యేకరైలు ఈనెల 17,18,19,20 తేదీల్లో బయలు దేరుతుంది. ఈ ప్రత్యేక రైల్లో 16 జనరల్ సెకండ్‌క్లాస్ కోచ్‌లు, రెండు గేజ్ కమ్ బ్రేక్ వ్యాన్ కోచ్‌లు ఉంటాయని రైల్వే శాఖ తెలిపింది.

డిమాండ్ ఉన్న కోర్సులకు అనుమతి?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో డిమాండ్ కోర్సులకు అనుమతులు ఇవ్వడానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆలోచన చేస్తోంది. అదేవిధంగా ఇప్పటికే డిమాండ్ ఉన్న కోర్సులకు అదనపు సెక్షన్లను కూడా ఇచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం. వీటికి సంబంధించి 2019-20 విద్యా సంవత్సరంలో అనుమతులు ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. ఇందుకోసం విద్యా సంవత్సరం ప్రారంభానికి, డిగ్రీ అడ్మిషన్ల కంటే ముందే నోటిఫికేషన్‌ను జారీ చేసి దరఖాస్తులను తీసుకోనుంది.



కొత్త డిగ్రీ కాలేజీలకు అనుమతులు ఇవ్వకపోవడంతో కొన్ని కాలేజీల యాజమాన్యాలు ఉన్నత విద్యా మండలిని సంప్రదించి అదనపు సెక్షన్లకు, కొన్ని కొత్త కోర్సులకు అనుమతులు ఇవ్వాలని కోరినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి వచ్చే విద్యా సంవత్సరం నుంచి అటువంటి వాటికి అనుమతులు ఇవ్వాలని సూచన ప్రాయంగా ఉన్నత విద్యా మండలి నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కాలేజీల్లో బీఎస్సీ కంప్యూటర్స్‌కు, బీకాం జనరల్‌తోపాటు, బీకాం కంప్యూటర్స్ కోర్సులకు మంచి డిమాండ్ ఉంటుంది. అందుకే కేవలం బీఏ, బీఎస్సీ కోర్సులను కొనసాగిస్తున్న కాలేజీలకు అదనంగా బీకాం జనరల్‌తోపాటు, బీకాం కంప్యూటర్స్ కోర్సులకు అనుమతులు కావాలని దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతులు ఇవ్వనున్నారు. అలాగే ఇప్పటికే బీఎస్సీ కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్ కోర్సులు ఉండి వాటిలో అదనపు సెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే వాటికి అనుమతులు ఇవ్వనున్నారు. అయితే అదనపు సెక్షన్లు కానీ, అదనపు కోర్సులు అనుమతులు ఇవ్వడానికి తగిన మౌలిక వసతులు, సౌకర్యాలు, బోధనాసిబ్బంది ఉంటేనే ఉన్నత విద్యా మండలి అనుమతులు ఇవ్వనుంది.

రాష్ట్రంలో ఇంజనీరింగ్‌తోపాటు ఇతర వృత్తి విద్యా కోర్సులకు రానున్న మూడేళ్ల కోసం ఫీజులను

ఆన్‌లైన్‌లో ఏఎఫ్ఆర్‌సీ దరఖాస్తులు

నిర్ణయించడానికి అడ్మిషన్స్, ఫీజు రెగ్యులేటరీ కమిటీ(ఏఎఫ్ఆర్‌సీ) కాలేజీ యాజమాన్యాల నుంచి దరఖాస్తులను ఈ ఏడాది ఆన్‌లైన్‌లో స్వకరించనుంది. గతంలో మాదిరిగా కాకుండా నేరుగా దరఖాస్తులోనే అన్ని రకాల వివరాలను స్కాన్డ్ కాపీలు కాకుండా నేరుగా అప్‌లోడ్ చేసేలా నేషనల్ ఇన్ఫర్మేషన్ కౌన్సిల్(ఎన్ఐసీ) దరఖాస్తు నమునాను రూపొందిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ఎన్ఐసీ ఇప్పటికే ప్రారంభించింది. ఒకటి రెండు రోజుల్లో ఇందుకు సంబంధించి పూర్తి నమునాను రూపొందించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే శుక్రవారం ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ తెలంగాణ ఏఎఫ్ఆర్‌సీ జారీ చేయనుంది. గతంలో కూడా దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే స్వీకరించినప్పటికీ దరఖాస్తుతోపాటు సంబంధిత పత్రాలను స్కాన్ చేసిన అప్‌లోడ్ చేయాల్సి ఉండేది. కానీ ఈ ఏడాది అలా కాకుండా నేరుగా దరఖాస్తులోనే చేర్చేలా దరఖాస్తు నమునాను ఎన్ఐసీ రూపొందిస్తోంది.

జీఎస్టీ ఎగవేతదారులపై కఠిన చర్యలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జీఎస్టీ మోసాలకు పాల్పడుతున్న పాపులర్ రిసార్ట్స్ అండ్ హోలిస్టిసక్ డెస్టినేషన్ ఎండీని జీఎస్టీ డైరెక్టరేట్ జనరల్ ఇంటలిజెన్స్ (డిజిజిఐ) అదుపులోకి తీసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా జీఎస్టీ ఖాతాలను నిర్వహించకుండా పన్ను ఎగవేత కు పాల్పడుతున్నట్లు గుర్తించిన డీజీజీఐ ఈ మేరకు చర్యలు తీసుకుంది. విని యోగదాలు, అతిథులనుంచి పన్ను వసూలు చేసి ప్రైవేటు అవసరాలకు, ఇతర ఖాతాలకు మళ్లిస్తున్నట్లుగా జీఎస్టీ ఇంటెలిజెన్స్ గుర్తించింది. సరైన ఖాతాలు నిర్వహించకుండా, ప్రతీనెలా జీఎస్టీ రిటర్నులను ఫైల్ చేయకుండా పన్ను ఎగవేతకు పాల్పడుతున్న తీరుపై సీరియస్ చర్యలకు ఉపక్రమించింది. గతంలో కూడా ఈ రిసార్ట్ సర్వీస్ టాక్స్ చెల్లిం చడంలేదని కేంద్ర సంస్థలు పలు తాఖీదులిచ్చాయి. అయినా స్పందన లేకపోగా 2017 జూలైనుంచి జీఎస్టీ ఎగవేతకు పాల్పడుతోంది. ఇలా వినియోగదారులు, అతిథులనుంచి పన్ను వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించని సొమ్ము రూ. 5కోట్లకు మించినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ పరిణామాలను తీవ్రంగా గుర్తించిన కేంద్ర పన్ను సంస్థ నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసింది.

మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైల్వేలో పురోగతిలో ఉన్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సంబంధించిన పనులపై దృష్టికేంద్రాకరించాలని నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని రైల్వే బోర్డ్ ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ సలహా ఇచ్చారు. కొత్త రైలు మార్గాల నిర్మాణం, గేజ్ మార్పిడులు, డబ్లింగ్‌లకు సంబంధించిన పురోగతి, ప్రధాన మంత్రి కార్యాలయం, రైల్వే మంత్రి పియూష్ గోయల్‌లు పర్యవేక్షిస్తారని తెలిపారు. బుధవారం అన్ని జోన్ల జనరల్ మేనేజర్‌లు, ఆర్‌వీఎన్‌ఎల్, కోర్ సంస్థల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 2018 - 19 ఆర్థిక సంవత్సరంలో పూర్తి కావలసిన రైల్వే ప్రాజెక్టుల పురోగతిని యాదవ్ సమీక్షించారు. కొత్త రైలు మార్గాలు, డబ్లింగ్, ట్రిప్లింగ్, విద్యుదీకరణ, గేజ్ మార్పిడి, బైపాస్ లైన్లు, యార్డుల ఆధునీకరణ పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించి మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. భూ సేకరణ పనులతో సహా అన్ని కీలక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రయత్నించాలన్నారు. ఈ సమావేశంలో ద.మ.రై. అదనపు జీఎం జాన్ థామస్ జోన్‌కు సంబంధించిన నివేదికను రైల్వే బోర్డు ఛైర్మన్‌కు సమర్పించారు.

కృష్ణా ట్రిబ్యునల్ సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కృష్ణానదీయాజమాన్య బోర్డు సమావేశం బుధవారం జలసౌధలో జరిగింది. బోర్డు ఛైర్మన్ సిన్హా అధ్యక్షతన జరిగిన సమావేశంలో గత నెలలో కేటాయించిన నీటివిడుదల, ఇతర సమస్యలపై చర్చించినట్లు సమాచారం. డిసెంబర్ 21న జరిగిన సమావేశంలో తెలంగాణకు 38.09టిఎంసిలు, ఏపీకి 26.71టీఎంసీలు కేటాయించిన విషయం విదితమే. శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుండి నీటివిడుదలకు గతంలో నిర్ణయం తీసుకోగా, తాజాగా ఆయా ప్రాజెక్టుల్లో ఉన్న నీటిమట్టాల పరిస్థితిని సమీక్షించి తాగు,సాగునీటి అవసరాలకు ఆయా ప్రాంతాల్లో ఉన్న అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. ఇక కేఆర్‌ఎంబీ టెలిమెట్రీ ఇతర అంశాలపై కూడా సమావేశంలో చర్చించినట్లు తెలిసింది.

మోడీకి కార్మికుల సత్తా చూపిస్తాం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రధాని నరేంద్ర మోడీకి కార్మికుల ఐక్యత ఏంటో చూపిస్తామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ కుమార్ సేన్ హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నా బీజేపీ ప్రభుత్వానికి ఇంటికి సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం ఢిల్లీలో పది కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన ప్రసంగించారు. తపన్ సేన్ మాట్లాడుతూ.. మోడీ ప్రభు త్వం విధానాలకు వ్యతిరేకంగా జనవరి 8, 9వ తేదీల్లో దేశవ్యాప్తంగా జరిగేజాతీయ సమ్మెలో అన్నివర్గాలు పాల్గొంటున్నట్టు ఆయన చెప్పారు. జాతీయ సమ్మెలో భాగంగా భారీ ర్యాలీ, ధర్నాలు, పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వివరించారు. జిల్లా, రాష్ట్ర స్థా యిల్లో సంఘటితంగా ఆందోళన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కేంద్ర ప్రభు త్వం గడచిన మూడు సంవత్సరాలు కనీసం కార్మిక సంఘాలతో చర్చలు కూడా నిర్వహిం చలేదని... దాంతోపాటు కార్మిక హక్కలపై పెద్దఎత్తున దాడి జరుగుతుందని విమర్శించారు.

ఫిబ్రవరిలో అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ మొదటి సెమిస్టర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2017-18 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమి స్టర్ పరీక్షలను ఫిబ్రవరి 20 నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పరీక్ష ఫీజును ఫిబ్రవరి 1 లోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలని వర్సిటీ ప్రజా సంబంధాల అధికారి పి వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ. 200తో ఫిబ్రవరి 10 వరకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. టీఎస్ ఆన్‌లైన్, ఏపీ ఆన్‌లైన్ ద్వారా ఫీజులను చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు స్పష్టం చేశారు.

ఫిన్‌టెక్ హబ్‌కు సహకరిస్తాం

- ఏపీ మంత్రి లోకేష్‌కు సంజయ్ బజాజ్ హామీ



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో ఫిన్‌టెక్ అభివృద్ధికి తమ సంస్థ పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని సీఐఐ నేషనల్ కమిటీ ఆన్ ఇన్సూరెన్స్, పెన్షన్స్ ఛైర్మన్ సంజయ్ బజాజ్ హామీ ఇచ్చారు. ఇప్పటికే నవ్యాంధ్రలో ఫిన్‌టెక్‌తో పాటు వివిధ రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని తమ సంస్థ గమనించిదని ఆయన తెలిపారు. బుధవారం సచివాలయంలో సంజయ్ బజాజ్‌తో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి సంబంధించి సుదీర్ఘ చర్చ జరిగింది. విశాఖపట్నం ఫిన్‌టెక్ హబ్‌గా మారుతున్నదని, ఈ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే విధంగా యూజ్ కేస్ రిపాజిటరీని ఏర్పాటు చేశామని లోకేష్ తెలిపారు. తమ ప్రభుత్వం టెక్నాలజీని పెద్ద ఎత్తున వినియోగిస్తున్నందున మరిన్ని కంపెనీలు ప్రారంభించడానికి అవకాశాలు ఏర్పడాయన్నారు. ఇప్పటికే విశాఖపట్నంలో 25 ఫిన్‌టెక్ కంపెనీలు తమ కార్యకలపాలను ప్రారంభించాయని సంజయ్ బజాజ్‌కు లోకేష్ వివరించారు. పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని, దేశంలోనే రెండు అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, కియా మోటర్ల కంపెనీ, రూ. 24వేల కోట్లను పెట్టుబడులతో ఆంధ్రాపేపర్స్ ఎక్సలెన్స్ కంపెనీలు నవ్యాంధ్రలో ఏర్పడడమే అందుకు ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. ఏపీ ఫిన్‌టెక్ వ్యాలీతో తమ సంస్థ ఒప్పందం చేసుకోవడం తమకు గర్వంగా వుందని, ఆ ఒప్పందానకి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో ఫిన్‌టెక్ రంగం శరవేగంగా అభివృద్ధి చెందటానికి తమ సంస్థ పక్షాన సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి లోకేష్‌కు సంజయ్ బజాజ్ స్పష్టమైన హామీ ఇచ్చారు.


ఓట్ల కోసమే ఈబీసీ రిజర్వేషన్లు

- ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ

అమరావతి, ఆంధ్రప్రభ : కనీసం న్యాయ శాఖను కూడా సంప్రదించకుండా కేంద్రం హడావిడిగా అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని రాష్ట్రఎస్సీ, ఎస్టీకమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ అన్నారు. రానున్న ఎన్నికల్లో ఆయా వర్గాల ఓట్లు దండుకునేందుకు ఈ కొత్త ఎత్తుగడ వేసిం దని అన్నారు. ఇది ఒక విధంగా రాజ్యాంగాన్ని తూట్లు పొడవడం, అవమానించ డమే న న్నారు. కేంద్రం ప్రకటించిన రిజర్వేషన్లలో హేతుబద్ధత, శాస్త్రీయత లోపించిందం టూనే ఆయన అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రిజర్వే షన్లు ప్రకటించే ముందు కమిషన్ వేసి అధ్యయనం చేసి, అగ్ర కులాలలో ఎవరు వెనుకబడి ఉన్నారో వారి రాజకీయ సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేయాల్సి ఉందన్నారు.

350 కోట్లు లోక్‌సభ ఎన్నికలకు అవసరం

- అసెంబ్లీ ఎన్నికల ఖర్చు రూ.270కోట్లు దాటింది
- కొత్తగా ఓటుకోసం 8లక్షల దరఖాస్తులు
- 25వరకు ఓటరు నమోదు
- ఫిబ్రవరి 25న తుది జాబితా వెల్లడి
- 1.5కోట్లమందికి ఈసీ పేరుతో లేఖలు
- సీఈవో డా.రజత్ కుమార్



డా.రజత్‌కుమార్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: త్వరలో జరగనున్న లోక్‌సభ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియ మొదలైంది. తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉన్న పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు రూ.350కోట్ల రూపాయలు అవసరం అని రాష్ట్ర ఎన్నికల సంఘం కేంద్రానికి నివేదిక పంపింది. లోక్‌సభకు జరిగే ఎన్నికల వ్యయం పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించాల్సి ఉన్నందున ఎన్నికల వ్యయపు ముందస్తు అంచనాలతో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఖర్చులు కూడా రూ.270కోట్లు దాటిపోయినట్ట ఎన్నికల సంఘం చీఫ్ డా.రజత్‌కుమార్ వెల్లడించారు. పోలీసు శాఖకు సంబంధించి న ఎన్నికల వ్యయం ఇందులో లేదని అది ప్రత్యేక బడ్జెట్‌గా పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘానికే ఇంకా రూ.50లక్షలకు పైగానే ప్రభుత్వం నుంచి రావాల్సి వుందన్నారు. బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డా.రజత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమం జరుగుతోందన్నారు. డిసెంబర్ 26నుం చి ఈనెల 25జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమంలో 18ఏళ్లు నిండిన వారు, ఓటర్ల జాబితాల్లో పేర్లు లేని వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటు భారత పౌరసత్వాన్ని సూచిస్తుందన్నారు. ఓటు హక్కుకోసం కొత్తగా 8లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ఓట్ల తొలగింపు కోసం పదివేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఫిబ్రవరి 25న ఓటర్ల తుది జాబితాలను ప్రచురించనున్నట్టు వెల్లడించారు.తుది జాబీతాలు ముద్రించిన తరువాత డబుల్ ఓటర్‌గా ఉన్న పేర్లను తొలగించటం సాధ్యం కాదన్నారు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్ల జాబితాలపై అధికసంఖ్య లో ఆరోపణలు వచ్చాయని , ఈ సారి అటువంటి పొరపాట్లకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మిస్సింగ్ ఓటర్స్‌కు సంబంధించి ప్రత్యేక కార్యక్రమం చేపడు తున్నట్టు వెల్లడించారు. డిలీషన్స్‌పై కూడ సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 28లక్షల డిలీషన్స్ జరిగాయన్నారు. ఓటర్ల డిలీషన్స్ , డబుల్ ఎంట్రీ వంటి వాటికి సంబంధించి వెరిఫికేషన్స్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించే జిల్లా ఎన్నికల అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో అదనంగా 2030 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని వీటిపై జిల్లా ఎన్నికల అధికారులే తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

ఓటు మీ హక్కు... కోటిన్నర లేఖలు

రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నదే తమ లక్ష్యం అని చీఫ్ కమీషనర్ రజత్ కుమార్ వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు తానే స్వయంగా లేఖలు రాస్తున్నట్టు తెలిపారు. కోటిన్నర కుటుంబాలకు చేరేలా లేఖలు సిద్ధం చేస్తున్నామన్నారు తన సెల్ఫ్ అడ్రస్‌తో రిప్లై కార్డులు కూడ పెడుతున్నట్టు వెల్లడించారు. ఒక్కోలేఖకు 50పైసలు ఖర్చవుతుందని ఇందుకోసం మొత్తం రూ.50లక్షలు ఖర్చు చేయనున్నట్టు సీఈఓ డా.రజత్ కుమార్ పేర్కొన్నారు.

ఏపీలో ఆర్టీసీ సమ్మెకు ఎన్ఎంయూ మద్దతు



అమరావతి, ఆంధ్రప్రభ : ఆర్టీసీ వేతన సవరణ కోసం జరిగే పోరాటంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ మిగతా కార్మిక సంఘాలతో కలిసి పోరాడుతుందని ఎన్ఎంయూ రాష్ట్ర నేతలు స్పష్టంచేశారు. వేతన సవరణ కోసం సమ్మె తలపెట్టిన ఎంప్లాయిస్ యూనిన్‌కు మద్దతుగా బుధవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ ర్యాంప్ వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు అంబటి శ్రీనివాస్, ఎన్.వి.కుమార్, తోట నాగేశ్వరరావు మాట్లాడుతూ సమ్మెలోకి వెళుతున్న కార్మిక సంఘాల కూటమికి సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నామన్నారు. వారు జరిపే పోరాటానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్మికుల సంక్షేమం ధ్యేయమే ఎన్ఎంయూ లక్ష్యమన్నారు. కార్మికుల సంక్షేమ కోసం చేసే ఉద్యమాల్లో తమ యూనియన్ సహకారం ఎప్పుడూ ఉంటుందని స్పష్టంచేశారు.

Andhraprabha business 2018

బిజినెస్

BUSINESS

ఇండస్ఇండ్ బ్యాంకు లాభం రూ.985 కోట్లు

• క్యూ3లో 5 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రైవేట్ రంగానికి చెందిన ఇండస్ఇండ్ బ్యాంకు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 5.2 శాతం వృద్ధితో రూ.985.03 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో బ్యాంకు నికరలాభం రూ.936.25 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. బ్యాంకు మొత్తం ఆదాయం క్యూ3లో పెరిగి రూ.7,232.32 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.5,473.54 కోట్లని పేర్కొంది. గరిష్ఠ ఎన్‌పీఏ 1.13 శాతానికి దిగారాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 1.16 శాతంగా నమోదైంది. నికర ఎన్‌పీఏ మాత్రం 0.59 శాతానికి ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 0.46 శాతంగా నమోదైంది.

బజాజ్ కార్పొరేషన్ రెవెన్యూ రూ.237 కోట్లు

• క్యూ3లో 11.5 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : బజాజ్ కార్పొరేషన్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన నికరలాభంలో 8.93 శాతం వృద్ధితో రూ.60.09 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.55.16 కోట్లు నమోదు చేసింది. క్యూ3లో ఆదాయం 11.48 శాతం వృద్ధితో రూ.236.94 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.212.53 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. కంపెనీ వ్యాపారం విషయానికి వస్తే. కాస్మొటిక్స్, టాయిలటరీస్, ఇతర పర్సనల్ కేర్ ఉత్పత్తులను విక్రయిస్తోంది. కాగా కంపెనీ బోర్డు రూ.1 ముఖ విలువ షేరుపై మధ్యంతర డివిడెండ్‌ను రూ.14గా సిఫారసు చేసింది. బీఎస్ఈలో దీని షేరు 2.32 శాతం క్షీణించి రూ.375.10 వద్ద ముగిసింది.

మెర్సిడెజ్ బెంజ్ అమ్మకాలు 15,538 యూనిట్లు

• గతేడాది అమ్మకాల్లో 1.4 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : జర్మనీకి చెందిన ఆటో దిగ్గజం మెర్సిడెజ్ బెంజ్ 2018 అమ్మకాల్లో కేవలం 1.4 శాతం వృద్ధితో 15,538 యూనిట్లు విక్రయించింది. అయితే లగ్జరీ కార్ల మార్కెట్లో వరుసగా నాలుగో సంవత్సరం నెంబర్ వన్ స్థానంలో నిలిచింది. 2017లో మెర్సిడెజ్ బెంజ్ 15,530 యూనిట్లు విక్రయించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది. గత ఏడాది అమ్మకాల్లో కంపెనీకి చెందిన అన్నీ మోడల్స్ నెక్స్ట్ జనరేషన్ కార్లు, సెడాన్‌లు, ఎస్‌యూవీ, ఎఎంజీ పోర్టుపోలియో అమ్మకాలు అన్నీ మెరుగ్గానే ఉన్నాయని మెర్క్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో మార్టిన్ స్వెంక్ తెలిపారు. అమ్మకాల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది ద్వితీయార్థం నుంచి ఆర్థిక వ్యవస్థ మందగించిందని దీంతో కొనుగోలుదార్లలో సెంటిమెంట్ బలహీనపడి అమ్మకాలపై ప్రభావం చూపించిందని ఆయన వివరించారు. క్యూ4తో తిరిగి పుంజుకున్నామని, ఏడాది ప్రాతిపదికన చూస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించాని ఆయన వివరించారు. బెంజ్‌కు పోటీ కంపెనీ అయిన బీఎండబ్ల్యు ఇండియా అమ్మకాల్లో 13 శాతం వృద్ధి కనిపించింది. గత ఏడాది అమ్మకాలు 11,105 యూనిట్లకు చేరాయి. అంతకు ముందు ఏడాది అంటే 2017లో 9,800 యూనిట్లు విక్రయించింది. టాటామోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ అమ్మకాల్లో 16.23 శాతం వృద్ధితో గత ఏడాది 4,596 యూనిట్లు విక్రయిస్తే.. 2017లో 3,594 యూనిట్లు విక్రయించింది. వోల్వో ఇండియా అమ్మకాల్లో 30 శాతం వృద్ధితో 2,638 యూనిట్లు విక్రయిస్తే.. 2017లో 2,029 యూనిట్లు విక్రయించింది. మరో లగ్జరీ కంపెనీ ఆడి మాత్రం ఇప్పటి వరకు 2018 అమ్మకాల వివరాలు ప్రకటించలేదు.

ఎంఅండ్ఎం ఎక్స్‌యూవీ 300 బుకింగ్ షురూ

ధర రూ.8-12 లక్షలు

న్యూఢిల్లీ : ఆటోదిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రాకు చెందిన ఎస్‌యూవీ ఎక్స్‌యూవీ 300 మోడల్ బుకింగ్ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ మోడల్‌ను కంపెనీ వచ్చే నెల మార్కెట్లో ఆవిష్కరించనుంది. పెట్రోల్, డిజెల్ ఇంజిన్ వెరియెంట్లలో ఈ ఎస్‌యూవీ లభిస్తుంది. దీని ధర రూ.8-12 లక్షలు (ఎక్స్‌షోరూం) అని కంపెనీ చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ చీఫ్ విజయ్ రామ్‌నక్రా తెలిపారు. డీలర్ల వద్ద లేదా అధికారికి వెబ్‌సైట్ ద్వారా రూ.20వేలు చెల్లించి ముందుస్తు బుకింగ్ చేసుకోవచ్చునని సూచించింది. మార్కెట్లో ఈ ఎస్‌యూవీ మారుతి విటారా బ్రెజ్జా, ఫోర్డ్ ఈకో స్పోర్ట్, టాటా నెక్సాన్‌కు పోటీ ఇస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. భద్రతా ఫీచర్లకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ముఖ్యంగా ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, డ్యూయెల్ జోన్ పూర్తి ఆటోమెటిక్ క్లయిమెట్ కంట్రోల్, ఫ్రంట్ పార్కింగ్ సెన్సార్‌లు వీటి ప్రత్యేకతలని ఎంఅండ్ఎం ప్రకటనలో వివరించింది. ఈ ఎస్‌యూవీని మహారాష్ట్రలోని నాసిక్ ప్లాంట్‌లో అభివృద్ధి చేసింది.

ఎన్‌ఎండీసీ షేర్ల బైబ్యాక్

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన ఎన్‌ఎండీసీ బోర్డు రూ.1,000 కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనను బుధవారం నాడు ఆమోదించింది. ఒక్కో షేరును రూ.98 చొప్పున మొత్తం 10.20 కోట్ల షేర్లను కొనుగోలు చేస్తున్నట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. కాగా మంగళవారం నాడు ఆర్థికమంత్రిత్వశాఖ షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనను ఆమోదించింది. కాగా కంపెనీ బోర్డు రూ.1 ముఖ విలువ చేసే మొత్తం 10,20,40,815 షేర్లను మొత్తం పెయిడ్‌అప్ ఈక్విటీలో ఇది 3.23 శాతంగా ఉంటుందని తెలిపింది. ఈ బైబ్యాక్‌కు రూ.1,000 కోట్లు మించకుండా మొత్తం నగదు ద్వారానే కొనుగోలు చేస్తామని ఎన్‌ఎండీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 18వ తేదీన కంపెనీ బైబ్యాక్ ఆఫర్‌కు ఎవరూ అర్హులో కూడా తుది నిర్ణయం తీసుకుంటుంది. ఎన్‌ఎండీసీలో ప్రభుత్వానికి 72.43 శాతం వాటాలున్నాయి. ఇదిలా ఉండగా బీఎస్ఈలో దీని షేరు 3.74 శాతం క్షీణించి రూ.91.40 వద్ద ముగిసింది.

భారత్ జీడీపీ 7.3%

ఆర్థిక వేగంలో భారత్ టాప్

ప్రపంచ బ్యాంక్ అంచనా



వాషింగ్టన్ : ఈ ఆర్థిక సంవత్సరం 2018-19లో భారత్ ఆర్థిక వ్యవస్థలేదా (స్థూలదేశీయోత్పత్తి ..జీడీపీ)7.3 శాతంగా నమోదు కావచ్చునని ప్రపంచబ్యాంకు అంచనా వేసింది. అటు తర్వాత వచ్చే రెండు సంవత్సరాల కాలం పాటు జీడీపీ వృద్ధిరేటు 7.5 శాతంగా సాధించవచ్చునని ప్రపంచబ్యాం కు తాజా నివేదికలో పేర్కొంది. వృద్ధిరేటు పెరగడానికి ప్రధాన కారణం వినియోగం పెరగడంతో పాటు పెట్టుబడు లు పెరగడమేనని అంచనా వేసింది. ప్రపంచంలోనే శరవేగంగా అభివృద్ధి చెందు తున్న ఆర్థిక వ్యవస్థలో భారత్ అగ్రస్థానంలో ఉందని పేర్కొం ది. ఇకచైనా జీడీపీ వృద్ధిరేటు ఈ ఏడాది, వచ్చే ఏడాది కాస్తా మందగిం చి 6.2 శాతానికి 2021 నాటికి 6 శాతానికి దిగిరావచ్చునని అంచనా వేసింది.

ప్రపంచబ్యాంకు మంగళవారం నాడు గ్లోబల్ ఎకనమిక్ ప్రాస్పెక్ట్స్ : జనవరి 2019ని విడుదల చేసింది. ఇదిలా ఉండగా 2018లో చైనా జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా నమోదు కాగా.. భారత్ వృద్ధిరే టు 7.3 శాతం, అదే 2017లో చైనా వృద్ధి రేటు 6.9 శాతానికి ఎగబాకగా.. భారత్ వృద్ధి రేటు 6.7 శాతంగా నమోదైం ది. భారత్ వృ ద్ధిరేటు మందగించడానికి ప్రధాన కారణం పెద్దనోట్ల రద్దుతో పాటు కొత్తగా వస్తు సేవల పన్ను (జీఎస్టి)ని అమ ల్లోకి తేవడమేనని ప్రపంచ బ్యాంకు నివేదికలో వివరించింది.



భవిష్యత్తులో మరింత జోరు

భారత్ భవిష్యత్తు వృద్ధిరేటు గురించి ప్రస్తావిస్తూ.. ప్రపంచం లోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భారత్ దూసుకుపోతుందని ప్రపంచ బ్యాంకు ప్రాస్పెక్టస్ గ్రూపు డైరెక్టర్ అయాన్ కోసే పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు .భారత్‌కు కలిసొచ్చే అంశాల విషయానికి వస్తే పెట్టుబ డులు క్రమంగా పుంజుకుం టున్నాయి. అలాగే విని యోగం డిమాండ్ కూడా బలంగా ఉందని అన్నారు. తన అం చనా ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం 2018- 19లో భారత్ జీడీపీ వృద్ధిరేటు 7.3 శాతం, 2019 నుంచి 2020 వరకు సరాసరి వృద్ధిరేటు 7.5 శాతంగా ఉండ వచ్చునని అంచనా వేశారు. ఇక భారత్ విషయానికి వస్తే సరళతర వాణిజ్యం .. లేదా ఈజ్ ఆఫ్ డూయిం గ్ బిజినెస్ లో మంచి ర్యాంకిం గ్ సాధించింది.. దాని ప్రభా వంతో వృద్ధి రేటు జోరం దుకు న్న విషయం కం టి ముందు కనిపిస్తోం దన్నారు.

చిన్న చిన్న అడ్డంకులు గాయబ్

భారత్ వృద్ధిరేటు పుంజుకోవ డానికి ప్రధాన కారణం వినియోగం పెరిగిపోవడం, అదే సమయంలో పెట్టు బడులు జోరందుకోవడంతో తాత్కాలికంగా ఎదురైన కొన్ని ప్రతికూలాంశాలు మటుమాయం అయ్యాయని ప్రపంచ బ్యాంకు తాజా నివేదికలో వివరించింది. దేశీయంగా డిమాండ్ పెర గడానికి ప్రధాన కారణం ప్రభుత్వం తీసుకొచ్చి న నిర్మాణా త్మకమైన సంస్కరణలు ఉదాహరణకు జీఎస్టి ద్వారా కొంత లబ్ధి సమకూరిందని.. అదే సమయంలో ప్రభుత్వం బ్యాం కులకు అదనపు మూలధనం సమకూర్చడం తదితర అంశా లన్నీ భారత్ వృద్ధిరేటు పుంజుకోవడానికి బాగా కలిసొచ్చా యని ఆయన ఉదాహరణగా చెప్పారు.ఈ ఆర్థిక సంవత్సరం అంటే గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు భారత్ జీడీపీ వృద్ధిరేటు 7.3 శాతా నికి చేరుతుందని అంచనా వేయడానికి కారణం ఆర్థిక వ్యవహా రాలు తిరిగి గాడినపడ్డంతో పాటు దేశీయంగా డిమాండ్ పెరగడం. ప్రభుత్వం 2017 జులైలో తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను జీఎస్టి ప్రస్తుతం పూర్తి స్థాయిలో గాడిన పడింది. దీంతో పాటు రుణాల డిమాండ్ క్ర మంగా పెరుగుతోం ది. వృద్ధిరేటు పుంజుకోవాలంటే వినియోగం కీలక ప్రాత పోషించాల్సి ఉంటుందని ప్రపంచబ్యాంకు తాజా ని వే ది క లో వివరించింది.

ప్రపంచబ్యాంకు నివేదిక ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం 2018-19లో జీడీపీ వృద్ధిరేటు 7.3 శాతం, అటు తర్వాత నుంచి 7.5 శాతానికి చేరుతుందని ప్రపంచబ్యాంకు గత ఏడాది జూన్‌లో అంచనా వేసింది. దాని ప్రకారమే ప్రస్తుతం భారత్ వృద్ధిరేటు సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయని తెలియ జేసింది. ఇటీవల కాలంలో తీసుకొచ్చిన విధానపరమై న సంస్కరణలు ప్రస్తుతం ఫలితాలు ఇస్తున్నాయని, దీంతో రుణాల డిమాండ్ పెరుగుతోంది. అదేసమయంలో ప్రైవేట్ వినియోగం పెరగడంతో... దాన్ని అనుసరించే పెట్టుబడులు కూడా జోరందుకుంటాయని

అంచనాల ప్రకారమే

నివేదికలో వివరించింది. దేశీయంగా డి మాండ్ పెరగడంతో వచ్చే సంవత్సరం కరెంటుఖాతాలోటు జీడీపీలో 2.6 శాతానికి పెరిగిపోవచ్చునని అంచనా వేసింది. అదే సమయంలో ద్రవ్యోల్బణం కూడా రిజర్వుబ్యాంకు అంచనా వేసిన రెండు నుంచి ఆరు శాతం లక్ష్యం దాటే అవకాశాలున్నాయని తెలిపిం ది. దీనికి ప్రధాన కారణం ఇంధనం, ఆహార ధరలు పెరగడమే నని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. తాజాగా ప్రభుత్వం ప్రవేశపె ట్టిన వస్తువుల పన్ను (జీఎస్టి), పెద్దనోట్ల రద్దు తర్వాత పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా మారిపోయాయని, అసంఘటితం రంగం పూర్తిగా సంఘటిత రంగంలోకి మారిపోయిందని కోసే తెలిపారు.

భారత్ జడీపీ వృద్ధిరేటు గణాంకాలను చూస్తే తాత్కాలికంగా ఏర్పడిన ఆర్థికసంక్షోభాల నుంచి గట్టెక్కిందని ఉదాహరణకు పెద్దనోట్ల రద్దు, జీఎస్టి అని కోసే పేర్కొన్నారు. భారత్ జీడీపీ వృద్ధిరేటును 7 శాతం సాధించేసత్తా ఉందని, తన అంచ నా ప్రకారం భారత్ వృద్ధిరేటు ఏడు శాతానికి తగ్గే అవకాశాలు కనిపించడం లేదని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పా రు. భారత్ వాస్తవ వృద్ధిరేటు కంటే మరింత ఎక్కువ సాధించేసత్తా కలిగి ఉందని ఇది భారత్‌కు అనుకూలమైన సంకేతామని ఆయన వివరించారు.

ఈ ఏడాది వేసవిలో లోకసభ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందని వ్యాఖ్యానించమని కోసేను కోరగా.. ఇతర అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతో పోల్చుకుంటే భారత్ వృద్ధిరేటు ఆకర్షణీయంగా ఉందని ఆయన అన్నారు. ప్రతి ఏడాది ఆకర్షణీయమైన వృద్ధిరేటును భారత్ సాధిస్తోందని ఆయన పేర్కొన్నారు.

కార్పొరేట్ల అంచనా 7 శాతం

వచ్చే 12 నెలల కాలంలో భారత స్థూలదేశీయోత్పత్తి 7 శాతం సాధిస్తుందని భారత్ కార్పొరేట్లు అంచనా. ప్రభుత్వం తీసుకొచ్చిన పలు సంస్కరణల కారణంగా వృద్ధిరేటు జోరందుకుంటోందని పీడబ్ల్యుసీ - ఫిక్కీ సర్వేలో పేర్కొంది. భవిష్యత్తులో భారత్ ఆర్థిక మరింత వ్యవస్థ జోరందుకుంటుందని, దేశీయంగా డిమాండ్ పెరగడంతో పాటు ఎగుమతులపై ఫోకస్ పెడుతున్నందు వల్ల వృద్ధిరేటుకు ఢోకా లేదని తాజా సర్వే వెల్లడించింది. వచ్చే 12 నెలల కాలంలో జీడీపీ వృద్ధిరేటు 7 శాతంపైనే సాధించేసత్తా భారత్‌కు ఉందని ప్రపంచబ్యాంకుతో పాటు ఏషియన్ డెవలెప్‌మెంట్ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు కూడా అంచనాకు వచ్చిన విషయం ఇక్కడ ప్రస్తావించింది. ఈ సర్వేను పీడబ్ల్యుసీ-ఫిక్కీలు సంయుక్తంగా దేశంలోని పలు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్స్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్స్‌తో పాటు తయారీరంగానికి చెందిన చీఫ్‌లతో పాటు ఇతర కీలకమైన వ్యాపారవేత్తలతో గత ఏడాది జులై నుంచి అక్టోబర్ నుంచి సమాచారం సేకరించి నివేదిక తయారు చేసింది. వృద్ధిరేటు పక్కాగా 7 శాతం సాధిస్తుందనే నిర్ణయానికి రావడానికి ప్రధాన కారణం ప్రభుత్వం మౌలికరంగానికి చెందిన ప్రాజెక్టులపై దృష్టిపెట్టడం, సరళతర వ్యాపారానికి నిబంధనలను సడలించడం, పలు రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సడలించడం,ముఖ్యంగా అతి పెద్ద పెట్టుబడులకు ఎఫ్‌డీఐ నిబంధనలను మరింత సరళతరం చేయడం తదితర కారణాల వల్ల జీడీపీ వృద్ధిరేటు పెరగడానికి అవకాశాలున్నాయని తాజా నివేదికలో వివరించింది. 76 శాతం మంది కార్పొరేట్లు భారత్ ఆర్థిక వ్యవస్థ వచ్చే ఏడాది జోరందుకుంటుందని భరోసాను వ్యక్తం చేస్తే.. 63 శాతం మంది మాత్రం గతేడాది కంటే మెరుగ్గా ఉంటుందని తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. సర్వేలో పాల్గొన్న మెజారిటి కార్పొరేట్లు మాత్రం వచ్చే 12 నెలల కాలంలో భారత్ జీడీపీ సరాసరి 7 శాతం పైనే సాధింస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 5వ ఎడిషన్ పీడబ్ల్యుసీ - 'ఫిక్కీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ బారోమీటర్ : బిల్డింగ్ ఎక్స్‌పోర్టు కాంపిటీటివ్‌నెస్' సర్వేలో పేర్కొంది. కేంద్ర గణాంకాల కార్యాలయం కూడా ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ 7.2 శాతం సాధిస్తుందని ఇటీవలే అంచనా వేసింది. వ్యవసాయరంగంతో పాటు తయారీరంగం పుంజుకోవడమే దీనికి కారణమని పేర్కొంది.

7,000 కోట్లకు ఎయిరిండియా అమ్మకం?

• ప్రభుత్వ యోచన

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన ఎయిర్‌ఇండియాను విక్రయించి సుమారు బిలియన్ డాలర్లు రూ.7,000 కోట్లు సేకరించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలియజేశారు. ఎయిర్‌ఇండియా నుంచి పెట్టుబడులు ఉపసంహరించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఎయిర్‌ఇండియాకు చెందిన అనుబంధ సంస్థలతో పాటు కొన్ని ఆస్తులను విక్రయించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇదిలా ఉండగా ఎయిర్‌ఇండియా ఇప్పటికే రూ.55,000 కోట్ల అప్పుల భారంతో సతమతమవుతోంది. గత ఏడాది నవంబర్‌లో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన మినిస్టీరియల్ ప్యానెల్ ఎయిర్‌ఇండియా అప్పులు రూ.29వేల కోట్లను స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ) కింద ఎయిర్ ఇండియా అసెట్ హోల్డింగ్ కంపెనీకి బదిలీ చేయాలని నిర్ణయించింది.

మొత్తానికి ఎయిర్‌ఇండియాను విక్రయించి బిలియన్‌డాలర్లు సేకరించాలని లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రభుత్వం ఉన్నతాధికారి స్పష్టం చేశారు.గత ఏడాది మేలో ఎయిర్‌ఇండియాను విక్రయించాలని ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నించి విఫలం అయ్యింది. అటు తర్వాత జైట్లీ ప్యానెల్ తాత్కాలి కంగా వాటాల అమ్మకాలను నిలి పివేసింది. అదే సమయంలో ఎయిర్‌లైన్‌కు కొంత ని ధులను సమకూర్చి అప్పుల భారాన్ని తగ్గించి ఎయిర్ ఇండియాతో పాటు దాని అనుబంధ సంస్థలను విక్ర యించాలని నిర్ణయించింది.

ప్రారంభంలో ప్రభుత్వం ఎయిర్ ఇండియాలో మొ త్తం 76 శాతం వాటా లను, దీంతో పాటు యాజా మాన్య బాధ్యతలను ప్రైవేట్ కంపెనీకి బదిలీ చేయా లని ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే కేంద్ర షరతు ఏమిటటే ఎయిర్‌లైన్ ఖాతా లో ఉన్న రూ.24వేల కోట్ల అప్పు లతో పాటు మరో రూ. 8,000 అప్పుల బాధ్య తను తీసుకో వాలని డిమాండ్ చేయడంతో ఈ డీల్ పెద్దగా ఆకర్షణీ యంగా కనిపించ కపోవడంతో ఏ ఒక్క ఎయిర్‌లైన్ నుంచి ప్రతిపాదన రాలే దు. గతేడాది మే 31తో బిడ్డింగ్ చివరి తేదీ ము గిసిపోయింది. గత ఏడాది ఆగస్టులో టెర్న్ ఎరౌండ్ ప్లాన్ కింది ప్రభుత్వం పార్లమెంట్ అనుమతి తీసుకొని రూ.980 కోట్ల పెట్టుబడులు సమకూర్చింది. అటు తర్వాత ఈ నెల ప్రారంభంలో ఎయిర్‌లైన్‌కు అదనంగా రూ.2,345 కోట్లు మంజూరు కోసం ప్రభుత్వం పార్లమెంటు అనుమతి కూడా తీసుకొంది.



ఇదిలా ఉండగా మినిస్టీరియల్ ప్యానెల్ ఇప్పటికే ఎయిర్‌ఇండియాకు చెందిన అనుబంధ సంస్థలు ఉదాహరణకు గ్రౌండ్ హ్యాండ్లింగ్ కంపెనీని, ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్టు సర్వీసెస్ అమ్మకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. అలాగే ఎయిర్ ఇండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ అనే మరో అనుబంధ సంస్థను విక్రయించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ అనుబంధ సంస్థలతో పాటు వాటికి సంబంధించిన భూములు, భవనాలు ఇతర ఆస్తులు విక్రయించిన తర్వా త వచ్చిన డబ్బును ఎస్‌పీవీ ఖాతాకు బదిలీ చేస్తారు. ఈ నిధు లను ఎయిర్‌లైన్ అప్పులు తగ్గించుకోవడానికి వినియో గిస్తారు. ఇదిలా ఉండగా గత ఏడాది సెప్టెంబర్లో ఎయిర్‌ఇం డియా దేశవ్యాప్తంగా ఉన్న ఆస్తులను విక్రయించడానికి బిడ్‌లను ఆహ్వానించింది. ఎయిర్‌లైన్ అమ్మకానికి పెట్టిన ఆస్తుల విషయానికి వస్తే ముంబైలో 28 ఫ్లాట్‌లు, అహ్మదా బాద్‌లో ఏడు ఫ్లాట్‌లు, పూనేలో రెండు ఫ్లాట్‌లు ఆఫీస్ స్పేస్... వీటితో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఆస్తులను విక్రయించ డానికి నిర్ణయించింది. ఇదిలా ఉండగా డిసెంబర్ 27వ తేదీన పౌర విమానయాన మంత్రిత్వశాఖ లోకసభలో మాట్లా డుతూ.. ఎయిర్ ఇండియాను పునరుద్ధరించడానికి ప్రణాళి కలు సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించింది.

ఐటీ మినహాయింపు

రూ.5 లక్షలకు పెంచండి

న్యూఢిల్లీ : వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితిని రెట్టింపు రూ.5 లక్షలకు పెంచాలని పారిశ్రామిక సమఖ్య సీఐఐ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రజల్లో పొదుపును ప్రోత్సహించడానికి సెక్షన్ 80సీ -ఐటి చట్టం ప్రకారం రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు పరిమితిని పెంచాలని సూచించింది. బడ్జెట్ ముందస్తు సిఫారసుల్లో సీఐఐ పలు ఆర్థికమంత్రిత్వశాఖకు పలు సూచనలు చేసింది. అత్యధిక ఆదాయం పన్ను శ్లాబ్‌ను 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలని, అలాగే వైద్యఖర్చులను, రవా ణా అలవెన్స్‌ను మినహాయింపులు ఇవ్వాలని కోరింది. ప్రస్తుతం వ్యక్తిగత ఆదాయపన్ను రూ.2.5 లక్షల వరకు మినహాయింపు ఉంది. రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల ఆదాయంపై 5 శాతం, రూ.5 నుంచి రూ.10 లక్షల ఆదాయంపై 20 శాతం, రూ.10 లక్షల కంటే ఆదాయం ఎక్కువ ఉంటే 30 శాతం వసూలు చేస్తున్నారు. అయితే సీఐఐ మాత్రం రూ.5 లక్షల కంటే తక్కువ ఆదాయంపై పూర్తి మినహాయింపు ఇవ్వాలని.. అదే రూ.5 నుంచి రూ.10 లక్షల ఆదాయంపై 10 శాతం, రూ.10-20 లక్షల ఆదాయంపై 20 శాతం, రూ.20 లక్షల కంటే ఎక్కువ ఆదాయంపై 25 శాతం పన్ను విధించుకోవచ్చునని సూచించింది. కార్పొరేట్ టాక్స్ ను 25 శాతానికి తగ్గించాలని, టర్నోవర్‌ను పరిగణనలోకి తీసుకోకుండా దశలవారీగా 18 శాతానికి తీసుకురావాలని సూచించింది. వైద్యఖర్చులు, రవాణా భత్యం రెంటిపై స్టాండర్డ్ డిడెక్షన్ రూ.40వేల వరకు రీఎంబర్స్‌మెంట్‌ను పునరుద్ధరించాలని సీఐఐ ఆర్థికమంత్రిత్వశాఖకు సూచించింది.

మార్కెట్లకు ఫలితాల కిక్కు!

• గ్లోబల్ మార్కెట్ల అండ • వెరసి 232 పాయింట్ల వృద్ధి • వరుసగా నాలుగో రోజు లాభాల్లోనే

ముంబై : స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు బుధవారం లాభాలతో దూసుకుపోయా యి. సెన్సెక్స్ 200 పాయింట్ల పైనే లాభపడ్డంతో తిరిగి 36వేల మార్కును దాటిపోయింది. గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు రావ డం, అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చలు కొలిక్కి వచ్చే అవకాశాలు మెరుగుపడ్డంతో మా ర్కెట్లు లాభాలతో ముగిశాయి. దీంతో పాటు క్యూ 3 ఫలితాలు కూడా సీజన్ మొదలు కావడం కూడా మార్కెట్లకు బాగా కలిసొచ్చింది.

ఇక ట్రేడింగ్ విషయానికి వస్తే మార్కెట్ ప్రారంభం నుంచి లాభాలతోనే 36,181.37 వద్ద మొదలైంది. అటు తర్వాత మరింత ఎగబాకి 36,250.54 మార్కుకు చేరి.. చివరకు 36,212.91 వద్ద స్థిరపడింది. ఎట్టకేలకు మార్కె ట్ ముగిసే నాటికి సూచి 231.98 పాయింట్లు లాభ పడింది. వరుసగా గత మూడు రోజుల నుం చి సె న్సెక్స్ 467 పాయింట్లు లాభప డింది. ఇక నిఫ్టీ విషయానికి వస్తే 53 పాయింట్లు లేదా 0.49 శాతం పెరిగి 10,855.15 వద్ద ముగిసింది. ఇం ట్రాడేలో 10,870.40 నుంచి 10,749.40 మధ్య తచ్చాడింది.బీఎస్ఈలో అత్యధికంగా లాభపడి న షేర్ల విషయానికి వస్తే యాక్సిస్ బ్యాంకు, ఐటిసీ, టాటా మోటార్స్, భారతి ఎయిర్‌టెల్, ఇం డస్ఇండ్ బ్యాంకు, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, మారుతి సుజుకి, ఐసీఐసీఐ బ్యాంకు షేర్లు 2.94 శాతం వరకు లాభపడిన వాటిలో ఉన్నాయి. కాగా ఇన్ఫోసిస్ 0.90 శాతం పెరిగింది. కంపెనీ బోర్డు మంగళవారం నాడు సమావేశమై షేర్ల బైబ్యాక్‌తో పాటు ప్రత్యేక డివి డెండ్ ప్రకటించే ప్రతిపాదనలు చేసింది. కాగా ఇన్ఫీ బోర్డు 11న జరగనుంది. బీఎస్ఈలో నష్టపోయిన షేర్లలో ఎస్ బ్యాంకు, టాటాస్టీల్, హీరోమోటో కార్ప్, ఓఎన్‌జీసీ, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్‌లు 3.07 శా తం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మొ త్తానికి బుధవారం మార్కెట్లు లాభాలతో మొద లైనా.. గురువారం నుంచి అతి పెద్ద ఐటి కంపెనీల ఫలితాలు వెలువడనున్న కారణంగా ఇన్వెస్టర్లు కాస్తా జాగ్రత్తగా ఆచితూచి వ్యవహరించారని చెబుతున్నారు. అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చలు ఒక కొలిక్కి వస్తాయని విశ్లేషకులు అభిప్రా యపడుతున్నారు. అయితే ఇన్వెస్టర్లు ఎక్కువగా ప్రైవేట్ బ్యాంకు, ఐటీ, ఎఫ్‌ఎంసీజీ షేర్ల కొనుగో లుకు మొగ్గు చూపగా.. పీఎస్‌యు బ్యాంకు షేర్లపై లాభాల స్వీకరణకు పాల్పడ్డారని చెబుతున్నారు. బుధవారం మార్కెట్ పుంజుకోవడానికి మరో కారణం ప్రపంచ బ్యాంకు ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7.3 శాతం సాధిస్తుందని.. వచ్చే రెండు సంవత్సరాల కాలం పాటు 7.5 శాతం సాధించవచ్చునని తాజా నివేదికలో వెల్లడిం చింది. వృద్ధిరేటు పెరగడానికి ప్రధాన కారణం వినియోగం పెరగడంతో పాటు పెట్టుబడులు జోరందుకోవడమేనని ట్రేడర్లు చెబుతున్నారు. దీంతో పాటు ప్రపంచంలోనే శరవేగంగా అభి వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భారత్ అగ్ర స్థానంలో ఉందని ప్రపంచ బ్యాంకు తాజా నివే దికలో పేర్కొంది.

బీజేపీలో చేరిన తృణమూల్ ఎంపీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తృణ మూల్ కాంగ్రెస్ అధినేత్రి మమ తాబెనర్జీకి సొంత పార్టీ ఎంపీ షాకి చ్చారు. బిష్ణుపూర్ లోక్‌సభ స్థానానికి ప్రాతి నిధ్యం వహిస్తున్న 38 ఏళ్ల సౌమిత్ర ఖాన్ కాషాయపార్టీలో చేరారు. బుధ వారం ఢిల్లీలో అమిత్ షా సమక్షంలో ఖాన్ బీజేపీ కండువా కప్పుకున్నారు. 2017లో బీజేపీలో చేరిన తృణ మూల్ నేత ముకు ల్‌రాయ్‌తో కలిసి కేంద్రమంత్రి ధర్మేం ద్ర ప్రదాన్ ఖాన్ చేరికపై అధికారిక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మమ తా బెనర్జీపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో యు వకులు మార్పు కోరు కుంటు న్నా రని, మోడీపై విశ్వా సంతో ఉన్నా రని చెప్పా రు. పోలీ స్ రాజ్యం పోయి ప్రజా రాజ్యం రావా లని, అది బీజేపీ ద్వారా నే సాధ్య మవుతుందన్నారు. బీజేపీ రథ యా త్రకు ఈ పరి ణామం కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని భాజపా శ్రేణులు భావిస్తున్నారు.

సీబీఐ చీఫ్ అంశంపై కమిటీ భేటీ వాయిదా

న్యూఢిల్లీ: వివాదం నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ డైరెక్టర్‌గా తిరిగి విధుల్లో చేరిన అలోక్ వర్మపై నిర్ణయం తీసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, భారత ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలోని అతిపెద్ద ప్రతిపక్షపార్టీ నాయకుడు మల్లిఖార్జున్ ఖర్గేతో కూడిన ఉన్నతస్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరగాల్సిన సమావేశం వాయిదాపడింది. లోక్‌సభ వ్యవహారాల్లో నిమగ్నమైన కారణంగా సుప్రీంకోర్టు తీర్పును పూర్తి స్థాయిలో అధ్యయనం చేయలేకపోయానని, తీర్పును పూర్తి స్థాయిలో అర్థం చేసుకునేందుకు కొంత సమయం కావాలని, సమావేశాన్ని జనవరి 11న నిర్వహించాలని కోరుతూ ప్రభుత్వానికి మల్లిఖార్జున్ ఖర్గే లేఖ రాశారు. సుప్రీం తీర్పు, ఆదేశాలను పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతనే కాంగ్రెస్ పార్టీ సూచనను చేయగలనని ఆయన లేఖలో తెలిపారు. ఇదిలావుండగా వారం రోజుల్లోగా ఉన్నతస్థాయి ఎంపిక కమిటీ సమావేశం నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగోయ్ స్థానంలో జస్టిస్ ఏకే. సిక్రీ పాల్గొననున్నారని సమాచారం.

బాధ్యతలు స్వీకరించిన అలోక్ వర్మ

కేంద్రప్రభుత్వం ఒత్తిడి మేరకు గతేడాది అక్టోబర్ నెలలో సెలవుపై వెళ్లిన సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ దాదాపు 77 రోజుల తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాలతో బుధవారం తిరిగి విధుల్లో చేరారు.

రక్షణ మంత్రితో హాల్ సీఎండీ భేటీ

న్యూఢిల్లీ: రాఫెల్ ఒప్పంద వివాదం నేపథ్యంలో హాల్(హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్) సీఎండీ ఆర్.మాధవన్, త్రివిధ దళాధిపతులు ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్, ఎయిర్ ఫోర్స్ చీఫ్ మార్షల్ బీఎస్ ధనోవ్, నావీ చీఫ్ అడ్మిరల్ సునిల్ లంబా రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ను పార్లమెంట్ ఆవరణలో బుధవారం కలిశారు. విమానాలను తయారు చేసే ప్రభుత్వ సంస్థ హాల్ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ఆమెకు వివరించారు. సంస్థ కార్యాచరణకు అవసరమైన వ్యయాన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి తరచూ రుణం తీసుకోవాల్సివస్తోందని మంత్రికి వివరించారు. ఫ్రాన్స్‌తో జరిగిన రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంలో అవినీతి జరిగిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పదేపదే ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో రక్షణ శాఖ మంత్రితో త్రివిధ దళాధిపతుల సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

జగన్నాథ ఆలయ న్యాయసలహాదారుగా రంజిత్ కుమార్


న్యూఢిల్లీ: ఒడిశాలోని పూరీ జగన్నాథ ఆలయ నిర్వహణ కార్యాకలాపాల్లో సహాయంగా ఉండేందుకు న్యాయసలహాదారుడిగా సీనియర్ న్యాయవాది, మాజీ సొలిసిటర్ జనరల్ రంజిత్ కుమార్‌ను సుప్రీంకోర్టు నియమించింది. తనను రిలీవ్ చేయాలంటూ గతేడాది నవంబర్ 30న జస్టిస్ ఏకే సిక్రీ బెంచ్‌ను సీనియర్ న్యాయవాది, ఆలయ న్యాయసలహాదారు గోపాల్ సుబ్రమణియం విజ్ఞప్తిని ఆమోదించిన బెంచ్ రంజిత్ కుమార్ అంగీకారంతో నూతన సలహాదారుడిగా నియమించింది. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచనలు చేసింది. ఆలయ వ్యవహారాల్లో కలగజేసుకోవాలని, ఆలయ వ్యవహారాల గురించి తెలిసిన వ్యక్తికి ఈ బాధ్యతలు అప్పగించాలని ఓ న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఇదిలావుండగా నమ్మకంతో నిమిత్తం లేకుండా ఆలయానికి వచ్చే ప్రతివ్యక్తిని ఆలయ ప్రవేశానికి అనుమతించాలని గతేడాది జూలై నెలలో ఆలయ నిర్వహణ యాజమాన్యాన్ని కోరిన సంగతి తెలిసిందే.

బీజేపీని పాతిపెడతాం

అమిత్ షా వ్యాఖ్యలకు శివసేన కౌంటర్

ఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న వేళ బీజేపీ శివసేన మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. లోక్ సభ ఎన్నికల నాటికి తమతో పొత్తుకు సంబంధించి ఎటువంటి నిర్ణయం ఫైనల్ చేయకపోతే బీజేపీ మాజీ భాగస్వామ్య పార్టీలను ఓడిస్తామని అమిత్ షా ఇటీవల చేసిన వ్యాఖ్యలకు అంతే ఘాటుగా సీనియర్ శివసేన నేత రామ్ దాస్ కడమ్ సమాధానమిచ్చారు. బీజేపీని భూమిలో పాతి పెడతామని కడమ్ హెచ్చరించారు. 2014 మహరాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో మోడీ హవాను తట్టుకొని 63 అసెంబ్లీ స్థానాల్లో శివసేన గెలిచిందని కడమ్ తెలిపారు. ఇటీవలే ఐదు రాష్ట్రా ల్లో ఓడిపోయిన బీజేపీ మహారాష్ట్ర వచ్చి తమని భయపెట్టవద్దని, బీజేపీని భూమిలో పాతి పెడతామని కడమ్ అన్నారు.

మహాకూటమిలో మేం చేరం



భువనేశ్వర్: బీజేపీకి వ్యతిరేకంగా విపక్ష నేతలు ప్రయత్నిస్తున్న మహాకూటమిలో బీజేడీ చేరబోదని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడిన ఆయన బీజేడీ విధానం ప్రకారం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో జతకట్టబోమన్నారు. మహాకూటమి నేతలు పరిగణిస్తున్నట్టు మహాకూ టమిలో బీజేడీ భాగస్వామి కాదని అన్నారు. నవీన్ పట్నాయక్ ప్రకటనపై ఒడిశా బీజేపీ అధ్యక్షుడు బసంత్ పండా విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్‌తో బీజేడీకి లోపాయికారి ఒప్పందం కుదరిందని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఈ ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. మహాకూటమిలో చేరే విషయమై ఆలోచించేందుకు కొంత సమయంలో కావాలని అడిగిన మరుసటి రోజే నవీన్ పట్నాయక్ తన నిర్ణయాన్ని వెల్లడించడం గమనార్హం.

దబాంగ్ నుంచి అవినీతి దాకా..

ఐఏఎస్ ఆఫీసర్ చంద్రకళ ప్రస్థానం



లక్నో: కొన్ని రోజుల క్రితం వరకూ దబాంగ్(భయంలేని) ఆఫీసర్ అంటూ సోషల్ మీడియాలో అక్రమ మైనింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధి కారిణి భుక్యా చంద్రలేఖ (38) ఫొటోలు సర్కు ల్యేట్ అయ్యేవి. ఆకస్మిక తనిఖీలు చేసి అవినీతి అధికారుల భరతం పట్టే ఆమె 2012-16 మధ్య కాలంలో జరిగిన అక్రమ మైనింగ్ స్కామ్ లో భాగంగా ఉందంటూ ఆరోపణలు ఉన్నాయి. బులంద్‌శహర్ డీఎంగా పనిచేస్తున్న సమయంలో అవినీతిపరులకు నిద్ర లేకుండా చేసి ఆమె భయం లేని అధికారిణిగా పేరు సంపాదించుకొంది. ఒకరోజు తన అనుమతి లేకుండా ఓ బాలుడు సెల్ఫీ తీశాడని ఆ బాలుడిని ఆమె పోలీసులకు పట్టించింది. ఈ విషయంపై ఓ మీడియా వ్యక్తి ప్రశ్నించగా ఆమె అభ్యంతరకర పదజాలంతో అతడిని తిట్టింది. దీంతో కొన్ని నెలలపాటు ఓ వర్గం మీడియాకు ఆమెకు మధ్య మాటల యుద్ధం నడిచింది. మీరట్ డీఎంగా ఆమె బదిలీ అవడంతో వివాదం సద్దుమణిగింది. తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాకు చెందిన చంద్రకళ మూడేళ్ల క్రితం భర్త రాములు నాయక్ నుంచి విడిపోయి విడాకులకు దరఖాస్తు చేసుకొంది. అక్రమమైనింగ్ కేసులో చంద్రకళతోపాటు యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కు కూడా భాగస్వామ్యం ఉందంటూ ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసుని సీబీఐ విచారిస్తోంది. అయితే ఇదంతా రాజకీయ కుట్రేనని, సీబీఐ దాడులకు తాము భయపడబోయని అఖిలేష్ తెలిపారు

మిచెల్‌తో మీకు లింకేంటి.?



- కాపాలాదారు చర్యలతో వారికి నిద్రలేని రాత్రులు
- యూపీఏ రాఫెల్ ఒప్పందంలోనూ మిచెల్ పాత్ర
- గిట్టుబాటు కాకపోవడంతోనే వెనక్కి
- మాపై అబద్ధాల ప్రచారానికి రిజర్వేషన్ల బిల్లే సమాధానం
- షోలాపూర్ బీజేపీ ర్యాలీలో కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ విమర్శలు

షోలాపూర్: 2019 లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య రోజురోజుకూ మాటలయుద్ధం ముదురుతోంది. రక్షణ శాఖ ఒప్పందాలే ప్రధాన అస్త్రంగా రెండు పార్టీల నాయకులు అవా కులు..చవాకులు విసురు కుంటున్నారు. రాఫెల్ యుద్ధ విమానాల కొను గోళ్లలో భారీ అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ మోడీ ప్రభు త్వాన్ని ఇరుకునపెట్టే ప్రయత్నం చేస్తుండగా.. అగస్టా వీవీఐపీ హెలికాప్టర్ల వ్యవహారంతో బీజేపీ కాంగ్రెస్‌కు కౌంటర్ ఎటాక్ ఇస్తోం ది .కాం గ్రెస్ నుంచి ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ విమర్శలు సంధిస్తుండగా.. బీజేపీ తరపున ప్రధాని మోడీ కాంగ్రెస్‌ను టార్గె ట్ చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి మూడు నెలల ముందు నుంచే శ్రీకారం చుట్టిన మోడీ.. రాహుల్ అగస్టా, రాఫెల్ వ్యవహారాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా వాడు కుంటు న్నారు. మొత్తంగా యుద్ధవిమానం వర్సెస్ ..వీవీ ఐపీ హెలి కాప్టర్ అన్నట్లుగా కాంగ్రెస్,బీజేపీల మధ్య వార్ నడుస్తోంది.

అగస్టా వెస్ట్‌లాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోలు వ్యవహారంలో మధ్యవర్తిగా ఉన్న మిచెల్ క్రిస్టియన్‌ను ఇటీవలే సీబీఐ అరెస్ట్ చేయడంతో బీజేపీ స్వరంగా పెంచింది. మిచెల్ నోట మిసెస్ గాంధీ అంటూ ఓ మాట బయటకు రావడంతో విమర్శలకు పదును పెంచింది. ప్రధాని మోడీ ఎక్కడ పర్యటించినా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ మిచెల్ మామ.. కాంగ్రెస్‌తో మీకు లింకేంటి అంటూ చలోక్తులు విసురుతున్నారు. దేశానికి కాపాలాదారు లేకుంటే ఏం చేసే వారో చెప్పాలి అంటూ ప్రశ్నలు సంధించారు.మహారాష్ట్రలోని షోలాపూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మోడీ.. కాంగ్రెస్‌పై విమర్శల దాడి పెంచేశారు. దేశ కాపా లాదారుడు తమనేం చేసాడోనని కమీషన్ రాయుళ్లు.. వాళ్లకు సహకరించిన పార్టీల నాయకులు నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారన్న మోడీ.. తమపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ క్లీన్ అప్ మిషన్ కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు. క్రిస్టి యన్ మిచెల్ మధ్యవర్తిత్వంతోనే యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్పుడు 126 రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలుకు ఒప్పందం చేసుకోవాలనుకున్నారని మోడీ ఆరోపించారు. రాహుల్ గాంధీ పదే పదే తనను టార్గెట్ చేస్తున్నారని ప్రస్తావిస్తూ.... దేశ కాపాలాదారు(మోడీ)కు మీరు మద్దతిస్తారా.. అని షోలాపూర్ ప్రజలను అడగ్గా.. భారీ సంఖ్య సభకు హాజరైన జనం మద్దతిస్తాం అని బదులిచ్చారు.

సమన్యాయం కోసమే 10 శాతం కోటా

జనరల్ కేటగిరిలోని పేదలకు విద్య, ఉద్యోగ అవకాశాల కోసమే 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం సంకల్పించిందని మోడీ తెలియజేశారు. మంగళవారం లోక్‌సభలో రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదముద్ర పడటాన్ని గుర్తు చేస్తూ సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలన్నదే ప్రభుత్వ ఉద్ధశమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంపై అబద్దాలు ప్రచారం చేస్తున్న వారికి రిజర్వేషన్ల బిల్లు బలమైన సమాధానమని మోడీ చెప్పుకొచ్చారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి చేయూతనిచ్చేందుకే చారిత్రక బిల్లును పార్లమెంట్‌లో పెట్టామని మోడీ తెలిపారు. గత నాలుగేళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమాలను వివరించిన ప్రధాని...2014లో 91 వేలుగా ఉన్న జాతీయ రహదారులను నాలుగున్నరేళ్లలో 1.30 లక్షల కోట్లకు పెంచగలిగామన్నారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా సోలాపూర్ - ఉస్మానాబాద్ మధ్య నిర్మించిన ఎన్‌హెచ్ 211 ను ప్రధాని ప్రారంభించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించనున్న 30 వేల ఇళ్లకు, మూడు అండర్ గ్రౌండ్ మురుగునీటి వ్యవస్థలకు మోడీ శంకుస్థాపన చేశారు.

నన్ను ఎదుర్కొనేందుకు అందరూ ఏకమయ్యారు

రక్షణ మంత్రిపై రాహుల్ వ్యాఖ్యలు గర్హనీయం




ఆగ్రా: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాని మోడీ దూసుడు పెంచారు. ఓవైపు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూనే ప్రతిపక్షాలను ఏకిపారేస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని ఆగ్రాలో పర్యటిం చిన ప్రధాని.. సమాజ్ వాదీ, బహుజన సమాజ్ వాదీ పార్టీలపై విరుచుకుపడ్డారు. గతంలో ఒకరినొకరు ప్రత్యక్షంగా చూసేందుకు ఇష్టపడని వైరివర్గాలు బీజేపీని ఎదుర్కొనేందుకు చెట్టాపట్టాలేసుకుని తిరు గుతు న్నాయని విమర్శించారు. రాహుల్ గాంధీకి మహిళలంటే గౌరవం లేదన్న మోడీ... రక్షణశాఖ మంత్రిపై రాహుల్ వ్యాఖ్యలను ఖండించారు. రాహుల్ వ్యాఖ్యలు దేశంలోని స్త్రీ శక్తిని అవమానించేలా ఉన్నా యని మోడీ పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన చర్యలు దేశ భవిష్యత్‌కు ఎంతో కీలకమైనవని.. ఏ వర్గాన్ని నష్టపరిచేవి కావని మోడీ చెప్పుకొచ్చారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకొచ్చిన బిల్లు లక్ష్యం అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నదేనని అన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా పేదల ప్రజల వైద్య సేవలకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయన్న ప్రధాని.. ఈ పథకం ప్రారంభించిన 100 రోజుల్లోనే 7 లక్షల మంది పేదలకు లబ్ది జరిగిందని గుర్తు చేశారు.

స్వచ్ఛమైన నీటి కోసం గంగాజల్ ప్రాజెక్టు

ఆగ్రా పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ రూ.2980 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఆగ్రా ప్రజల నీటి కటకటను తీర్చే గంగాజల్ ప్రాజెక్టును ప్రారంభించిన మోడీ..ఆగ్రా స్మార్ట్ సిటీ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఆగ్రాను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు స్మార్ట్ సిటీ ప్రాజెక్టును చేపట్టా రు.గంగాజల్ ప్రాజెక్టు ఆగ్రా ప్రజలకు శుద్ధమైన నీరు అందిం చడంతో పాటు పర్యటకుల నీటి దాహాన్ని తీరుస్తుందని మోడీ పేర్కొన్నారు.

మోడీ డిఫెన్స్‌లో పడ్డారు

- యువత సిక్సర్లతో గుణపాఠం చెప్పాలి
- అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానికి రైతులు తడాఖా చూపారు
- రాఫెల్ చర్చ నుంచి చౌకీదార్ పారిపోయారు
- పార్లమెంట్‌లో ఒక్క నిమిషమైనా నిలబడలేదు
- రాజస్థాన్ రైతుల బహిరంగసభలో రాహుల్ విమర్శలు



జైపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శలను తీవ్రంచేశారు. బుధవారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో నిర్వహించిన రైతుల బహిరంగసభ ద్వారా లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన మోడీని టార్గెట్ చేశారు. నాలుగున్నరేళ్లలో వ్యవసాయ సంక్షోభాన్ని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇందుకు రైతులు సరైన జవాబిచ్చారు. తమ సత్తా ఏంటో ప్రధానికి చాటిచెప్పారని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని రాష్ట్రాల్లో రైతు రుణమాఫీని అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించడంలో రుణమాఫీ చిన్న ప్రయత్నమేనన్న ఆయన, సమస్య పరిష్కారానికి సరికొత్త హరిత విప్లవం రావాల్సిన అవసరం ఉందన్నారు. పంట క్షేత్రాలకు సమీపంలో ఆహారశుద్ధి పరిశ్రమలను ఏర్పాటు చేసి నిజమైన హరిత విప్లవం సాధిస్తామని హామీ ఇచ్చారు. మీకు మా మన్‌కీబాత్ అవసరం లేదు.. మీ మన్‌కీ బాత్ వినేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. ముఖ్యమంత్రి గెహ్లాట్, ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్‌కు మీ సమస్యలు వివరించండి.. పరిష్కారం కోరండి అని రాజస్థాన్ ప్రజలకు ఈ సందర్భంగా రాహుల్ పిలుపునిచ్చారు.

పెద్దలకే బీజేపీ రుణమాఫీ

హామీల అమలు విషయంలోనూ, ఉపాధి, ఉద్యోగాల కల్పనలో దారుణంగా విఫలమైన మోడీ ప్రభుత్వం, తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. పెద్దనోట్ల రద్దు చర్య చిరు వ్యాపారులను దెబ్బతీసిందని మండిపడ్డారు. కొంతమంది పెద్దలకు రుణాలు మాఫీచేసిన మోడీ ప్రభుత్వం, ఎంతమంది యువ పారిశ్రామిక వేత్తలకు మేలుచేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీతో ప్రజలకు సమస్యలు తెచ్చిపెట్టారు. మోడీ బ్యాక్‌పుట్ ఆడే ప్రయత్నం చేస్తున్నారని, దేశ యువత ఫ్రంట్‌పుట్‌కు (ముందుకు) వచ్చి సిక్సర్లతో దీటైన జవాబివ్వాలని ఈ ర్యాలీద్వారా ప్రజలకు రాహుల్ పిలుపునిచ్చారు. ఈ దేశానికి ప్రధానిగా మోడీ ఏం చేశారని సీఎం గెహ్లాట్ ప్రశ్నించారు.

మోడీ పారిపోయారు..

రాఫెల్ డీల్ అవినీతిపై చర్చకు రాకుండా ప్రధాని పారిపోయారని ఎద్దేవా చేశారు. పార్లమెంటులో దీనిపై ఇంత వివాదం జరుగుతుంటే, దేశానికి చౌకీదార్‌గా చెప్పుకునే వ్యక్తి ఒక్క నిముషం కూడా చట్టసభలో నిలబడలేదని ధ్వజమెత్తారు. రక్షణమంత్రి సైతం 150 నిముషాల సుదీర్ఘ ప్రసంగం చేశారు కానీ, సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. రాఫెల్ ఒప్పందం అంశాన్ని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ప్రభుత్వం పెడచెవిన పెట్టడం ప్రజాస్వామ్యానికి చేటని చెప్పారు. తనకు 56 అంగుళాల ఛాతీ ఉందన్న ప్రధాని, జెట్‌ఫైటర్ల కుంభకోణంలో తనను తాను రక్షించుకునేందుకు ఓ మహిళను ముందుకు తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు.

బీజేపీ వైఖరి ప్రమాదకరం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: కుల ఆధారిత రిజర్వేషన్లకు ముగింపు పలకడమే బీజేపీ వ్యూహమని, ఇలాంటి చర్యలు అత్యంత ప్రమాదకరమని ఆమ్ ఆద్మీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. తాను మాట్లాడినవారిలో అనేకమంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ట్వీట్ చేశారు. విద్య, ఉద్యోగ ఆశావహుల్లోని పేద వారికి కేవలం సహాయం చేయడమే బీజేపీ లక్ష్యం కాదని, కుల ఆధారిత రిజర్వేషన్లకు ముగింపు పలకాలనే వ్యూహమని ఆయన వ్యాఖ్యానించారు. ఇదిలావుండగా ఆర్థిక బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై సాను కూలంగా స్పందించి స్వాగతించిన వ్యక్తుల్లో కేజ్రీవాల్ ఒకరన్న సంగతి తెలిసిందే.

మంచు వలయంలో.. నీటి కష్టాలు




శ్రీనగర్: చుట్టూ కనుచూపు మేరలో మంచు ముద్దలు.. అయినా గుక్కెడు నీటి కోసం కాశ్మీరీల పాట్లు.

మహిళా కమిషన్ సీరియస్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి జాతీయ మహిళా కమిషన్ షాకిచ్చింది. రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను అవమానించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులివ్వనున్నట్లు స్పష్టం చేసింది. బుధవారం రాజస్థాన్‌లోని జైపూర్ రైతు ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ... సీతారామన్ జీ రక్షించండి.. రాఫెల్ వ్యవహారంలో నన్ను నేను రక్షించుకోలేకపోతున్నాను. రక్షించండి.. అని మోడీ నిర్మలా సీతారామన్‌ను కోరారని రాహుల్ విమర్శించారు. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు వ్యవహారంపై లోక్‌సభలో చర్చ సందర్భంగా ప్రధాని మోడీ హాజరుకాకుండా రక్షణ మంత్రితో మాట్లాడించారని పరోక్ష విమర్శలు గుప్పించారు. రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్‌సిడబ్ల్యూ ఛైర్మన్ రేఖా శర్మ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ రాహుల్ గాంధీకి గురువారం నోటీసులు పంపిస్తాం. నిర్మలా సీతారామన్‌పై రాహుల్ వ్యాఖ్యలు ఏ కారణాలతో చేశారో చెప్పాలి. మహిళా వ్యతిరేక భావాలను వ్యక్తం చేస్తున్న రాహుల్ ఏం చెపదలచుకున్నారు. మహిళలంటే అంత బలహీనులని రాహుల్ అనుకుంటున్నారా.. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రక్షణమంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ బలహీనురాలని ఆయన ఉద్దేశమా..? అని ప్రశ్నించారు.

తాలిబన్లతో చర్చలకు షరతులొద్దు




న్యూఢిల్లీ: ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతి, సుస్థిరతస్థాపన లక్ష్యంగా తాలిబన్లతో చర్చలకు ఎలాంటి ముందస్తు షరతులు విధించొద్దని భారత ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ అభి ప్రాయ పడ్డారు. ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తాలిబన్లను శాంతి చర్చల వేదికమీదకు తెచ్చేందుకు పాకిస్తాన్, అమెరికా, రష్యా, ఇరాన్, యూఏఈ ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో రావత్ ఈ మేరకు సూచన చేశారు. కాబూల్, ఇండియా ప్రభుత్వాలతో సంప్రదింపులకు తాలిబన్లు తిరస్కరించిన క్రమంలో, అగ్రదేశాలతోపాటు పొరుగుదేశాలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. పాక్ ప్రభావిత మిలిటెంట్ల వ్యవహారాన్ని భారత్ నిశితంగా పరిశీలిస్తోంది. ఆఫ్ఘన్‌లో సుస్థిరత ఇండియా, పాక్‌తోపాటు ఆసియా ఉప ఖండానికి మేలుచేస్తుందని రావత్ చెప్పారు. తీవ్రవాద నిర్మూలన, రైసినా ఒప్పందం అంశంపై జరిగిన కార్యక్రమంలో రావత్ మాట్లాడుతూ, తప్పుడు ప్రచారంతో జమ్ము, కాశ్మీర్‌లో సంఘవిద్రోహ శక్తులను ప్రేరేపించాలన్న ఇస్లామిక్‌దేశం కుట్రలను ఇక్కడి ముస్లింలు తిప్పికొట్టారని గుర్తుచేశారు. కుటుంబ విలువలు, భద్రతా సంస్థల జాగురూకత కారణంగా వారి ఆటలు సాగలేదన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌ను తమ తోకగా పాకిస్థాన్ భావిస్తోందని, అక్కడ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండాలనే కోరుకుంటోందని చెప్పారు. ఇప్పటికైనా ముష్కర తాలిబన్లతో చర్చించే అవకాశం ఎవరికైనా ఉందంటే అది పాకిస్తాన్‌కేనని చెప్పారు.

కాగా, అమెరికాలో పాక్ మాజీ రాయబారి హుస్సేన్ హక్కాని మాట్లాడుతూ, మానసికంగా తాలిబన్లది పైచేయిగా ఉందన్నారు. ప్రధాన సమస్యలపై అమెరికా ఎప్పుడూ దృష్టిసారించలేదు. మిలిటెంట్ల సురక్షిత స్థావరాలను పట్టించుకోలేదని విమర్శించారు. అమెరికా బలగాలు వెనక్కి మళ్లినందున, తాలిబన్లు వారి ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని కోరారు. ఈ అంశంలో తమ వంతు సహకారానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ ప్రకటించింది. అవసరమైతే తాలిబన్లకు భారత్‌కు మధ్య వారధిగా ఉంటామని తెలిపింది.

ముస్లింలపై వివక్షకు నిరసనగా కాశ్మీరీ ఐఏఎస్ రాజీనామా

సిమ్లా: జమ్ము-కాశ్మీర్‌లోని ముస్లిం వర్గంపై హిందుత్వ శక్తులు చూపిస్తున్న వివక్ష, ముస్లింల హత్యలకు నిరసనగా కాశ్మీర్‌కు చెందిన షా ఫసల్ అనే ఐఏఎస్ అధికారి తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. దేశంలోని ముస్లింలను ద్వితియ శ్రేణి పౌరులుగా పరిగణిస్తున్నారని ఆయన నిరసన వ్యక్తం చేశారు. హత్యలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సరైన రాజకీయ చర్య తీసుకోకపోవడంతో తాను రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ట్విట్టర్ వేదికగా తన నిర్ణయాన్ని వెలువరించిన ఆయన శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించనున్నానని వెల్లడించారు.

ఇదిలావుండగా ఉద్యోగంలో సాధించలేనిది, రాజకీయాల్లో సాధించవచ్చునని జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాహ్ వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో చేరాలనుకుంటున్న ఫైసల్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని అన్నారు. నేషనల్ కాన్ఫిరెన్స్ పార్టీలో చేరి బారాముల్లా నుంచి లోక్‌సభ బరిలో నిలవాలని ఫైసల్ భావిస్తున్నారని సమాచారం. 2010 సివిల్స్ పరీక్షలో అర్హత సాధించిన ఫైసల్‌కు సొంత రాష్ట్రంలోనే సర్వీస్ దక్కింది.



మా ఊరు - మా రాజ్యం

30 పంచాయతీల్లో.. నో ఎలక్షన్!

- అధికారుల నిర్వాకం ఫలితం
- ఓటర్లు లేకపోయినా ఎస్టీలకు రిజర్వు
- అభ్యర్థులు లేక ఎన్నికకు ఆటంకం
- పోలింగ్ నిర్వహించాలంటున్న గ్రామస్థులు
- ప్రత్యేక అధికారుల పాలనే శరణ్యం..?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అధికారులు చేసిన తప్పిదాలు, అసంబద్ధ నిర్ణయాల వల్ల రాష్ట్రంలో 30కి పైగా గ్రామ పంచాయతీలు ఎన్నికలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎస్టీలకు రిజర్వు చేసిన పంచాయతీలలో ఆ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు లేకపోవడంతో ఆ గ్రామ పంచా యతీలో ఎన్నికలను రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం పొరుగు గ్రామాల నుంచి ఈ సామాజిక వర్గానికి చెందిన వారిని తీసుకువచ్చినా ఎన్నికల్లో నిలబెడదామంటే వారికి స్థానికంగా ఓటు హక్కు లేకపోవడం ఇబ్బందులకు గురి చేస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్‌లు వెలు వడి తొలి విడత ఎన్నికలు జరిగే పంచాయతీలకు నామి నేషన్ల గడువు బుధవారంతో ముగిసిన సంగతి తెలిసిందే. జనాభా లెక్కలలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది చేసిన నిర్వాకం వల్ల చాలా పంచాయతీల్లో ఎన్నికలు జరిగేలా కనిపిం చడం లేదు. రిజర్వేషన్ల ప్రక్రియ పంచాయతీల్లో కొత్త చిక్కులు తెచ్చి పెడు తుండగా ఓటర్ల మధ్య వైషమ్యాలను, గొడవలకు దారి తీస్తున్నాయి. రిజర్వుడ్ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆయా సామా జి క వర్గాలకు చెందిన అభ్యర్థులు లేక ఎన్నికలే నిర్వహిం చలేని పరిస్థితేర్పడింది. ఆసిఫాబాద్ జిల్లా రహపల్లి గ్రామ పంచాయతీలో ఈ విడత ఎన్నికలు జరిగే అవకాశం లేదని తెలు స్తోంది.

కొత్త పంచాయతీలతో తంటా

ఈ గ్రామ పంచాయతీని అధికారులు 1996 నుంచి ఎస్టీ అభ్యర్థులకు రిజర్వు చేస్తూ వస్తున్నారు. అయితే, ఈ గ్రామ పంచాయతీ పరిధిలోని నందూకా గ్రామానికి చెందిన ఏకైక ఎస్టీకుటుంబం కమ్మరి వీరయ్య నివాసముంటున్నారు. రెండు దశాబ్దాలుగా ఈ కుటుంబానికి చెందిన వారే సర్పంచ్‌గా ఎన్నికవుతూ వస్తున్నారు. ఇటీవల కొత్త గ్రామ పంచాయతీలను ప్రకటించిన ప్రభుత్వం రహపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోకి చోరపల్లిని నూతన పంచాయతీగా ప్రకటిం చింది. దీంతో నందూకా గ్రామం చోరపల్లి పంచా యతీ పరిధిలోకి వెళ్లిం ది. పంచాయతీ రిజర్వేషన్లలో భాగం గా ఈ గ్రామ పంచాయతీని ఎస్టీ మహిళకు కేటా యించారు. రహపల్లిలో ఒక ఎస్టీ కుటుంబం కూడా లేక పోవడంతో ఈ గ్రామంలో పంచాయతీ ఎన్నికలు నిర్వ హించలేమని అధికారులు చేతు లెత్తేశారు. కానీ, గ్రామస్థులు మాత్రం ఎలాగైనా సరే రిజర్వేషన్ మార్చి తమ గ్రామంలో ఎన్నికలు నిర్వహిం చాల్సిందేనని అధికారులపై ఒత్తిడి తెస్తున్నా ప్రయోజ నం కని పిం చ డం లేదు. గతంలో ఈ గ్రామ పంచాయతీ పరిధిలో మూడు ఆ వాసాలు ఉం డే వని, చోరప ల్లి, నందూకా, కొత్తరాపల్లిలలో ఒక ఎస్టీకుటుంబం ఉండేదని, గత 30 ఏళ్లుగా రిజ ర్వేషన్‌ను కొనసాగి స్తుండ టంతో ఎస్టీ అభ్యర్థులే ఈ గ్రామానికి సర్పంచ్‌గా పని చేస్తూ వస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ గ్రామంలో 717 మంది బీసీ జనాభా, 187 మంది దళిత కుటుంబాలకు చెందిన ఓటర్లు ఉన్నారని, 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ గ్రామంలో బీసీల జనాభా అధికంగానే ఉన్నా ఎస్టీకి రిజర్వు చేస్తూ వచ్చారని వారన్నారు. జనాభా లెక్కలు నిర్వహించిన అధికారులు బీసీ రిజర్వుడ్‌కు బదులు ఎస్టీకి రిజర్వు చేస్తూ నిర్ణ యం తీసుకోవడంతో పరిస్థితి ఇంతవరకూ వచ్చిందని, ఇందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. జనాభా లేని ఎస్టీ సామాజిక వర్గానికి గ్రామ పంచాయతీని రిజర్వ్ చేయడంతో ఎన్నిక జరిగే అవకాశం లేదని, దీంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలన పెట్టక తప్పదని భావిస్తున్నారు. దీనిపై తాము న్యాయస్థానంను ఆశ్రయించి తమపంచా యతీకి ఎన్నిక జరిగేలా ఒత్తిడి తెస్తామని గ్రామస్థులు చెబుతున్నారు.

నైనాల గ్రామ కథ వేరు!

ఇదిలా ఉండగా, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నైనాల గ్రామం పంచాయతీ ఎన్నికల్లో ఎస్టీకి రిజర్వు చేశారు. అయితే ఈ గ్రామంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఓటరు ఒక్కరు కూడా లేకపోవడంతో కేవలం వార్డు సభ్యుల ఎన్నికలను నిర్వహించారు. ఉప సర్పంచ్ మూడేళ్ల పాటు సర్పంచ్‌గా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి గతంలో ఏర్పడింది. ఆ తర్వాత యానాది సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో ప్రభుత్వం చేర్చడంతో గ్రామస్థులంతా తమ గ్రామంలోని యానాది సామాజిక వర్గానికి చెందిన ఆకుల సాయిలుని 2017 మార్చి మాసంలో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సదరు సర్పంచ్ పదవీ కాలం 2018 జులై మాసంలో ముగియడంతో తన పదవీ కాలం ఐదేళ్లని, తనను పూర్తి కాలం సర్పంచ్‌గా కొనసాగించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సాయిలుకి అనుకూలంగా తీర్పు వెలువడటంతో ఆయన మిగిలిన పదవీ కాలాన్ని పూర్తి చేసేవరకూ ఆ పదవిలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం పంచాయతీరాజ్ శాఖతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీంతో ఈ గ్రామంలో అధికారులు ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్‌ను జారీ చేయ లేదు. ఈ తరుణంలో సర్పంచ్‌గా కొనసాగుతున్న సాయిలు అధికారుల దగ్గరికి వెళ్లి సర్పంచ్‌గా పనిచేయడానికి తన ఆరోగ్యం సహకరించడం లేదని.. మిగిలిన కాలం ఈ పదవిలో కొనసాగలేనని గ్రామ పంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక తిరిగి నోటిఫికేషన్ ఇవ్వలేమని, ప్రత్యేకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు చెప్పినట్లు తెలుస్తోంది. గ్రామస్థులు మాత్రం తమ గ్రామ పంచాయతీని బీసీ మహిళకు కేటాయించి ఎన్నికలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి కోరినట్లు సమాచారం. రాష్ట్రంలో ఇలా ఎస్టీకి రిజర్వ్ చేసిన 30కి పైగా గ్రామ పంచాయతీలలో ఆ సామాజిక వర్గానికి చెందినవారే లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు కూడా చేసేదేమీ లేక ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

3 నిమిషాలు ఆలస్యం...

ఛాన్స్ మిస్

- గడువు ముగిసిందంటూ నామినేషన్ స్వీకరించని అధికారి
- సర్పంచ్ అభ్యర్థి ఆగ్రహం.. వాగ్వాదం... వంగూరులో ఉద్రిక్తత




వంగూరు, ప్రభన్యూస్ : రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పంచాయతీ ఎన్నికల్లో భాగంగా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో మొదటి విడతగా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నామినేషన్ వేసేందుకు బుధవారం సాయంత్రం 5 గంటలతో గడువు ముగిసింది. దీంతో అత్యధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. వంగూరు పంచాయతీలో కూడా సర్పంచ్, వార్డు మెంబర్లుగా పోటీ చేసేందుకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయదలచుకున్న రజియాబేగం చివరి నిమిషంలో అవకాశం కోల్పోయారు. గడవుకన్నా 3 నిమిషాలు ఆలస్యంగా ఆమె రావడంతో నామినేషన్ తీసుకునేందుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ససేమిరా అనడంతో ఆమె మంచి అవకాశం కోల్పోయినట్టయింది. అన్ని ధ్రువపత్రాలతో వంగూరు మండల కేంద్రంలోని రిటర్నింగ్ అధికారుల వద్దకు మద్దతుదారులతో కలిసి రజియా వచ్చారు. అప్పటికి సరిగ్గా సమయం 5 గంటల మూడు నిమి షాలైంది. నిబంధనల ప్రకారం 5 గంటలకు నామినేషన్లు స్వీకరించడం నిలిపి వేసిన అధికారులు, ఇతర పనులు చక్కదిద్దుకునే పనిలో నిమగ్న మ య్యారు. అయితే సమయం మించిపోయిందని అధికారులు చెప్పడంతో అవాక్కైన రజియాబేగం తన నామినేషన్‌ను స్వీకరించాలని పదేపదే అడిగింది. అయితే రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన విజయభాస్కర్‌రెడ్డి తాము నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్నామని, 3 నిమిషాలు ఆలస్యంగా రావడంతో నామినేషన్ స్వీకరించడం జరుగని పని అని తేల్చి చెప్పారు. దీంతో కొద్ది సేపు వంగూరులో నామినేషన్లు స్వీకరించే స్థలంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రిటర్నింగ్ అధికారితో రజియాబేగం తీవ్ర వాగ్వాదానికి దిగింది. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో ఆమె వెనుదిరిగింది.

రాములోరికి మాఘ కల్యాణం!

- భద్రాద్రి రామునికి విశిష్ట సేవలు అవసరం
- అరవైఏళ్లకోసారి వచ్చే అవకాశం ఇదే



భద్రాచలం, ప్రభన్యూస్ : విళంబి నామ సంవత్సరంలో రాములోరి కళ్యాణం ముచ్చ టగా మూడుసార్లు చేసుకునే అవకాశం ఉందని ధర్మ శాస్త్రా లు తెలుపుతున్నాయి. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ నవమి నాడు అభిజిత్ నక్షత్రంలో స్వామివారి కళ్యాణం చేపట్ట డం ప్రతి చోటా ఆనవాయితీ. దక్షిణ దేశంలో కొన్ని ప్రాంతాల్లో వైష్ణవులు వైశాఖంలో సైతం కళ్యాణం నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా విళంబినామ సంవత్సరంలో వచ్చే మాఘ పునర్వసుకు సైతం అంతే విశిష్టత ఉంది. 2018 మార్చి 18న విళంభినామ సంవత్సరం ప్రారంభం కాగా, వచ్చే ఫిబ్రవరి 17న చాంద్రమాన విళంభినామ సంవత్సరం మాఘ శుద్ధ పునర్వసు నక్షత్రంలో రాముడికి కళ్యాణం చేసినట్లయితే అంతా శుభం జరుగుతుందని పెద్దలు చెబుతున్నారు. భద్రాచలంలోని సంస్కృత పండితులు గుదిమెళ్ళ శ్రీమన్నారాయణాచార్యులు సైతం ఈ విషయాన్ని ప్రస్ఫుటం చేశారు. ఈ విషయమై ఆయన గత కొంత కాలంగా అనేక మంది శాస్త్ర ఉద్దండులకు, పీఠాధిపతులకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఆయన విజ్ఞాపనలను అందించారు. ప్రతి సంవత్సరం, ప్రతి మాసంలో పునర్వసు వస్తుంది. అయితే శ్రీరాముడు అవతరించిన విళంభినామ సంవత్సరంలో ఆయన జన్మించడంతో ఈ సంవత్సరానికి ఆ ప్రత్యేకత సంతరించుకుంది. ఇదిలా ఉండగా 60 సంవత్సరాలకు ఒకమారు వచ్చే శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమాన్ని దేవాలయ అధికారులు పుష్కర పట్టాభిషేకంగా మార్చారు. కాల క్రమేణా పుష్కర పట్టాభిషేకం కాస్తా...ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగా మారింది. పట్టాభిషేక పూజలకు ఉన్న ప్రాచుర్యాన్ని బట్టి 60 సంవత్సరాల సమయాన్ని సంవత్సరానికి మార్చడం హర్షించదగినదే. అదే విధంగా శాస్త్రాలలో చెప్పిన విధంగా ఇటువంటి విశిష్టత కలిగిన విళంబినామ మాఘ పునర్వసును భద్రాచల రామాలయం రాములోరికి కల్యాణం నిర్వహించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.



ప్రగతిభవన్‌లో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నరసింహయ్యకు సీఎం కేసీఆర్ పుట్టినరోజు శుభాకాంక్షలు

నేడు పంచాయతీ నామినేషన్ల పరిశీలన

- అభ్యర్థుల సమక్షంలో స్క్రూటినీ

హై దరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల తొలిదశ నామినేషన్ల దాఖలు గడువు బుధవారం సాయంత్రంతో ముగిసిపోయంది. దాఖలనై నామినేషన్ల స్క్రూటినీ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నారు. ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం 5వరకూ ఈ కార్యక్రమం జరగనుంది. రిటర్నింగ్ అధికారులు స్వయంగా దాఖలైన నామినేషన్లంటినీ క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు నామినేషన్ల స్క్రూటినీలో పాల్గొనవచ్చు. అభ్యర్థులే స్వయంగా హాజరైతే రిటర్నింగ్ అధికారి సందేహాలకు వెంటనే బదులిచ్చే అవకాశం ఉంటుంది. ఏదేని నామినేషన్‌పై వాస్తవాలు , ఆక్షేపణలు కూడా వెంటనే తెలియచేసే అవకాశం ఉంటుంది. నామినేషన్లను తిరస్కరించే అధికారం రిటర్నింగ్ అధికారికే ఉంటుంది. పంచాయతీరాజ్ చట్టంలోని 19వ విభాగం ప్రకారం అభ్యర్థిగా ఉండడానికి అర్హులు కానట్టయితే , లేదా పీఆర్ చట్టంలోని 20, 21,22, 24 విభాగాల ప్రకారం అభ్యర్థిగా ఉండటానికి అర్హత లేనట్టయితే నామినేషన్లను తిరస్కరిస్తారు. నిర్ణీత సమయంలోపు దాఖలు కాని వాటికి కూడ తిరస్కరిస్తారు. ప్రతిపాదకుడు కాకుండా ఇతరులు సమర్పించిన నామినేషన్లను కూడా తిరస్కరిస్తారు. నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి లేదా ఆయన అధికారం ఇచ్చిన వారికి కాకుండా ఇతరులకు సమర్పించివుంటే వాటినికూడ తిరసర్కిస్తారు. నామినేషన్ పత్రం నిర్దేశిత నమూనా లో లేకున్నా తిరస్కరణకు గుర వుతాయి. నామినేషన్ పత్రంలో నిర్దేశించిన చోట అభ్యర్ది గాని , ప్రతి పాద కుడు కాని లేదా ఇద్దరు సం తకం చేయ కపోతే వాటి ని తిరస్క రిస్తారు. డిపాజి ట్ సోమ్ము చెల్లించకపోయినా , చెల్లించిన వాటికి తగిన రసీదు జత పరచకపోయినా తిరస్కరిస్తారు. రిజర్వ్‌డ్ పంచాయతీల్లో ఇత రులు పోటీ చేసినా , అటు వంటి నామి నేషన్లు తిర స్కరణకు గురవుతాయి. వార్డు సభ్యుని పదవికోసం ప్రతి పాదకుడు సంబంధిత వార్డులో ఓటరు గా నమోదు కానపుడు, సర్పంచ్ పదవి కోసం ప్రతి పాదకుడు పంచాయతీలో ఓటరుగ నమోదు కానపుడు అటువంటి నామినేషన్లను తిరస్కరిస్తారు. నేర చరిత్ర, ఆస్తులు , అప్పులు, విద్యార్హతలకు సంబంధించిన సమాచా రాన్ని రాష్ట్రఎన్నికల కమిషన్ ద్వారా నిర్దేశించిన నమూనాలో ఇద్దరు సాక్షుల ధృవీకరణలతో పాటు డిక్లరేషన్ పత్రాన్ని దాఖలు చేయకపోతే అటువంటి నామినేషన్లు తిరస్క రణకు గురవు తాయి. స్క్రూటినీ సమయానికి ప్రతి పాదకుల పేర్లు ఓటరు జాబితాలో నమోదై ఉండి తీరాలి. అదుకు తగిన డాక్యుమెంట్లతో సిద్దంగా ఉండాలి. వయస్సుకు సంబ ంధించిన సంతృ ప్తికరమైన ఆధారాలు ఉండాలి. ఎస్టీఎస్సీ, బీసీ వర్గాలు వారైతే తగిన ధ్రువీకరణ పత్రాల ఆధారాలు ఉండాలి. నామినేషన్ పత్రాలు అన్ని సరైన విధంగా ఉంటే అటువంటి వాటినే అర్హులైన నామినేటెడ్ జాబితాలో ప్రచురిస్తారు.

రేపు అప్పీళ్లకు గడువు

నామినేషన్ పత్రాలు ఏకారణం చేతనైనా తిరస్కరణకు గురై ఉంటే అటువంటి వాటిపై శుక్రవారం అప్పీళ్లకు సమయం కేటాయించారు. అభ్యర్థి సంబంధిత ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్ వద్ద రిట ర్నింగ్ అధికారి నిర్ణయంపై అప్పీలు చేసుకోవచ్చు. నామి నేషన్ పరిశీలన తేది తర్వాత రోజు నామినేషన్ తిర స్కరణపై అప్పీ లు దాఖలు చేయాలి. అప్పీలు దాఖలు చేసిన తర్వాత రోజున ఆప్పీలు పరిష్కణ కార్య క్రమం చేపట్టి వాటిని పరిస్క రిస్తారు.

ఇబ్రహీంపూర్ సర్పంచ్‌గా దేవయ్య ఏకగ్రీవం

అభినందించిన మాజీ మంత్రి హరీష్

హై దరాబాద్,ఆంధ్రప్రభ : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిద్దిపేట్ రూరల్ మండలం పరిధిలోని ఇబ్రహీం పూర్ గ్రామ పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ఇది వరకు కూడా ఈ పంచాయతీలో ఓటర్లు సర్పంచ్ , వార్డు సభ్యులను ఏకగ్రీవంగానే ఎన్నుకున్నారు. ఎస్సీ రిజర్వ్‌డ్ పంచాయతీగా ఉన్న ఈ గ్రామం లో సర్పంచ్‌గా కోడూరు దేవయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజలు తమ పంచా యతీని ఆదర్శంగా నిలిపారు. జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను స్వంతం చేసు కున్న ఈ పంచాయతీని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు దత్తత తీసుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఆ గ్రామ ప్రజలు రాష్ట్రంలో అత్యధికంగా 97శాతం పోలింగ్‌తో ఎన్నికల్లో హరీష్‌కే జేజేలు పలికారు.


జాతీయ స్థాయిలో ఆదర్శపంచాయతీగా ఉన్న ఇబ్ర హీంపూర్ గ్రామ ప్రజలను ఎమ్మెల్యే హరీష్ రావు అభి నం దించారు. గ్రామ సర్పంచ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకుని ఐక్య తా స్ఫూర్తిని కనబరచటం అభినందనీయం అన్నారు. ఈ పంచాయతీకిఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యులు బుధ వారం సిద్ది పేటలో హరీష్ రావు హరీష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 24 ఏకగ్రీవం

- 20 పంచాయతీల్లో గులాబీ మద్దతుదారుల జోరు
- 2 చోట్ల కాంగ్రెస్.. మరో ఇద్దరు స్వతంత్రులకు చాన్స్
- షాద్‌నగర్‌లో 4 పంచాయతీలు ఏకగ్రీవం
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కోడలు కవిత ఎన్నిక లాంఛనం
- తాండూరులో 7 ఏకగ్రీవం.. 3 తెరాసకే
- కొడంగల్‌లో నియోజకవర్గంలో 13 కారువైపే...

రంగారెడ్డి ప్రతినిధి, ప్రభన్యూస్ : అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో ఎమ్మెల్యేలను గెలిపించుకున్న తెరాస ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తాజాగా పంచాయతీ ఎన్నికల్లో కూడా తమ సత్తాను చాటుకుంటోంది. అధికారపక్షం మద్దతు ఇచ్చినవారే అధిక సంఖ్యలో ఏకగ్రీవంగా ఎన్నికవడంతో గులాబీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో తెరాస మద్దతుదారులు పెద్దసంఖ్యలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వికారాబాద్ జిల్లా పరిధిలోని కొడంగల్, తాండూరు నియోజకవర్గాలతో పాటు షాద్‌నగర్ నియోజకవర్గంలో కలిపి ఏకంగా 24 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో అధికార తెరాస ఖాతాలో ఏకంగా 20 పంచాయతీలు దక్కడం గమనార్హం. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే నజరానా పెంచడం... భవిష్యత్తుల్లో నిధుల మంజూరులో ప్రాధాన్యమిస్తామని ప్రకటించడంతో ఏకగ్రీవం చేసుకునేందుకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. చిన్న చిన్న పంచాయతీలకు నిధులు వచ్చేదే తక్కువ. దీంతో ఏకగ్రీవమైతే చాలా నిధులు వస్తాయనే నమ్మ కంతో ప్రజలంతా సమావేశమై ఏకగ్రీవాలు చేసుకు నేం దుకు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగానే ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా పరిధిలోని తాండూరు, షాద్‌నగర్ , కొడంగల్ నియోజకవర్గాల్లో ఏకగ్రీవాల పరంపరకు శ్రీకారం చుట్టారు. గ్రామస్థులంతా సమావేశమై ఏకగ్రీవం చేసుకుంటే కలిగే ప్రయోజనాలు చర్చించి ఆ దిశగా నిర్ణయం తీసుకున్నారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికలు ఈనెల 21న జరగనున్న విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రంతో మొదటి విడత నామినేషన్ల పర్వం ముగిసింది. షాద్‌నగర్ నియోజకవర్గంలో నలుగురు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. వీరిలో షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కోడలు కవిత సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికకావడం గమ నార్హం. ఇంతకుముందు ఎమ్మెల్యే కొడుకు రవియాదవ్ సర్పం చిగా కొనసాగగా తాజాగా ఎమ్మెల్యే కోడలు కవిత సర్పంచి ఎక్లాస్‌ఖాన్‌పేట పంచా యతీలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదే నియో జకవర్గం పరిధిలోని చింతకుంటపల్లి సర్పంచిగా పోచమోని పార్వ తమ్మ కూడా సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొందు ర్గు మండలం పరిధిలోని లక్ష్మీదేవి పల్లిలో పంచాయతీ పాలక వర్గం మొత్తం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం గమనార్హం. సర్పం చిగా నర్సింలు, ఉపసర్పంచి, వార్డుమెంబర్లంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫరూఖ్ నగర్‌మండలం ఉప్పరిగూడ సర్పంచిగా ముమితచందునాయక్ ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన అంతారం తండా అభ్యర్థి నామినేషన్ వేస్తున్న దృశ్యం



ఏకగ్రీవంగా ఎన్నికైన కవిత

తాండూరులో ఆరు పంచాయతీలు ఏకగ్రీవం.

వికారాబాద్ జిల్లా పరిధిలోని తాండూరు నియోజకవర్గంలో ఆరు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో అధికార తెరాస మూడు పంచాయతీలు కైవసం చేసుకోగా కాంగ్రెస్ ఖాతాలో ఒక సర్పంచి పదవి దక్కింది. ఇద్దరు సర్పంచులు స్వతంత్రులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాండూరు మండలం పరిధిలోని అంతారంతండా సర్పంచిగా సావిత్రి, మిట్టబాస్‌పల్లి సర్పంచిగా నరేందర్‌రెడ్డి, సంకిరెడ్డిపల్లి సర్పంచిగా అమృత్‌రెడ్డిలు సర్పంచుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ముగ్గురు తెరాస బలపర్చిన వాళ్లు కావడం గమనార్హం. యాలాల మండలం సంగాయిగుట్ట సర్పంచిగా లలితబాయి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమె కాంగ్రెస్ బలపర్చిన సర్పంచి కావడం గమనార్హం. తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి సొంత మండలం బషీరాబాద్‌లో ఇద్దరు స్వతంత్రులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాబునాయక్ తండాలో సూర్యనాయక్, కొప్పన్‌కోట్‌తండాలో పద్మబాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిద్దరు స్వతంత్రులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కొడంగల్‌లో 13 ఏకగ్రీవం

కొడంగల్ నియోజకవర్గంలో ఏకంగా 13 పంచాయతీలు ఏకగ్రీవం కాగా ఇందులో 12 జీపీలు తెరాస ఖాతాలోకి వెళ్లాయి. కేవలం కొడంగల్ మండలంలో ఒక గ్రామమే కాంగ్రెస్ చేజిక్కించుకుంది. కొడంగల్ మండలంలోని కొడంగల్, దౌలాబాద్, బొమ్మరాజ్‌పేట మండలాల్లో మొదటి విడత ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇందులో బుధవారం నామినేషన్ల పర్వం ముగిసింది. ఇందులో ఒకరి చొప్పున నామినేషన్లు వేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అనధికారికంగా ప్రకటించారు. వీరిని అధికారికంగా మాత్రం ఈనెల 21న ప్రకటించనున్నారు.



మా ఊరు - మా రాజ్యం



ఎప్పుడు..? ఎవరు?

1964 - 1968 వరకు ఏనుగు కిష్టారెడ్డి
1969 - 1987 వరకు ముడుపు భూమారెడ్డి
1987 - 1998 వరకు ఆశన్న
1998 - 2001 వరకు ఆత్రం ప్రభాకర్
2001 - 2006 వరకు మెస్రం సోమన్న
2006 - 2010 వరకు మెస్రం రాము
2013 - 2018 వరకు సిడాం లస్మన్న

మనం మనం బరంపురం!

- ఐకమత్యంతో అన్ని రంగాల్లో అభివృద్ధి
- 55 ఏళ్లుగా ఎన్నికే ఎరుగని గ్రామం
- ప్రతీసారి ఏకగ్రీవమే.. ఈసారి కూడా అదే బాటలో..
- అక్కడ అందరిదీ ఒకేమాట... ఒకే బాట
- ఆదర్శంగా నిలిచిన ఆదిలాబాద్ జిల్లా బరంపూర్ పంచాయతీ

ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : రోజులు మారుతున్నాయి.. ప్రజల అభిప్రాయాలు మారుతున్నాయి.. రాజకీయాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి.. కానీ ఆ ఊరి ప్రజలది ఒకే మాట.. ఒకే బాట.. ఐక్యమత్యమే వారి నినాదం.. గ్రామాభివృద్ధే వారిలక్ష్యం.. వారికి రాజకీయాలు అడ్డురావు.. కులాలు, వర్గాలు అసలే తొంగిచూడవు.. ఆ గ్రామస్థులు అనుకున్నదే వేదం.. 57 ఏళ్ల క్రితం గ్రామస్థులు నాటిన ఐక్యమత్యం బీజం ఇప్పటికీ సజీవంగా ఉంది. గ్రామపంచాయతీ ఏర్పడినప్పటి నుంచి ఆ గ్రామానికి ఇంతవరకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరుగలేదు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా గ్రామస్థులంతా కూర్చుని ఆయా పదవులకు ఎవరిని ఎంపిక చేయాలో నిర్ణయిస్తారు. ఏకగ్రీవంగా ఎన్నుకునే సంప్రదాయం సాగుతోంది. జిల్లాకే ఆదర్శంగా నిలిచిన ఆ గ్రామం పేరు బరంపూర్. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో ఉంది.

రెండో దశలో ఎన్నిక

బరంపూర్ గ్రామ పంచాయతీకి రెండో విడతలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక జరగనుంది. ఈ సారి కూడా ఏకగ్రీవ సంప్రదాయాన్ని కొనసాగించాలని గ్రామస్థులు నిర్ణయించుకున్నారు. 1964లో ఏర్పడిన ఈ గ్రామ పంచాయతీకి ఇప్పటివరకు ఎన్నికలు జరుగలేదు. 55 ఏళ్లుగా ఈ పంచాయతీలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. ఎన్నికలకు ముందు పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు సమావేశమై సర్పంచ్‌గా, వార్డుసభ్యులుగా ఎవరిని ఎన్నుకోవాలని చర్చించి ఏకాభిప్రాయానికి వస్తారు. ఈసారి రెండోవిడతలో ఇక్కడ ఎన్నిక జరగాల్సి ఉంది. నోటిఫికేషన్ వెలువడే నాటికి తాము సర్పంచ్, వార్డు సభ్యుల పేర్లను ఖరారు చేసుకుంటామని, వారిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటామని గ్రామస్థులు పేర్కొంటున్నారు.



20 ఏళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేసిన ఎం. భూమారెడ్డి

ఏకగ్రీవంగా ఏడుగురు

1998లో బరంపూర్ గ్రామపంచాయతీ ఎస్టీలకు రిజర్వు చేయబడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు గిరిజనులు సర్పంచులుగా కొనసాగుతున్నారు. 1964 నుంచి 2018 వరకు ఇక్కడ పనిచేసిన సర్పంచులంతా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డవారే.

4 గ్రామాలు... 4వేల జనాభా

బరంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నాలుగువేల జనాభా ఉంది. ప్రస్తుతం ఈ గ్రామ పంచాయతీ పరిధిలో బరంపూర్, మదనపూర్, నర్సాపూర్, కొలాంగూడ గ్రామాలున్నాయి. గతంలో ఈ గ్రామపంచాయతీ పరిధిలో నందిగామ, రేకులగూడ గ్రామాలు కూడా ఉండేవి. అయితే ఈ రెండు గ్రామాలను బరంపూర్ పంచాయతీ నుంచి విభజించి కొత్త గ్రామపంచాయతీని ఏర్పాటు చేశారు. దీంతో ఈ గ్రామ పంచాయతీలో కేవలం నాలుగు గ్రామాలే ఉన్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఈ గ్రామంలో ఎలాంటి హడావుడి కనిపించదు. ఇతర ప్రాంతాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కినప్పటికీ ఈగ్రామంలో మాత్రం హడావిడి ఏమీ ఉండదు. మంచి నాయకుడిని ఎన్నుకుంటేనే గ్రామం అభివృద్ధి చెందుతుందనే ప్రగాఢ విశ్వాసం ఈ గ్రామస్థులది. బరంపూర్ గ్రామపంచాయతీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఈ గ్రామానికి ఏడుగురు సర్పంచ్‌లుగా పనిచేశారు. 1964 నుంచి 1998 వరకు 34 ఏళ్ల పాటు వివిధ వర్గాలకు చెందిన వారు ఇక్కడ సర్పంచులుగా ఎన్నికయ్యారు.

అక్కడోసారి... ఇక్కడొకసారి

- ఏపీ, తెలంగాణాల్లో సర్పంచ్‌గా పనిచేసిన కర్నాటి రామారావు
- తునికిపాడులో (ఏపీ) ఓసారి... కిష్టాపురం (టీఎస్) నుంచి రెండోసారి గెలుపు

మధిర, ప్రభన్యూస్ : ఖమ్మం జిల్లా మధిర మండలం క్రిష్ణాపురం గ్రామపంచాయతీ తాజా మాజీ సర్పంచ్‌గా పనిచేసిన కర్నాటిరామారావు రెండు రాష్ట్రాల్లో సర్పంచ్‌గా పనిచేసి ఖ్యాతి గడించారు. కర్నాటి రామారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గంపలగూడెం మండలం తునికిపాడు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన బోగళ్ళపాడు గ్రామానికి చెందిన వారు. ఆ గ్రామం తెలంగాణ ప్రాంతంలోని ఖమ్మంజిల్లా మధిర మండలం క్రిష్ణాపురం గ్రామానికి సరిహద్దుగా ఉంది. అంతేకాకుండా ఆ రెండు గ్రామాల రైతులకు సంబంధించిన భూములు అన్ని కలిసి ఉండేవి. అయితే ఆ గ్రామంలో మౌలిక వసతులు లేవని ఆ గ్రామానికి చెందిన కొంత మంది ప్రజలు తునికిపాడు వెళ్ళి స్థిరపడగా కర్నాటి రామారావు మాత్రం సరిహద్దుల్లో ఉన్న ఖమ్మంజిల్లాలోని మధిర మండలం క్రిష్ణాపురం గ్రామానికి వచ్చారు. అయితే ఓటు మాత్రం బోగళ్ళపురం గ్రామంలోనే ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2001లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తునికిపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి జనరల్‌కు కేటాయించారు. అక్కడ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండటంతో టీడీపీ నుండి ఎవరు పోటీ చేసేందుకు ముందుకు రాకపోవడంతో తెలంగాణలోని అప్పుడే వలస వెళ్ళిన కర్నాటి రామారావును టీడీపీ అభ్యర్థిగా పట్టుబడి పోటీ చేయించారు. వివాదరహితుడిగా అన్నివర్గాలతో సత్సంబంధాలు కలిగిన కర్నాటి రామారావును తెలుగుదేశం తరుపున తునికిపాడు గ్రామపంచాయతీ సర్పంచ్‌గా అక్కడ పార్టీ నాయకులు పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన కర్నాటిరామారావు 73ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ గ్రామపంచాయతీలో మొత్తం 3వేల ఓట్లు ఉన్నాయి. సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుండి 2006 వరకు సర్పంచ్‌గా సేవలు అందించారు. సర్పంచ్ పదవీకాలం పూర్తయిన తర్వాత యాథావిధిగా మళ్లీ క్రిష్ణాపురం గ్రామం వచ్చి వ్యవసాయం చేసుకున్నారు. 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో క్రిష్ణాపురం గ్రామపంచాయతీ జనరల్‌కు కేటాయించడంతో ఈ గ్రామం కూడా తెలుగుదేశం పార్టీకి గట్టి పట్టున్న గ్రామం. కాంగ్రెస్‌పార్టీ గెలవాలని లక్ష్యంతో ఆనాడు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న మల్లు భట్టీ విక్రమార్క టీడీపీ నాయకులుగా ఉన్న కర్నాటి రామారావును కాంగ్రెస్‌లో చేర్చుకొని క్రిష్ణాపురం కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన కర్నాటి రామారావు టీడీపీ అభ్యర్థిపై 173 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కర్నాటి రామారావు 2013 నుండి 2018 వరకు కాంగ్రెస్ పార్టీ నుండి క్రిష్ణాపురం సర్పంచ్‌గా పనిచేశారు. ఒకేవ్యక్తి రెండు రాష్ట్రాల్లో సర్పంచ్‌గా పనిచేసి ఆ గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్ళి ప్రజల మన్ననలు పొందారు. రెండు రాష్ట్రాల్లో సర్పంచ్‌గా పనిచేసిన ఘనత కర్నాటి రామారావుకి దక్కింది. ప్రస్తుతం క్రిష్ణాపురం గ్రామ పంచాయతీ ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు కావడంతో ఆ వర్గంలో మంచి వ్యక్తిని సర్పంచ్‌గా పోటీ చేయించి గెలిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



కర్నాటి రామారావు

పంచాయతీల్లో పోటీకి రైతు సమితి సభ్యులు అర్హులే : ఈసీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రైతు సమన్వయ సమితి సభ్యులు కూడా అర్హులే అని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సమితీ సభ్యులు నామినేషన్లు దాఖలు చేస్తే వారిని డిస్క్వాలిఫై చేయరాదని పేర్కొంది.రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం.అశోక్ కుమార్ ఈ మేరకు బుధవారం నాడు అన్ని జిల్లాల కలెక్టర్లకు జిల్లా ఎన్నికల అధికారులకు , పంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అత్యవసర ఆదేశాలు జారీ చేశారు.




18 ఓట్లు వస్తే సర్పంచ్!

- జనాభా 45.. ఓటర్లు 34 మంది
- రాష్ట్రంలోనే అతి చిన్న పంచాయతీ దొంగతోగు

ఆళ్ళపల్లి, (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా), ప్రభన్యూస్: రాష్ట్ర ప్రభుత్వం చిన్నచిన్న తాండాలను కూడా పంచాయతీలుగా గుర్తించడంతో కొత్త పంచాయతీల సంఖ్య బాగా పెరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్ళపల్లి మండలంలోని దొంగతోగును ఇటీవల పంచాయతీగా ఏర్పాటు చేశారు. గతంలో గుండాల పంచాయతీలో ఈ గ్రామం ఉండేది. గుండాల మండల కేంద్రానికి దగ్గరగా ఉన్నప్పటికీ మండల విభజనలో దొంగతోగు గ్రామాన్ని ఆళ్ళపల్లి మండలంలో చేర్చారు. గుండాల మండలానికి దొంగతోగు గ్రామానికి మధ్య కిన్నెరసాని వాగు ఉండడంతో ఆళ్ళపల్లి మండలంలో దొంగతోగును కలిపారు. దొంగతోగు గ్రామ జనాభా 45 మంది కాగా, ఓటర్లు 34 మంది. ఈ గ్రామానికి 10 కిలోమీటర్ల పరిధిలో ఏ గ్రామం లేకపోవడం వల్ల దీనిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారు. మొత్తం 34 మంది ఓటర్లలో 17 మంది పురుషులు, 17 మంది స్త్రీలు ఉన్నారు. గ్రామాన్ని మొత్తం నాలుగు వార్డులుగా విభజించారు. ఇక్కడ 18 ఓట్లు పొందితే చాలు ముఖాముఖిలో సర్పంచ్‌గా ఎన్నిక కావచ్చు. ఒకవేళ బహుముఖ పోటీ జరిగితే ఐదారు ఓట్లు ఉన్నా సర్పంచ్ అయ్యే అవకాశం ఉంది.

అడవిరామావరంలోనూ అదే తీరు

ఇదే మండలంలో అడవిరామావరం గ్రామ పంచాయతీలో కేవలం 62 ఓట్లు మాత్రమే ఉన్నాయి. ఇది కుడా గుండాల మండలానికి చెందిన సాయనపల్లి నుంచి విడిపోయి నూతన పంచాయతీగా ఏర్పడింది. ఈ గ్రామంలో 30 మంది పురుషులు, 32 మంది స్త్రీలు ఉండగా నాలుగు వార్డులుగా విభజించారు. ఈ రెండు గ్రామాలకు ద్విచక్ర వాహనాలే తప్ప మరో రవాణా సౌకర్యం లేదు. చిన్న పంచాయతీలుగా ఏర్పడంతో రాజకీయ నాయకులు తమ తమ పార్టీల నుంచి గెలుపు కోసం ఏకగ్రీవం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలోనే అతి చిన్న పంచాయతీగా దొంగతోగు గ్రామం కావడంతో వారువమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి తమ పంచాయతీలను ఏకగ్రీవం చేస్తే అభివృద్ధి జరుగుతుందా లేదా బహుముఖ పోటీ జరిగితే సర్పంచ్ ఏ పార్టీని వరిస్తుందో ఆసక్తిగా వేచి చూడాల్సిందే.



గ్రామాభివృద్ధి ప్రణాళికే కీలకం!

పంచాయతీ కథలు 7

గ్రామాలు బలోపేతం కావాలంటే, పంచాయతీలే నిజమైన రాజ్యాంగ బద్ధమైన, అధికారమున్న, శక్తివంతమైన ప్రజాస్వామిక వ్యవస్థ అని స్థానిక ప్రజలు బలంగా విశ్వసించాలి. దీనికి రాష్ట్ర ప్రభుత్వాలే చొరవ తీసుకొని అవసరమైన కీలక చర్యలు తీసుకోవాలి. గ్రామ పంచాయతీలతో సంబంధమున్న అన్ని ప్రభుత్వ విభాగాలు కూడా గ్రామ సభలకు హాజరయ్యేలా చూడాలి. దీంతో ప్రజలకు కూడా స్వపరిపాలనపై విశ్వాసం పెరుగుతుందని ఈ రంగ నిపుణుల అభిప్రాయం. ఇదే గ్రామసభలో ప్రజా పంపిణీ విధానం, పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర ప్రజా సర్వీసుల గురించి చర్చించాలి. ఈ ప్రభుత్వ విభాగాల బాధ్యులు గ్రామ సభలకు హాజరై.. గ్రామాభివృద్ధి ప్రణాళికల్లో భాగస్వాములు కావడం, పంచాయతీ నిర్ణయాలకు లోబడి వ్యవహరించడం ద్వారా ప్రజలకు ఈ స్థానిక ప్రజాస్వామిక వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని, తద్వారా స్వపరిపాలన పరిపుష్టమవుతుందని అంటారు.

చెప్పుకొనే అవకాశం ఉండాలి..

గ్రామ సభల్లో తమ సమస్యలు చెప్పుకొనే అవకాశం ప్రతి ఒక్కరికి ఉండాలే చూడాలి. పంచాయతీ వ్యవహారాలను ప్రశ్నించడానికి ఆస్కారమివ్వాలి. ప్రజల ప్రశ్నలకు సర్పంచు, వార్డు సభ్యులు ఓపిగ్గా సమాధానమివ్వాలి. తప్పులు ఎత్తి చూపినప్పుడు వాటిని సరి చేసుకోవడానికి అప్పటికప్పుడే తీసుకొనే నిర్ణయాల కారణంగా పంచాయతీపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది. పంచాయతీల కారణంగా తమకు న్యాయం జరుగుతుందనే ధైర్యం వస్తుంది. ప్రజలు తమ నిజమైన సమస్యలను గ్రామ సభ ముందుంచడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించాలి. దీనిపై విస్తృతంగా చర్చించాలి. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని నిర్ణయాలు తీసుకోవాలి. తీసుకున్న నిర్ణయాలను చిత్తశుద్ధితో అమలు చేయాలి. దీంతో గ్రామంలో సహృద్భావ వాతావరణం ఏర్పడడానికి కూడా సాధ్యమవుతుంది.

గ్రామాభివృద్ధి ప్రణాళిక కసరత్తు!

2015వ సంవత్సరం నుంచి పంచాయతీ వ్యవస్థలోకి సరికొత్త విధానం ప్రవేశించింది. దీన్నే జీపీడీపీ అంటారు. గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్‌గా పిలవబడే గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు మార్గదర్శకాలను విడుదల చేశాయి. ఒక ప్రాంతాభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయడం నిజానికి క్లిష్టతర వ్యవహారమే! దీనికి పంచాయతీ సభ్యుల సామర్థ్యం ఒక్కటే సరిపోదు. సాంకేతిక సహాయం కూడా వెలుపల నుంచి పంచాయతీలకు అందాలి. నిపుణుల సలహాలను స్వీకరించాలి. జీపీడీపీ అమల్లోకి వచ్చి మూడేళ్ల అయిన దృష్ట్యా ఇది ఎంత వరకు ఫలించింది అన్నది పూర్తీ స్థాయిలో చెప్పడం కష్టమంటారు ఈ రంగ నిపుణులు. అన్ని గ్రామ పంచాయతీలు ఒక ప్రణాళిక రూపొందించుకొని.. దానికి అనుగుణంగా నిధుల వ్యయం, వనరుల వినియోగం చేస్తున్నాయని చెప్పడం కూడా కష్టమే! అయిదారు ప్రభుత్వ పథకాల అమలుపై కార్యారణ రూపొందించుకోవడమే జీపీడీపీ అనుకుంటున్నారు. అయితే అది సరిపోదు. ఈ గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపొందించడానికి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ విధి విధానాలను రూపొందించే పనిలో ఉంది. అందుకోసం దేశవ్యాప్తంగా అయిదు వందల పంచాతీలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంచుకొని స్థానిక ప్రజల సమష్టి సహకారంతో ఆయా గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో ఉంది. ఇది మిగిలిన పంచాయతీలకు కూడా ఒక పాఠశాలలా ఉంటుందని, ఈ ప్రక్రియ నుంచి వారు కూడా తమ గ్రామ ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం సాధ్యమవుతుంది.

నన్ను క్షమించండి

కాఫీ విత్ కరణ్ టీవీ షోలో వ్యాఖ్యలపై హార్దిక్ పాండ్యా

సిడ్నీ: ఒక టీవీ షోలో తన వివాదాస్పద వ్యాఖ్యలతో విమర్శలను ఎదుర్కొన్న భారత క్రికెటర్ హార్దిక్ పాండ్యా ట్విట్టర్ వేదికగా క్షమాపణలు కోరాడు. ప్రముఖ చిత్ర నిర్మాత కరణ్ జోహార్ హోస్ట్‌గా వ్యవహరించే కాఫీ విత్ కరణ్ టీవీ షోలో 25 ఏళ్ల ఆల్ రౌండర్ పాండ్యా, బ్యాట్స్‌మన్ కెఎల్ రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండ్యా మహిళలతో తన వ్యక్తి గత సంబంధాలు, తన శృంగార వాంఛలు తీర్చుకున్న సందర్భాలను వివరించాడు. అనంతరం పాండ్యా వైఖరిపై విమర్శలు రావడంతో.. క్షమాపణలు కోరుతూ.. కాఫీ విత్ కరణ్ షోలో నా వ్యాఖ్యల వల్ల బాధపడిన వారందరిని క్షమించమని కోరుతున్నాను. అని ట్వీట్ చేశాడు. ఈ కార్యక్రమంలో కరణ్ అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. తన జీవనంలో చోటుచేసుకున్న ఘటనలను వివరించాడు. తాను పలువురు మహిళలతో సంబంధం కలిగివున్నానంటూ..ఈ విషయాలను తన తల్లి దండ్రులతో కూడా ప్రస్తావించేవాడినన్నాడు. వారి పేర్లను కూడా తెలుసుకునేందుకు ప్రయత్నించేవాడిని కాదని పాండ్యా తెలిపాడు. అంతేకాక, తన బ్రహ్మచర్యం కోల్పోయిన విషయాన్ని తన పేరెంట్స్‌తో చెప్పానన్నాడు. క్లబ్‌లో వారిని కలిసినప్పుడు వారి పేర్లను ఎందుకు తెలుసుకోలేదని కరణ్ ప్రశ్నించగా.. సాధారణంగా క్లబ్‌లో వారు(మహిళలు) ఏవిధంగా కదులుతున్నారో పరిశీలించేందుకు ఆసక్తి చూపేవాడినన్నాడు. పాండ్యా ఈ కార్యక్రమంలో పాల్గొనడంపై విమర్శలు రావడంతో బీసీసీఐ ఈ విషయాన్ని తీవ్రమైన చర్యగా పరిగణించింది. ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఆటగాళ్లపై నిషేధాన్ని విధించేందుకు బీసీసీఐ యోచిస్తున్నట్లు పేర్కొంది. పాండ్యా, రాహుల్‌ల వైఖరిపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. పాండ్యా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో భారత జట్టుతోపాటు ఉన్నాడు. గత ఏడాది ఆసియా కప్ సందర్భంగా గాయపడ్డా పాండ్యా పూర్తిగా కోలుకోవడంతో మెల్‌బోర్న్‌లో బాక్సింగ్ డే టెస్ట్‌కు ముందు పాండ్యా జట్టులో చేరాడు. 12న ప్రారంభంకానున్న ఆస్ట్రేలియాతో మూడు వన్డే మ్యాచుల సిరీస్‌లో మైదానంలోకి దిగనున్నాడు.

పాండ్యా, కెఎల్ రాహుల్‌కు షోకాజ్ నోటీసులు

కాఫీ విత్ కరణ్ షోలో పాల్గొన్న హార్ధిక్ పాండ్యా, కెల్ రాహుల్‌కు బీసీసీఐ షోకాజ్ నోటీసులు జారీచేసింది. వీరిద్దరు మహిళలపై చేసిన వ్యాఖ్యలపై బీసీసీఐ తీవ్రంగా పరిగణిస్తూ.. బుధవారం నోటీసులు జారీచేసింది. 24 గంటల్లో తమకు వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు.. బీసీసీఐ పాలక కమిటీ ఛైర్మన్ వినోద్ రాయ్ మీడియాకు తెలిపాడు. షో కాజ్ నోటీసులు అందుకున్న తర్వాత పాండ్యా వేగంగా స్పందిస్తూ.. ఈ ఘటన పట్ల విచారాన్ని వ్యక్తం చేశాడు. నేను చాట్ షోలో పాల్గొన్నాను. అందులో నేను చేసిన వ్యాఖ్యలు వీక్షకుల మనోభావాలను దెబ్బతీస్తుందనుకోలేదు. దీనికి నేను మనస్ఫూర్తిగా విచారాన్ని వ్యక్తం చేస్తున్నాను అని బీసీసీఐకిచ్చిన వివరణలో తెలిపాడు. ఆ వ్యాఖ్యలు చేయడం వెనక ఎలాంటి దురద్దేశం లేదు. ఎవరి మనోభావాలను కించపర్చాలనుకోలేదు. ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతం కావని మీకు హామీఇస్తున్నాను. బీసీసీఐ అంటే నాకు గౌరవముందని పాండ్యా తన లేఖలో తెలిపాడు. పాండ్యా, రాహుల్ వివరణలను ఇంకా పూర్తిగా చూడలేదని.. ఈ సమయంలో ఎటువంటి చర్యలు తీసుకోవాలన్నది ఇంకా నిర్ణయించలేదు అని పాలక కమిటీ ఛైర్మన్ వినోద్ రాయ్ అన్నాడు.





నేడు యూఏఈతో భారత్ ఢీ

రాత్రి 8గం. నుంచి మ్యాచ్ ప్రారంభం

అబుదాబి: ఎఎఫ్‌సీ ఆసియా కప్‌లో భారత్ నేడు ఆతిథ్య దేశం యూఏఈతో పోటీ పడనుంది. తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను 4-1 గోల్స్‌తో ఓడించిన భారత్, నేటి పోటీలో యూఏఈపై కూడా విజయం సాధించాలని ఉత్సాహంతో ఉంది. భారత జట్టులో ముగ్గురు జూనియర్ స్థాయి ఆటగాళ్లతో ఆడి తొలి పోటీలో థాయ్‌లాండ్‌ను ఓడించింది. ఫిఫా ప్రకటించిన ర్యాంకుల్లో భారత్ ప్రస్తుతం 97వ స్థానంలోఉండగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) 79వ ర్యాంకులో ఉంది. 2015లో యూఏఈ జట్టు అత్యుత్తమంగా రాణించి 24వ ర్యాంకును పొందింది. కోచ్ స్టీఫెన్ కాన్‌స్టాన్‌టైన్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. థాయ్‌లాండ్‌తో రెండో అర్ధభాగం ఆటలో భారత ఆటగాళ్లు అద్భుత ప్రదర్శన చేశారన్నాడు.ఈ ప్రదర్శనతో భారత్ మూడు పాయింట్లు పొంది గ్రూప్ ఎలో అగ్రస్థానంలో నిలిచిందన్నాడు. 'భారత్ యువ, సీనియర్ ఆటగాళ్లతో శక్తివంతంగా ఉంది. ఆటగాళ్లు ఉత్సాహంతో ఉన్నారు. యూఏఈతో మ్యాచ్ వేరుగా ఉంటుంది. అది గట్టి జట్టే.. 'అని కోచ్ స్టీఫెన్ అన్నాడు. 1964 ఆసియా కప్‌లో రన్నర్స్ అప్‌గా నిలిచిన భారత్ 1984, 2011 ఎడిషన్లల్లో గ్రూప్ దశలోనే ఓడింది. ఆరు గ్రూపులుగా 24 జట్లు పోటీ పడుతున్న ప్రస్తుత టోర్నీలో గ్రూప్ స్థాయిలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నాకౌట్‌కు చేరతాయి. అదేవిధంగా మొత్తంగా టోర్నీలో ఉత్తమంగా రాణించిన మూడో స్థానాల్లో నిలిచిన నాలుగు జట్లు కూడా నాకౌట్‌కు చేరతాయి. భారత్ నాలుగోసారి ఆసియా కప్‌లో ఆడుతోంది. నేడు యూఏఈతో ఆడే మ్యాచ్‌ను జనవరి 14న బహ్రెయిన్‌తో ఆడే మ్యాచ్‌ను కనీసం డ్రా చేస్తే సరిపోతుంది.

ఛెత్రీ ఆట కీలకం

సునీల్ ఛెత్రీ నేతృత్వంలోని జట్టు ఎక్కడికి వెళ్లినా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బ్లూ టైగర్స్‌గా పేరుపొందిన భారత జట్టు మరిన్ని విజయాలను అందుకోవా లనుకుంటోంది. థాయ్‌లాండ్‌తో మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన సునీల్ ఛెత్రీ, అర్జెంటీనా సూపర్ స్టార్ లయోనెల్ మెస్సీ చేసిన గోల్స్ సంఖ్యను అధిగమించి ఆత్మ విశ్వాసం పెంచుకున్నప్పటికి..అది అతి విశ్వాసం కాదంటున్నాడు. 34 ఏళ్ల ఛెత్రీ ఒత్తిడికి లోనుకాకుండా థాయ్‌లాండ్‌తో మ్యాచ్‌లో కీలక పాత్ర నిర్వహించాడు. ఛెత్రీలాంటి సీనియర్లు, జూనియర్లతో కూడిన భారత్ 54 ఏళ్ల తర్వాత తొలిసారిగా రెండో రౌండ్లోకి ప్రవేశించేందుకు మార్గం సుగమం చేసుకుంది. నేడు యూఏఈతో ఆడే మ్యాచ్‌ను కనీసం డ్రా చేస్తే భారత్ తర్వాత దశలోకి ప్రవేశిస్తుంది. ఏళ్ల తరబడి ఆటలో సాగుతూ రికార్డులు సృష్టించిన ఛెత్రీ జట్టులో కొనసాగుతూ ధీమా అందిస్తుండగా, కొత్తగా జట్టులోకి వచ్చిన ఆశిక్ కురునియన్, ఉదాంతా సింగ్‌లు రాణిస్తుండటంతో భారత గెలుపు ఖాయమని కోచ్ అంటున్నాడు.

థాయ్‌లాండ్‌తో మ్యాచ్‌లో సబ్‌స్ట్యూట్ ఆటగాళ్లుగా బరిలోకి దిగిన నిమిషాల్లోనే జెజె లాల్‌పెక్లువా, అనిరుద్ థాపాలు కూడా రాణించారు. యూఏఈ తన తొలి మ్యాచ్‌లో బహ్రెయిన్‌తో తలపడి 1-1తో డ్రాముగించినప్పటికి నేటి మ్యాచ్‌లో ఆ జట్టు గట్టి పోటీనిస్తుందని ఛెత్రీ సేన భావిస్తోంది.



యూఏఈ ఆలస్యంగానైనా గోల్ చేసి ఓటమిని తప్పించుకుంది. సబ్‌స్ట్యూట్ ఆటగాడిగా మైదానంలోకి వచ్చి అహ్మద్ ఖలీల్ గోల్ చేయడంతో యూఏఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోగలిగింది. యూఏఈలో మిడ్ ఫీల్డర్ విభాగంలో ఇస్మాయిల్ హమ్మిది కీలక ఆటగాడుగా ఉన్నాడు. భారత్ మిడ్ ఫీల్డ్ విభాగంలో ఉన్న అనిరుధ్ థాపా, ప్రణయ్ హల్దార్‌ను అధిగమించాలని యూఏఈ ప్రయత్నిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. యూఏఈ జట్టుకు ఏమాత్రం తీసిపోని భారత జట్టులో సెంట్రల్ డిఫెన్సివ్ ఆటగాళ్లుగా ఉన్న సందేశ్ జింగాన్, అనాస్‌లుండగా గోల్ కీపర్ గురుప్రీత్ సింగ్ సంధు ప్రత్యర్థి గోల్స్ ప్రయత్నాలను నిలువరించడానికి సిద్ధంగా ఉన్నాడు. 2015లో ఆసియన్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికైన యూఏఈ ఆటగాడు అహ్మద్ ఖలీల్, ఏడు గోల్స్ చేసి తన దేశంలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచిన మబ్కౌత్‌లు ఈసారి రెచ్చిపోయేందుకు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు భారత్ గెలవడానికే ఆడుతుందని కోచ్ స్టీఫెన్ తెలిపాడు. మేము నేటి మ్యాచ్‌ను 4-1 లేదా 5-1తో గెలుస్తామని అంచనా వేయడంలేదు. ప్రత్యర్థి జట్టును తక్కువ అంచనా వేయం. అదేవిధంగా ఉద్వేగ్నంగా మ్యాచ్‌ను ఆడాలనుకోవడంలేదు. గ్రూప్ దశను దాటడానికి, మాకు ఇంకా రెండు మ్యాచులున్నాయి. రెండు పాయింట్ల అవసరముంది. ఈ దశ దాటిన తర్వాత కొంచెం ఉద్విగ్నతకు లోనయ్యే అవకాశముంది. ఉద్విగ్నతకు లోనుకాకుండా సమయస్ఫూర్తితో ఆడుతూ విజయం సాధించాలన్నదే మా లక్ష్యం అని కోచ్ స్టీఫెన్ చెప్పాడు.

యూఏఈని తక్కువ అంచనా వేయం

ఇక వన్డేలపై దృష్టి



సిడ్నీ: ఎర్ర బంతులతో దుమ్ము రేపిన భారత ఆటగాళ్లు తెల్ల బంతులతో ఆటైన పరిమిత ఓవర్ల మ్యాచులకు సమాయత్తమవుతున్నారు. 2019 ప్రపంచకప్ వన్డే ప్రపంచకప్ దృష్ట్యా ఆటగాళ్లు, అభిమానుల దృష్టి తెల్లబంతుల క్రికెట్‌వైపు మరలింది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు, అనంతరం న్యూజిలాండ్‌లో ఐదు వన్డేలు, రెండు టీ20 మ్యాచులు భారత్ ఆడనుంది. అనంతరంభారత్ పర్యటనలో ఆసీస్‌తో వన్డేలు ఆడనుంది. వన్డేసిరీస్‌కోసం సిడ్నీ చేరుకున్న వైట్‌బాల్ స్పెషలిస్టులైన ఎంఎస్ ధోనీ శిఖర్ ధావన్‌లతో పాటు, రోహిత్ శర్మ, అంబటి రాయుడు, కేదార్ జాదవ్, యజువేంద్ర చాహల్, దినేష్ కార్తిక్, ఖలీల్ అహ్మద్‌లు భారత జట్టులో కలిశారు. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌కు సమాయత్తంలో భాగంగా బుధవారం ఎంఎస్ ధోనీ, శిఖర్ ధావన్, అంబటి రాయుడు,కేదార్ జాదవ్‌లు సిడ్నీ క్రికెట్ మైదానంలో ప్రాక్టీస్ ప్రారంభించాడు. గురువారం పూర్తి జట్టు ప్రాక్టీసులోకి దిగనుంది. 12న సిడ్నీలో తొలి వన్డే, అనంతరం 15న అడిలైడ్ ఒవల్‌లో రెండో వన్డే, 18న మెల్‌బోర్న్‌లో మూడో వన్డే జరుగనుంది. ఫాస్ట్ బౌలర్ బుమ్రా వన్డేల్లోంచి టెస్టుల్లోకి ప్రవేశించి రాణించడాన్ని మాజీ ఆస్ట్రేలియా పేసర్ డిర్క్ నాన్నెస్ ప్రశంసించాడు. మనవద్ద సామర్థ్యం ఉంటే వైట్‌బాల్ ఆట నుంచి టెస్ట్‌క్రికెట్‌లోకి ప్రవేశించడం తేలికే. బుమ్రా అదే చేశాడు. ఒకే చోట బంతిని వేయటం, లైన్‌ను నిలకడగా కొనసాగించడం అద్భుతం అతడు మేటి బౌలర్. అతని విజయ రహస్యం ఫిజికల్ ఫిట్‌నెస్. అతను మిగతా వారిలాగా జిమ్‌లో ఎక్కువసేపు గడపనప్పటికి.. అద్భుతంగా రాణిస్తు న్నాడు అని డిర్క్ అన్నాడు. ఆస్ట్రేలియాలో టీ20 సిరీస్, టెస్ట్ సిరీస్ అనంతరం ప్రపం చ కప్ దృష్ట్యా బుమ్రాకు వ్యూహాత్మకంగా విశ్రాంతినిచ్చారు ఇది మంచి ఫలితాలను ఇస్తుందన్నాడు. ఇశాంత్ శర్మ, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ షమీ, ఓవర్ ద వికెట్, రౌండ్ ద వికెట్ బౌలింగ్ చేశారు. స్పిన్నర్లు బంతిని రెండు వైపులా తిప్పి తమ ప్రతిభను చాటారు. భారత్ బౌలింగ్ విభాగం అద్భుతంగా రాణించిందని డిర్క్ చెప్పాడు.

సిడ్నీ చేరుకున్న వైట్‌బాల్ స్పెషలిస్ట్ ధోనీ, ధావన్



ఇండోనేషియా రాజధాని జకార్తలో 8వ ఆసియా పారా సైక్లింగ్ ట్రాక్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పోటీపడనున్న హరీందర్ సింగ్, గురియల్ సింగ్, కైగోలాల్‌లతో కూడిన భారత బృందం

రెండో రౌండ్లోకి ప్రజ్నేష్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయర్ పోటీల్లో భారత ఆటగాడు ప్రజ్నేష్ గుణేశ్వరన్ పోరాడి గెలిచి రెండో రౌండ్లోకి చేరుకున్నాడు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో క్రొయేషియాకు చెందిన విక్టర్ గాలోవిక్‌ను 6-4, 6-4 వరస సెట్లలో ఓడించాడు. మ్యాచ్ అనంతరం ప్రజ్నేష్ మీడియాతో మాట్లాడుతూ.. ఇది సాధారణ మ్యాచ్‌గా సాగింది. నేను భాగానే ఆడాను. మ్యాచ్‌కు ముందే మానసికంగా సిద్ధమయ్యాను. ఫలితం సకారాత్మకంగా వచ్చిందిఅని ప్రజ్నేష్ అన్నాడు. తొలిసెట్ ప్రారంభంలోనే ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేశాను. చివరి వరకు అదే జోరుతో ఆడి సెట్‌ను గెలుచుకున్నాను. రెండో సెట్లో 4-4తో స్కోరును సమానం చేశాను. అనంతరం ముందుకు సాగి 6-4తో రెండో సెట్‌ను కూడా గెలుచుకున్నాను అని చెప్పాడు. ప్రజ్నేష్ రెండో రౌండ్లో స్పెయిన్‌కు చెందిన లోపెజ్ పెరెజ్(213 ర్యాంకు)తో తలపడనున్నాడు. 2018లో ప్రజ్నేష్ నాలుగు చాలెంజర్ స్థాయి టోర్నీల్లో ఫైనల్స్‌కు చేరి రెండు టైటిళ్లు దక్కించుకున్నాడు. తన కెరియర్లో తొలిసారిగా గ్రాండ్ స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్‌లో మెయిన్ డ్రాకు ఎంపికైయ్యాడు. మూడో రౌండ్లో ఎలియాస్ ఎమర్‌చేతిలో ఓడినప్పటికి.. ప్రజ్నేష్ మెయిన్ డ్రాకు ఎంపికయ్యాడు.

సింధు గెలిచినా.. హైదరాబాద్ ఓటమి

బెంగళూరు: పీబీఎల్ సీజన్ 4 టోర్నీలో టాప్ షట్లర్ పీవీ సింధు గెలిచినా హైదరాబాద్ హంటర్స్ ఓటమిచెందింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో హంటర్స్ 4-3 తేడాతో ఢిల్లీ డాషర్స్ చేతిలో ఓడింది. ఈ ఓటమితో పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో ఉన్న హంటర్స్ 24 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయింది. అవదె వారియర్స్ 25 పాయింట్లతో అగ్ర స్థానం పొందింది. ఢిల్లీకి ఈ టోర్నీలో తొలి విజయం ఇది. ఈ రోజు మ్యాచ్‌ను చూడటానికి టెన్నిస్ స్టార్ సానియా మీర్జా వచ్చి సింధుకు ప్రోత్సాహాన్నందించింది. మహిళ సింగిల్స్‌లో ట్రంప్ మ్యాచ్‌గా ఆడిన సింధు నిరాశపర్చలేదు. వరల్డ్ నెం.32 ఈవ్‌జెనియా కొసెట్స్‌కయా(రష్యా) ను 15-11, 15-9 తేడాతో ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్(ఢిల్లీ) 15-12, 9-15, 15-10 తేడాతో రాహుల్ యాదవ్(హైదరాబాద్)ను ఓడించాడు. పురుషుల డబుల్స్‌లో బియావో-జాంగ్‌జిత్(ఢిల్లీ) ట్రంప్ మ్యాచ్‌గా ఆడి 15-8, 15-9, 8-15 తేడాతో జార్జి-ఇసారా(హైదరాబాద్)ను ఓడించారు. రెండో సింగిల్స్‌లో సుగియార్తో(ఢిల్లీ) 15-11, 15-6 తేడాతో కాలిజో(హైదరాబాద్)ను ఓడించింది. మిక్స్‌డబుల్స్‌లో హైదరాబాద్ జోడి కెఎస్ రాంగ్- ఈహెచ్ వాన్ 15-7, 15-12 తేడాతో సీజీ- లీ జోడీపై విజయం సాధించింది. అవదే వారియర్స్- నార్త్ ఈస్టర్న్ వారియర్స్ మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో అవదే వారియర్స్ 5-0 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో అవధే వారియర్స్ పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో నిలిచింది.

శరత్ కమల్‌కు తొమ్మిదో జాతీయ టైటిల్

కటక్: టీటీ ఆటగాడు ఆచంట శరత్ కమల్ అత్యధిక జాతీయ టేబుల్ టెన్నిస్ టైటిళ్లు గెలిచిన రికార్డును సొంతం చేసుకున్నాడు. బుధవారం జరిగిన జాతీయ టీటీ టోర్నీ ఫైనల్లో శరత్ తన సహచరుడు జి సాతియాన్‌ను 4-3తేడాతో ఓడించాడు. ఇది శరత్‌కు తొమ్మిదో టైటిల్. గతంలో కమలేష్ మెహతా సాధించిన 8 టైటిళ్ల రికార్డును శరత్ అధిగమించాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.